RNI.No.TELTEL/2013/52694

Estd.: 2000

www.voodayam.com /voodayam /Voodayam





# వుదయం

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal

సంపుటి : 12 || సంచిక : 269 || ఆదిలాబాద్ || మంగళవారం, మార్చి 18, 2025 || VOODAYAM Telugu Daily || వెల : రూ. 3.00 || పేజీలు : 12

# ఇది పార్టీ పథకం కాదు ప్రజల పథకం...







- రాజీవ్ యువ వికాసం ద్వారా నియోజకవర్గానికి 4 నుంచి 5 వేల మందికి ఉపాధి
- రూ.50వేల నుంచి రూ. 4 లక్షల వరకు మంజూరు చేస్తాం
- దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించాం
- జూన్ 2 న లబ్ధిదారుల జాబితా ప్రకటన
- రాజీవ్ యువ వికాసం పథకం ప్రారంభ కార్యక్రమంలో సీఎం రేవంత్
- మంత్రులను తొలగిస్తేనే నాకు పరిపాలనపై పట్టున్నట్టా...?

హైదరాబాద్ : రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగులకు స్వయం ఉపాధి పథకాలు, అందుకనుగుణంగా ఆర్థికం సాయం చేసేందుకు రూపొందించిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని సోమవారం శాసనసభ ప్రాంగణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు, పలువురు శాసనసభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పాటైన తొలి ఏడాదిలోనే 54 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలును భర్తీ చేశామని చెప్పారు. తొలి ఏడాదిలోనే ఇంత భారీ సంఖ్యలో ఉద్యోగాలు ఇచ్చిన రాష్ట్రం మరొకటి లేదన్నారు. రాష్ట్రంలో 50లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 43 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని గుర్తు చేశారు. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న 65 లక్షల మంది మహిళలకు త్వరలోనే 1.20 కోట్ల నాణ్యమైన చీరలను పంపిణీ చేస్తామని వెల్లడించారు. ఈ రకంగా రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. తనకు పరిపాలనపై పట్టు లేదంటూ కొందరు కామెంట్లు చేస్తున్నారు, గత సీఎంల మాదిరిగా క్యాబినెట్ నుంచి మంత్రులను తొలగిస్తేనే పట్టున్నట్టా? అధికారులను తొలగించి, బదిలీలు చేస్తేనే పాలనపై పట్టు సాధించినట్టా? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. అన్నింటినీ సవ్యంగా సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్లడమే తన విధానమని ఆయన స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం కలిగించడమే తన లక్ష్యమని తెలిపారు. ఎలాంటి ఆరోపణలు లేకుండా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పథకాల అమల్లో పారదర్శకంగా వ్యవహరించాలంటూ తమ పార్టీ ఎమ్మెల్యేలను, అసలైన అర్హులకే పథకాలను వర్తింపజేయాలంటూ అధికారులను ఆదేశించామని వివరించారు. మన సమాజానికి కుల గణన అనేది ఎక్స్ రే లాంటిదంటూ తమ నేత రాహుల్ గాంధీ చెప్పారని సీఎం వివరించారు. అది దేశమంతటా జరగాలంటూ ఆయన నొక్కి చెప్పారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లును కూడా ప్రవేశపెట్టామని అన్నారు. ఎస్సీల వర్గీకరణ కోసం 35 ఏళ్లుగా ఉద్యమం సాగుతోందనీ, దశాబ్దాలుగా నానుతున్న ఈ సమస్యపై కూడా అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టామని తెలిపారు. గత బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో భారీగా అవినీతి, దుబారా జరిగాయని విమర్శించారు. ఈ క్రమంలో దుబారాను, ఖర్చునూ తగ్గించుకుంటూ అప్పులను చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. ఇతర రంగాలతో పోలిస్తే ఒక్క ఇసుక విక్రయంలోనే రోజువారీ ఆదాయం రూ.3 కోట్లు పెరిగిందనీ, జీఎస్టీ వసూళ్లలో 17 శాతం పెరుగుదల నమోదైందని వివరించారు. ధరల పెరుగుదలను నియంత్రించడంలో దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్‌గా ఉందని సీఎం వ్యాఖ్యానించారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూనే స్వయం ఉపాధి కల్పించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ పథకాన్ని ఉపయోగించుకోవాలంటూ నిరుద్యోగ యువతకు ఆయన సూచించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే గ్రూప్-1 పరీక్షలు నిర్వహించి, ఫలితాలను కూడా విడుదల చేశామని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఒకప్పుడు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని ధర్నాలు జరిగేవనీ, ఇప్పుడు ఒక నోటిఫికేషన్‌కు మరో నోటిఫికేషన్‌కు మధ్య గ్యాప్ ఇవ్వాలంటూ నిరుద్యోగులు కోరుతున్నారని తెలిపారు.



### కేంద్ర ప్రభుత్వం ఏర్పాటులో దక్షిణాది రాష్ట్రాల పాత్ర

## అనివార్యం కావాలి

- సైంటిఫిక్ విధానం కనుగొనేవరకు
- పునర్విభజన అంశాన్ని వాయిదా వేయాలి
- నియోజకవర్గాల పునర్విభజన పై అఖిలపక్ష సమావేశంలో నేతలు

హైదరాబాద్ : కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు క్రమంలో దక్షిణాది రాష్ట్రాల పాత్ర అనివార్యంగా ఉండేలా నియోజకవర్గాల పునర్విభజన ఉండాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అభిప్రాయపడ్డారు. నియోజకవర్గాల పునర్విభజనపై సోమవారం అసెంబ్లీ ఆవరణలోని కమిటీ హాల్ లో జరిగిన అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్, సిపిఐ, ఎంఐఎం, సిపిఎం, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్, రిపబ్లిక్ కన్ పార్టీ ఆఫ్ ఇండియా నేతలు పాల్గొని వారి అభిప్రాయాలు తెలియజేశారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలు ప్రధానంగా తెలంగాణ నష్టపోతుంది ఈ ప్రమాదాన్ని ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై చర్చలు, ఆలోచనలు చేయాలని సమావేశానికి హాజరైన రాజకీయ పక్షాలను డిప్యూటీ సీఎం కోరారు. మన గౌరవం, ప్రాధాన్యత కాపాడుకుంటూ భారత దేశంలో మన అందరి పాత్ర ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి కోరిక మేరకు ఈ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశానికి బీ ఆర్ఎస్ నేతలను సైతం ఆహ్వానించినప్పటికీ వారు ప్రత్యేక రాజకీయ కారణాల తో సమావేశానికి హాజరు కాలేమని తెలిపారని డిప్యూటీ సీఎం వివరించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి పార్లమెంటు సమావేశంలో బిజీగా ఉండడం, ప్రత్యేక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో వారు హాజరు కాలేదని డిప్యూటీ సీఎం వివరించారు. సమావేశానికి హాజరైన నేతలంతా ఇచ్చిన సమాచారం మేరకు భవిష్యత్తులో ఈ అంశంపై ఎలా ముందుకు వెళ్లాలో ప్రణాళిక తయారు చేసుకొనే అవకాశం ఉంటుందని డిప్యూటీ సీఎం వివరించారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన ఏర్పాటు ను వ్యతిరేకిస్తూ శాసనసభలో చర్చించి ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి అని ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఓవైసీ అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశంలో ఆందోళనకు దారి తీయకుండా కొంతకాలం ఇదే విధానం కొనసాగించాలని, నియోజకవర్గాల పునర్విభజన పై కేంద్రం ఆలోచన చేయకపోతే ప్రమాదం ఉందన్న స్పృహ వారికి కలగజేయాలి నీ సీనియర్ నేత జానారెడ్డి అభిప్రాయపడ్డారు. ఒక సైంటిఫిక్ నిర్ణయం వచ్చేవరకు నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉత్తరాదిలో పెరుగుతున్న సీట్ల శాతానికి అనుగుణంగా దక్షిణాది రాష్ట్రాల్లోనూ సీట్ల సంఖ్య పెంచాలని సిపిఐ శాసనసభ పక్ష నేత %ఎ% .సాంబశివరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఓవైపు ఈ అంశంపై పోరాటం చేస్తూ మరోవైపు సైంటిఫిక్ పరిష్కారం కోసం రాష్ట్రంలోని రాజకీయ పక్షాలు నిత్యం ఆలోచన చేయాలని కూనంనేని, వెస్లీలు అభిప్రాయం వ్యక్తం చేశారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ నియోజకవర్గ పునర్విభజనపై జాతీయస్థాయిలో ఒక పాలసీని తీసుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఫెడరల్ స్టేట్ అంటే ప్రతి రాష్ట్రానికి సమాన హక్కు ఉండాలి, నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందడుగు వేయడం అభినందనీయమని సిపిఎం మాస్ లైన్ నేత హనుమేష్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉత్తరాదిలో పెరుగుతున్న సీట్ల శాతం ప్రకారం దక్షిణాదిలోను నియోజకవర్గం పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ గౌడ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇది ప్రాథమిక సమావేశమైనని రాబోయే రోజుల్లో విస్తృతంగా ఈ అంశంపై చర్చ, కార్యక్రమాలు చేపట్టాలని అఖిలపక్ష సమావేశానికి హాజరైన నేతలు అభిప్రాయపడ్డారు. నియోజకవర్గాల పునర్విభజన వ్యతిరేకిస్తూ అఖిలపక్ష కమిటీ ఏ నిర్ణయం తీసుకున్న ఆచరణలో పెట్టేందుకు సిద్ధమని సమావేశానికి హాజరైన పార్టీల నేతలు తెలిపారు. సమావేశానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు

కె.జానారెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, ఎంఐఎం శాసనసభక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా నాయకులు హనుమేష్, సూర్యం, మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి, పల్లా వెంకట్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నెల్లికంటి సత్యం, రిపబ్లిక్ అన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి సిహెచ్ బాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు బి మహేష్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం దుర్గాప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

### జనం నిలదీస్తే ..ప్రజలు ప్రశ్నిస్తే జర్నలిస్టులను

## జైలుకు పంపుతారా?

- ఆడబిడ్డలను అక్రమ కేసులతో జైల్లో వేయడమే ఇందిరమ్మ రాజ్యమా?
- ప్రజల్లో ఉన్న అసహనాన్ని చూపిస్తున్నందుకే జర్నలిస్టులపై రేవంత్ రెడ్డి అక్కసు
- గతంలో తమపై అడ్డగోలుగా మాట్లాడిన రేవంత్ కు కుటుంబాలు గుర్తుకురాలేదా?
- తెలంగాణ రైజింగ్ కాదు తెలంగాణ ఈజ్ ఫాలింగ్
- బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు
- చంచల్ గూడ జైల్లో జర్నలిస్టులు రేవతి, తన్వియాదవ్ లకు పరామర్శ

హైదరాబాద్ : అక్రమ కేసులతో ఆడబిడ్డలను జైల్లో వేయడమే ఇందిరమ్మ రాజ్యమా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్ అనే పిచ్చోడి చేతిలోని రాయిలెక్క తెలంగాణ మారిందని విమర్శించారు. 420 బూటకపు హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కిందన్న కోపంతో ముఖ్యమంత్రికి అర్థం కావడానికి ఆయన మాట్లాడే బజారు భాషలోనే జనం నిలదీస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులతో చంచల్ గూడ జైల్లో ఉన్న జర్నలిస్టులు రేవతి, తన్వియాదవ్ లను బీఆర్ఎస్ సీనియర్ నాయకులతో కలిసి కేటీఆర్ పరామర్శించారు. రేవతి, తన్వియాదవ్ కు ధైర్యం చెప్పారు. జర్నలిస్టుల కుటుంబసభ్యులను కేటీఆర్ ఓదార్చారు. రేవతి, తన్వి యాదవ్ తరపున న్యాయపోరాటం చేస్తామని హామి ఇచ్చారు. రేవతి, తన్వియాదవ్ ను పరామర్శించిన తరువాత మీడియాతో మాట్లాడిన కేటీఆర్, రేవంత్ మీద ప్రజల్లో ఉన్న అసహనాన్ని చూపిస్తున్నందుకే జర్నలిస్టలపై ముఖ్యమంత్రి అక్కసు వెళ్ళగక్కుతున్నారని మండిపడ్డారు. జనం నిలదీస్తే ..ప్రజలు ప్రశ్నిస్తే జర్నలిస్టలపై ఉక్కు పాదం మోపుతారా? జైలుకు పంపుతారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం మీద ప్రజల్లో ఉన్న అసహనాన్ని చూపిస్తున్న డిజిటల్ జర్నలిస్టలపై అక్రమ కేసులు, దాడులతో వేధించడం ప్రజాస్వామ్య హననమే" అన్నారు. ఒకరిద్దరు జర్నలిస్టులపైనే కాదు పదుల సంఖ్యలో జర్నలిస్టులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం వేధిస్తుందని కేటీఆర్ ఆరోపించారు. తాను ఎంతో గొప్పగా చెప్పిన మొహబ్బత్ కి దుకాన్ అంటే ఇదేనో కాదో చెప్పాలని రాహుల్ గాంధీని డిమాండ్ చేశారు. జర్నలిస్టలను బట్టలు ఊడదీసి కొడ్తానని మాట్లాడుతున్న రేవంత్ రెడ్డికి కాలమే సమాధానం చెబుతుందన్నారు. ప్రజల ఆక్రోశాన్ని చూపించడమే రేవతి, తన్వి యాదవ్ చేసిన తప్పా? అని ప్రశ్నించిన కేటీఆర్, రేవంత్ నియంతృత్వ పోకడలను అడ్డుకోకుండే రేపు మిగతా జర్నలిస్టలకు కూడా ఇదే గతి పడుతుందని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి అక్రమాలపై మీడియా గొంతు విప్పి మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ చెప్పిన ఇందిరమ్మ రాజ్యం అంటే అదేదో సంక్షేమ రాజ్యం అని ప్రజలు భ్రమపడ్డారని కేటీఆర్ చెప్పారు. కెసిఆర్ కంటే ఎక్కువ సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని అపోహ పడ్డారని తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వ వ్యవహార శైలిని చూస్తుంటే ఇందిరమ్మ రాజ్యం అంటే ఎమర్జెన్సీ రోజులే అన్న సంగతి మరోసారి స్పష్టం అయిందన్నారు. 6 గ్యారంటీలతో పాటు ఏడో గ్యారెంటీ ప్రజాస్వామ్యమని పెద్ద పెద్ద మాటలు చెప్పిన రేవంత్ రెడ్డి, ప్రజలు గొంతు విప్పితే మాత్రం తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమను మోసం చేసిందని ప్రజలు అంతా ఓపెన్ గా మాట్లాడుకుంటున్నారని చెప్పారు. తన భార్యా పిల్లలను దూషిస్తున్నారని బాధపడుతున్న రేవంత్ రెడ్డి గతంలో తమ మీద అడ్డగోలుగా అవాస్తవాలు



మాట్లాడిన సంగతి మర్చిపోయారా అని కేటీఆర్ పశ్నించారు. తన పిల్లల ప్రస్తావన తీసుకొచ్చినప్పుడు రేవంత్ కు కుటుంబం గుర్తుకురాలేదా అని నిలదీశారు. రేవంత్ మాట్లాడితే మంచిది ఇంకొకరు మాట్లాడితే మంచిది కాదా ? అన్నారు. ఇకనైనా రేవంత్ రెడ్డి బుద్ధి తెచ్చుకోవాలన్నారు. జైల్లో పెడతామంటే భయపడడానికి బీఆర్ఎస్ లో ఎవరూ లేరన్న కేటీఆర్, తామంతా ఉద్యమాల నుంచి వచ్చామన్నారు. ప్రభుత్వ బెదిరింపులు, అక్రమకేసులకు భయపడే వాళ్ళంకాదని స్పష్టం చేశారు. అధికారమందంతో విర్రవీగుతున్న రేవంత్ రెడ్డికి రేపు కచ్చితంగా తగిన శాస్తి జరుగుతుందన్నారు. ఆయనకు వంతపడే వాళ్లకు కూడా సేమ్ టూ సేమ్ జరుగుతుందన్నారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా ప్రజల తరపున ప్రశ్నిస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 71 వేల కోట్ల ఆదాయం తగ్గిందన్న రేవంత్ రెడ్డి, అన్ని రంగాల్లో తెలంగాణ విఫలమైన సంగతినిస్వయంగా ఒప్పుకున్నారని కేటీఆర్ చెప్పారు. రేవంత్ అసమర్థ విధానాల వల్లనే ఆదాయం తగ్గిందన్నారు. కాంగ్రెస్ వచ్చినంక తెలంగాణ లో అన్ని రంగాలు చాలా బాగున్నాయి అని చెప్పుకున్న రేవంత్ రెడ్డి, 71 వేల కోట్ల ఆదాయం ఎలా తగ్గిందో ప్రజలకు చెప్పాలన్నారు. తెలంగాణ రైజింగ్ కాదు తెలంగాణ ఈజ్ ఫాలింగ్ అన్న చేదు నిజాన్ని ముఖ్యమంత్రి కన్ఫర్మ్ చేశారన్నారు. పిచ్చోడైన రేవంత్ రెడ్డి చేతిలో రాయిల తెలంగాణ మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.



### కేంద్ర మాజీ మంత్రి దేబేంద్ర ప్రధాన్ కన్నుమూత

: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంతాపం

న్యూ డిల్లీ మార్చి 17: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇంట విషాదం నెలకొంది. ఆయన తండ్రి, కేంద్ర మాజీ మంత్రి దేబేంద్ర ప్రధాన్ కన్నుమూశారు. ప్రస్తుతం ఆయన వయసు 84. అనారోగ్యం కారణంగా సోమవారం కన్నుమూశారు. ఆయన మృతి పట్ల పలువురు రాజకీయ నేతలు సంతాపం తెలుపుతున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సైతం దేబేంద్ర ప్రధాన్ భౌతికకాయానికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.

# సంపాదకీయం

## ఈ దారుణాలకు అంతం లేదా..

దేశంలో కశ్మీర్‌నుంచి కన్యాకుమారి వరకు ఎన్నో చారిత్రక పర్యాటక ప్రాంతాలున్నాయి. వీటిని సందర్శించడానికి విదేశాల నుంచి కొన్ని వేల మంది పర్యాటకులు వస్తుంటారు. భారత పర్యాటకరంగం ప్రస్తుతం 250 బిలియన్ డాలర్ల ఆదాయంతో వర్ధిల్లుతుండగా, మరో పదేళ్లకు 523 బిలియన్ డాలర్ల వరకు వృద్ధి చెందుతుందని అంచనా. 2023లో విదేశీ పర్యాటకులు 9.24 మిలియన్ల మంది వరకు అరుదెంచగా, 2028 నాటికి ఈ సంఖ్య 30.5 మిలియన్లకు చేరుతుందని అంచనా. 2034 నాటికి జిడిపికి రూ. 43,25,000 వరకు ఆదాయం సమకూరుతుందని చెబుతున్నారు. ఈ అద్భుతమైన అంచనాలు సాకారం కావాలంటే స్వదేశీ, విదేశీ పర్యాటకులకు తగిన ఆతిథ్యం నుంచి భద్రత వరకు వివిధ సదుపాయాలు కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వానిదే. ఎలాంటి భయాందోళనలకు, అఘాయిత్యాలకు గురికాకుండా పర్యాటకులు స్వేచ్ఛగా, నిర్భయంగా చారిత్రక, సుందర ప్రదేశాలను సందర్శించే ప్రశాంత వాతావరణం ఉన్నప్పుడే పర్యాటకులు తమ జీవితాంతం ఈ జ్ఞాపకాలను గుర్తు పెట్టుకోగలుగుతారు. కానీ గత రెండు మూడేళ్లుగా విదేశీ పర్యాటకులపై ముఖ్యంగా మహిళలపై అఘాయిత్యాలు జరుగుతుండడం భారత పర్యాటక రంగాన్ని అప్రతిష్ఠపాలు చేస్తున్నాయి. దక్షిణాదిలోని హంపీ విజయనగర సామ్రాజ్య చారిత్రక ఆనవాళ్లు ప్రపంచ చరిత్రలో చెప్పుకోదగినవి. 14 వ శతాబ్దం నుంచి 16 వ శతాబ్దం వరకు విజయనగర వైభవం వర్ధిల్లింది. ఆ సామ్రాజ్య పరిపాలకుల్లో శ్రీకృష్ణదేవరాయలు కీర్తి చిరస్మరణీయం. ఆనాటి కట్టడాల శిథిలాలను సందర్శించడానికి విదేశాల నుంచి విశేష సంఖ్యలో టూరిస్టులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో మార్చి 6 వ తేదీ రాత్రి టూరిస్టులపై జరిగిన అఘాయిత్యం సంచలనం కలిగించింది. ఇజ్రాయెల్ నుంచి వచ్చిన టూరిస్టు యువతి, అమెరికా టూరిస్టు డేనియల్, నాసిక్‌కు చెందిన టూరిస్టు పంకజ్, ఒడిశాకు చెందిన బిబ్బాస్, స్థానిక హెూమ్‌స్టే యజమానురాలు హంపీ సమీపంలో అనెగొంది ప్రాంతంలో మార్చి 6 వ తేదీ రాత్రి నక్షత్రాలను సందర్శించడానికి వెళ్లగా వీరిపై దుండగులు దాడి చేశారు. ఇజ్రాయెల్ టూరిస్టు యువతిపైన, హెూమ్‌స్టే యజమానురాలిపైన ముగ్గురు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. వారి వద్ద ఉన్న రూ. 9500 నగదు, రెండు మొబైల్ ఫోన్లను కాజేశారు. ఈ బృందంలో ఉన్న ముగ్గురు పురుషులపై దాడి చేసి వారిని తుంగభద్ర కాలువలోకి తోసేశారు.డేనియల్, పంకజ్ ప్రాణాలతో బయటపడగా బిబ్బాస్ మృతదేహం తరువాత బయటపడింది. కొప్పల్ ప్రాంతంలోని సనపుర సరస్సువద్దకు రాత్రి పూట నక్షత్రాలను సందర్శించడానికి సాధారణంగా ఎవరూ వెళ్లరని, అక్కడ చిరుత పులులు, ఎలుగుబంట్లు ఎక్కువగా సంచరిస్తుంటాయని స్థానికులు చెప్పారు. ఈ దుర్ఘటన హంపీ క్షేత్ర పర్యాటక చరిత్రలో విషాద ఘట్టంగా మిగిలింది. హంపీ సర్కిల్ ఆర్కియాలజీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం 202425 డిసెంబర్ వరకు 5.8 లక్షల స్వదేశీ టూరిస్టులు, 9357 మంది విదేశీ టూరిస్టులు హంపీని సందర్శించడానికి రాగా, వీరిలో ఇజ్రాయెల్, ఐరోపాకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారు. ఏటా హెూలీ వేడుక జరుపుకోవడానికి హంపీకి టూరిస్టులు భారీ సంఖ్యలో వస్తుంటారు. కానీ ఈసారి టూరిస్టుల సంఖ్య బాగా తగ్గింది. అత్యాచార సంఘటన కూడా దీనికి కారణం కావచ్చు. హంపీ ప్రాంతంలో అనధికార అతిథి గృహాలు ఎక్కువగా నడుస్తున్నాయి. 2020 లో తుంగభద్ర నదిలోని విరుపాపుర గడ్డి ద్వీపంలో ఏర్పాటైన అక్రమ రిసార్టులను అధికారులు కూల్చివేశారు. ఇక్కడ విస్కీ పార్టీలు, డ్రగ్ వినియోగం భారీగా జరుగుతోందని స్థానికులనుంచి ఫిర్యాదులు కూడా పోలీసులకు అందుతున్నాయి. హంపీ ప్రాంతంలో టూరిస్టులపై అత్యాచార సంఘటన మరువక ముందే హంపీ ప్రాంతంలోనే మరో ఇజ్రాయెల్ టూరిస్టు మహిళపై అత్యాచారం జరిగినట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇదిలా ఉండగా, భారత పర్యటనకు వచ్చిన ఓ బ్రిటిష్ మహిళపై ఢిల్లీలోని హెూటల్‌లో ఇద్దరు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడిన సంఘటన జరిగింది. మహారాష్ట్ర, గోవాలో పర్యటించడానికి బాధితురాలు గత నెలలో భారత్‌కు చేరుకున్నారు. కొద్ది రోజుల పాటు ముంబైలో పర్యటించారు. ఈ నేపథ్యంలో ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో కైలాస్ అనే 24 ఏళ్ల వ్యక్తితో పరిచయం అయింది. తనను కలిసేందుకు ఢిల్లీ రావాలని కైలాస్ కోరడంతో ఆమె ఢిల్లీ చేరుకున్నారు. మహీపాల్ పుర్ ప్రాంతంలో ఓ హెూటల్‌లో గది తీసుకున్నారు. తొలుత ఆ రాత్రి హెూటల్‌లో పనిచేసే వ్యక్తి లిఫ్ట్‌లో తనపై లైంగికంగా దాడి చేశాడని, ఆ తర్వాత కైలాస్ అత్యాచారానికి పాల్పడ్డాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. 2024 మార్చిలో జార?ండ్‌లోని దుమ్‌కా జిల్లా లో భారత్‌లో పర్యటించడానికి వచ్చిన స్పెయిన్ దంపతులపై దుండగులు దాడి చేయడమేకాక, స్పెయిన్ మహిళపై అత్యాచారం జరపడం దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. బీహార్ మీదుగా నేపాల్ బయలుదేరిన వీరు ప్రపంచ యాత్రకు సిద్ధం అయ్యారు. దారిలో ఓ ప్రాంతంలో తాత్కాలిక గుడారంలో ఉన్న ఆమెపై స్థానిక యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. దీనిపై ప్రపంచ దేశాల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. ఈ దారుణంపై జార?ండ్ అసెంబ్లీలో తీవ్ర దుమారం రేగింది. మొత్తం ఏడుగురు ఈ దారుణానికి పాల్పడ్డారు. ఈ సంఘటనలను పరిశీలిస్తే దేశంలోని పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులకు తగిన భద్రత ప్రశ్నార్థకంగా తయారైంది. దేశం మొత్తం మీద శిక్షణ పొందిన, రిజిస్టర్ అయిన టూరిస్టు గైడ్లు ఉన్నప్పటికీ, ప్రత్యేక పోలీస్ బలగాల రక్షణ మాత్రం లోటుగా కనిపిస్తోంది. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు కేంద్రం కూడా పర్యాటక ప్రదేశాలకు తగిన భద్రత కల్పించవలసిన అవసరం ఉంది.

# ఆధ్యాత్మికతతో తరిస్తున్న ప్రభుత్వాలు

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కూటమి లక్ష్యమైన 'హిందూ రాజ్య స్థాపన' ఎజెండా బహుముఖ పద్ధతుల్లో ప్రాచుర్యం పొందిన కథనాలపై నిర్మించబడుతుంది. దాని ఎజెండాను ముందుకు తీసుకెళ్లే అంశాల్లో పండుగలు ఒకటి. 'సామాజిక రాజకీయ సందేశం' లో భాగంగా కొద్దిమంది దేవతల్ని ముందుకు తీసుకొని రావడం కూడా రాజకీయ రంగంలో ప్రధానమైన మార్గంగా ఉంది. ఇటీవలి కాలంలో జరిగిన కుంభమేళా ఓ పెద్ద దృశ్యం. మతపరమైన సమ్మేళనం కంటే కూడా ఇది ఒక జాతీయ కార్యక్రమంగా మారింది. ఈ సంవత్సరం జరిగిన కుంభమేళాలో ఒక ప్రధానమైన మార్పు ఏమంటే, దాని భారీ మార్కెటింగ్ ఒక సాంస్కృతిక, అభివృద్ధి ప్రదర్శనగా మారింది. దాన్ని, హిందూ మతం కోసం ఏర్పాటు చేసిన 'భూమి పై మహా ప్రదర్శన' గా ముద్ర వేశారు. అలాంటి సందర్భాల్లో భక్తుల కోసం బస, పరిశుభ్రత, రవాణా ఏర్పాట్లు ప్రభుత్వం తప్పనిసరిగా నిర్వర్తించాల్సిన విధి. ఈ దఫా ఈ కార్యక్రమాన్ని నిర్వహించే ప్రక్రియలో ప్రభుత్వం పూర్తిగా నిమగ్నమైంది. విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్ పీ), ధర్మ సంసద్, లాంటి పాలక పార్టీ అనుబంధ సంస్థలు, వ్యక్తిగత సాధువుల లాంటి వారు కూడా హిందూ జాతీయవాద ఎజెండాలోని అంశాల్ని, 'ముస్లింల పట్ల ద్వేష భావాల్ని' ప్రచారం చెయ్యడంలో ముందు భాగంలో ఉన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మతపరమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యతను ఒకవైపున భక్తులు ఎంతగానో అభినందిస్తుండగా, ఈసారి కుంభ మేళాకు ఒక రాజకీయ రంగును ఇస్తుండడం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. కుంభమేళాను నిర్వహించడం ఇదే ప్రథమం కాదు. ఈసారి ఈ సందర్భం, హిందూత్వ ఎజెండా ప్రాధాన్యతను పెంచే వేదికగా మారింది. జన సమూహాల నిర్వహణ సాధ్యం కాదని గుర్తించినప్పటికీ కూడా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆహ్వానించేందుకు ప్రకటనల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. ఈ కార్యక్రమంలో ముస్లిం వ్యాపారస్తులు తమ దుకాణాలు ఏర్పాటు చేసే ప్రక్రియను బహిష్కరించారు. దీనికి అనేక కారణాలున్నాయి. ముస్లింలు ఆహారంలో ఉమ్మి వేశారు కాబట్టే వారిని దూరంగా ఉంచారనే విషయాన్ని స్వామీ అవిముక్తేశ్వరానంద్ ఒక అబద్ధం చెప్పాడు. అలాంటి తప్పుదారి పట్టించే చాలా వీడియోలు సామాజిక మాధ్యమంలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ సందర్భంగా తొక్కిసలాటలో బాధితులైన వారి కోసం ముస్లింలు మసీదుల్ని తెరిచి, వారి కోసం ఆహారాన్ని ఏర్పాటు చేయడం వేరే విషయం. మొగలుల పాలనా కాలంలో భక్తులకు కుంభమేళా మరింత సౌకర్యవంతంగా ఉంచడానికి అనేక ఘాట్‌లు (స్నానాల కోసం నదీ తీరాలు), మరుగుదొడ్లు నిర్మించిన విషయం గుర్తుకొస్తుంది. అక్బర్, కుంభమేళా ఏర్పాట్లను చూసేందుకు ఇద్దరు అధికారులను నియమించాడని హేరాంబ్ చతుర్వేది అనే చరిత్రకారుడు చెప్పారు. ఈ సంవత్సరం ఆ ప్రాంతమంతా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ హోర్డింగులతో నిండిపోయింది. ఈసారి వీఐపీల కోసం విశాలంగా ఎక్కువ ప్రాంతాన్ని కేటాయించడంతో తొక్కిసలాటలు జరిగాయి, దానిలో చాలా పెద్దసంఖ్యలో భక్తులు చనిపోయారు. రవాణా ఏర్పాట్లు చాలా ఘోరంగా ఉన్నాయి. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో సంభవించిన మరణాల్లో ఈ రవాణా ఏర్పాట్లు ప్రతిబింబిస్తాయి. తొక్కిసలాటలో చనిపోయిన వారంతా మోక్షం (విముక్తి) పొందారని, మోడీ, తాను తమ్ముడని పిలుచుకునే ఉన్నత శ్రేణి స్వామి, ధీరేంద్ర శాస్త్రి చాలా సంతోషంగా చెప్పాడు. నీటి నాణ్యత అధిక మల మూత్రాలతో చాలా తక్కువ స్థాయిలో ఉంది. నీటి నాణ్యత, మరణాల గురించి వచ్చిన విమర్శలన్నింటికీ, "పందులు మురికిని చూస్తున్నాయి, స్వార్థపరులు చనిపోయిన వారిని లెక్కిస్తున్నారని" ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ వ్యాఖ్యానించాడు. వీహెచ్‌పీ, దాని మార్గదర్శక్ మండల్ సమావేశాల కోసం కుంభమేళాను ఒక సువర్ణావకాశంగా ఉపయోగించుకుంది. వారి ప్రసంగాలు మొత్తం ముస్లింలపై విషాన్ని చిమ్మాయి. జనాభా పెరుగుదల, బంగ్లాదేశ్ నుంచి చొరబాటుదారులు, గో రక్షణ లాంటి ముస్లింల గురించి సాధారణంగా చేసే ప్రచా రం వివిధ సమావేశాల్లో అదే పనిగా రోత పుట్టించే రీతిలో పునరావృతం అయ్యింది. సాధ్వి రితంభర, ప్రవీణ్ తొగాడియా, యతి నర్సింగ్ నానంద్ సరస్వతీ లాంటి ద్వేషాన్ని వ్యాపింపచేసే వారు ద్వేషపూరిత ప్రసంగాలతో సంబరాలు చేసుకున్నారు. ప్రేక్షకులు కూడా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పాలక భారతీయ జనతా పార్టీ దాని రాజకీయ ఎజెండా కోసం విజయవంతంగా సాధువులను ఉపయోగించుకొని, ప్రభుత్వ ఖర్చుతో ప్రచారాన్ని పొదింది. కాశీ, మధురల డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తూ, 1860 దేవాలయాలపై 'పరిశోధనలు' జరిపామనీ, వాటిని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని కాషాయ వస్త్రాలు ధరించిన ఒక వ్యక్తి పేర్కొన్నాడు. హిందూ రాజ్యాన్ని స్థాపించడానికి మదర్సాలను మూసివేసి, ఇంగ్లీష్ పాఠశాలల్ని గురుకులాలుగా మార్చాలని కూడా డిమాండ్ చేశారు. 2024 లో ప్రచురితమైన ఒక పుస్తకంలో ఇర్ఫాన్ ఇంజనీర్, నేహా దభాడే, మత సంబంధమైన పండుగలను హింసను ప్రేరేపించే సందర్భాలుగా ఉపయోగించడంపై మన దృష్టిని ఆకర్షించారు. మన పండుగలు మతపరమైన హద్దులు దాటి ఆహ్లాదకరమైన సామాజిక సందర్భాలుగా ఉంటున్నాయి. ఇప్పుడేమో హిందూ పండుగల సందర్భంగా ఊరేగింపులు నిర్వహించడం, ముస్లింల నివాస ప్రాంతాల గుండా వెళ్లడం, మసీదులపై ఉన్న ఆకుపచ్చ జెండాను కాషాయ జెండాగా మార్చడం, చేతుల్లో కత్తులు పట్టుకొని నృత్యం చెయ్యడం ఒక ధోరణిగా మారింది. అదే సమయంలో ముస్లింలకు వ్యతిరేకంగా దిక్కులు పిక్కటిల్లేలా ద్వేషపూరిత నినాదాలు ఇస్తున్నారు. ఇదే పుస్తకంలో, 2022–2023లో శ్రీరామనవమి సందర్భంగా హౌరా, హుగ్లీ (పశ్చిమబెంగాల్–2023)లో, సంబాజీ నగర్ (మహారాష్ట్ర –2023)లో, వడోదరా (గుజరాత్ –2023)లో, బీహార్ షరీఫ్, ససారాం (బీహార్ –2023)లో, ఖర్గోన్ (మధ్యప్రదేశ్ –2022)లో, హిమ్మత్ నగర్, ఖంబాత్ (గుజరాత్ –2022) లో, లోహర్దగా (జార?ండ్–2022)లో హింసాత్మక సంఘటనలు జరిగాయనే విషయాన్ని ఇద్దరు రచయితలు లేవనెత్తారు. "మతపరమైన ప్రదర్శన"గా నమ్మించే హిందూ జాతీయవాదుల చిన్న సమూహం కూడా మైనార్టీల నివాస ప్రాంతం గుండా వెళ్లాలని పట్టుబట్టి, రాజకీయ దూషణలతో కూడిన నినాదాలిచ్చి కొందరు యువకుల్ని రెచ్చగొట్టడం, హింసాత్మక పాటలు, సంగీతాన్ని వినిపిస్తే, దానికి ప్రతిస్పందనగా వారిపై రాయి విసిరితే, మైనారిటీల్ని పెద్ద సంఖ్యలో అరెస్ట్ చెయ్యడం, ఎలాంటి న్యాయ సంబంధ ప్రక్రియ లేకుండా కొన్ని రోజుల్లోనే వారి ఇళ్ళు, ఆస్తులను ధ్వంసం చెయ్యడం ద్వారా ప్రభుత్వం మిగిలిన పని చేస్తుందని వారు ఆశిస్తున్నారని" ఇంజనీర్ ముగించాడు. మరొక స్థాయిలో మితవాద రాజకీయాలు ఆదివాసీ ప్రాంతాల్లో శబరి, హనుమంతుని గురించి మాట్లాడుతూ, వారిని తెరపైకి తెచ్చే విధంగా ప్రోత్సహిస్తున్నారు. గడచిన మూడు దశాబ్దాల కాలంలో ఆదివాసీ ప్రాంతాల్లో క్రైస్తవ వ్యతిరేక హింస పెరగడంతో, వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్, పీహెచ్‌పీ (ఆరెస్సెస్ సంతానం)లు ఈ ప్రాంతాల్లో శబరిని తెరపైకి తెచే ప్రయత్నాలు చేశాయి. గుజరాత్‌లో డాంగ్స్ దగ్గరలో శబరి కుంభ్ నిర్వహించారు. ఈ ప్రాంతంలోనే ఒక శబరి దేవాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆ సమయంలో వీహెచ్‌పీ కి చెందిన స్వామి అసీమానంద్ ఆ ప్రాంతంలోనే పని చేస్తున్నాడు. అతడే, తర్వాత కాలంలో మాలేగావ్, అజ్మర్, మక్కా మసీదుల్లో జరిగిన బాంబు పేలుళ్ల కుట్ర కేసులో పాత్రదారునిగా ఉన్నాడని మహారాష్ట్ర యాంటీ టెర్రర్ స్క్వాడ్ అతనిపై ఆరోపణలు చేసింది. ఈ ప్రాంతాల్లో శబరి, హనుమంతుడ్ని తెరపైకి తేవడానికి ఎందుకు ఎంచుకున్నారు? శబరి (రామాయణంలో)ఒక పేద మహిళ. రామునికి పెట్టేందుకు ఆమె వద్ద తగినంత ఆహారం లేదు. ఆమె బెర్రీ పండ్ల రుచిని పరీక్షించిన తర్వాతే రామునికి ఇచ్చింది. ఇక్కడ తేడా స్పష్టంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో మనకు పూజించడానికి దుర్గా, లక్ష్మీ, సరస్వతి ఉంటే, ఆదివాసీ ప్రాంతాల్లో శబరి ఉంటుంది. అదే విధంగా ఆదివాసీ ప్రాంతాల్లో హనుమం తునికి (రామ భక్తుడు) ప్రాచుర్యం ఎక్కువ. మన పండుగలపై హిందూత్వ రాజకీయాల ప్రభావం వారి రాజకీయాల్లో చాలా ప్రతిబింబిస్తుంది. వీటిలో కొన్నింటిని ఆయు ధంగా ఉపయోగిస్తున్న తీరు, లేక కుంభమేళాను ముస్లిం వ్యతిరేక వేదికగా మార్చిన తీరు, లేదా ఆదివాసీ ప్రాంతాల్లో శబరి, హనుమంతునికి బాగా ప్రాచుర్యం కల్పించిన విధానం ఆలోచించ దగిన విలువైన అంశాలు.

# దేశ భద్రత సుస్థిరకు ఆయుధ కర్మాగారాల భరోసా


భారత దేశంలో మార్చి 18వ తేదీని ఆయుధ కర్మాగారాల దినోత్సవంగా జరుపు కుంటారు. దేశ రక్షణలో ఆయుధ కర్మాగారాల పాత్రను గుర్తించడంతో పాటు, వాటి ప్రాముఖ్యతను ప్రజలకు తెలియ జేయడమే ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం. 1801వ సంవత్సరం మార్చి 18వ తేదీన కోల్‌కతా లోని కాన్సిపూర్ వద్ద మొదటి ఆయుధ కర్మాగారాన్ని స్థాపించారు. భారత రక్షణ సామర్థ్యంలో ఒక కొత్త దశకు నాంది పలికింది. అప్పటి నుండి, దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో అనేక ఆయుధ కర్మాగారాలు ఏర్పడ్డాయి. ఈ కర్మాగారాలు భారత సాయుధ దళాలకు అవసరమైన ఆయుధాలు, మందుగుండు సామగ్రిని తయారు చేస్తాయి. ఈ కర్మాగారాల అభివృద్ధి అనంతర కాలంలో భారత రక్షణ వ్యవస్థను మరింత బలపరిచింది. 2021వ సంవత్సరం అక్టోబరు 1వ తేదీ నుండి, భారత ప్రభుత్వం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డును ఏడు ప్రభుత్వ రంగ సంస్థలుగా మార్చింది. ప్రస్తుతం ఇవి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీస్ బోర్డ్ ఆధ్వర్యంలో పనిచేస్తున్నాయి. ఈ కర్మాగారాలు దేశ రక్షణలో కీలక పాత్ర పోషిస్తాయి. భారత దేశం స్వయం సమృద్ధి సాధించడంలో ఈ కర్మాగారాలు సహాయ పడతాయి. ఈ కర్మాగారాలు అనేక మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. భారత దేశం యొక్క రక్షణ అవసరాలను తీర్చడంలో ఆయుధ కర్మాగారాలు చాలా ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి.




ఆయుధ కర్మాగారాలు భారత సాయుధ దళాలకు అవసరమైన ఆయుధాలు, మందుగుండ్లు, యుద్ధ సామగ్రి, రక్షణ పరికరాలు, వాహనాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు మొదలైన వాటిని తయారు చేస్తుంటాయి. ఇవి దేశ భద్రత కోసం అందించే సేవలు ఎంతగానో విలువైనవి. ఈ రోజున, ఆయుధ కర్మాగారాలలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఆయుధ ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సెమినార్లు వంటివి నిర్వహిస్తారు. ఈ వేడుకలలో ఆయుధ కర్మాగారాల ఉద్యోగులు, అధికారులు మరియు ఇతరులు పాల్గొంటారు. యువతలో రక్షణ రంగంపై ఆసక్తిని కలిగించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ విధంగా ఆయుధ కర్మాగారాల దినోత్సవం దేశ రక్షణలో ఆయుధ కర్మాగారాల ప్రాముఖ్యతను తెలియ జేస్తుంది. దేశ భద్రతను సుస్థిరంగా నిలుపు కోవడంలో ఆయుధ కర్మాగారాలు వహిస్తున్న పాత్ర అమోఘం. ప్రస్తుత యుగంలో విదేశీ ఆయుధాల మీద ఆధార పడకుండా స్వదేశీ తయారీకి ప్రాధాన్యత ఇచ్చే విధంగా భారత ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఆయుధ నిర్మాణంలో స్వయం సమృద్ధిని సాధించాలన్న ఆత్మనిర్భర్ భారత్ సంకల్పానికి ఇది ప్రేరణగా నిలుస్తుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల...

# శత వసంతాల మాలపల్లి నవల




గాంధేయ వాదిగా, న్యాయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధుడుగా, ఉద్యమ నాయకునిగా, స్త్రీ విద్య ప్రోత్సాహికునిగా, కాంగ్రెస్ నేతగా, దళిత జనోద్ధారకునిగా, ప్రధానంగా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా ఉన్నవ లక్ష్మీ నారాయణ తెలుగు వారికి సుపరిచితుడే. ముఖ్యంగా నాటి సాంఘిక దురాచారాలను ప్రతిబింబించే, మాలపల్లి నవల నాడు ఒక సంచలనమే. సాంఘిక, ఆర్థిక అసమానతలను తొలగించి, కుల వ్యవస్థను నిరసించి, అందరూ సమానులే అన్న భావనతో, అగ్రవర్ణాలు, హరిజనులు అందరూ కలసి మెలసి ఉండాలని కోరుకుంటూ, "మాలపల్లి" అనే విప్లవాత్మకమైన నవలను రచించడం, తన దృక్పథానికి మద్దతుగా, "సహ పంక్తి భోజనాలు" నిర్వహించడం ఆ రోజులలో సాహసమే. మాలపల్లి తెలుగు సాహితీ చరిత్రలోనూ, సామాజిక దృక్పథంలోనూ ఒక నూతన ఒరవడిని సృష్టికి, చర్చోప చర్చలకు కారణభూతమైంది. ఒక దళిత కుటుంబం సమా జంలో కలిసి మెలసి ఉండడానికి చేసే ప్రయత్నం, సదరు ప్రయత్నంలో ఎదురైన చేదు అనుభవాలు, ఆ అనుభవాలతో రాటుదేలిన వ్యక్తులు చైతన్యమై సంఘటి తమై సమాజంలో నిర్లక్ష్యం చేయబడ్డ తమ ఉనికి కోసం, మెరుగైన స్థానం కోసం చేసే పోరాటాలు వంటి అంశాలతో మాలపల్లి నవలలోని పాత్రలు ఉదాత్తంగా చిత్రీకరించ బడ్డాయి. సామాజిక మార్పు కోసం బలహీన దళిత, పీడిత వర్గాలు చైతన్యంతో సుసంఘ టితం కావాలని, పోరాటా లకు సిద్ధపడాలని మాలపల్లి ప్రబోధించింది. 1922లో పల్నాడు పుల్లరి సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయి రాయ వెల్లురు జైలుకు ఉన్నవ లక్ష్మీనారాయణ తరలించ బడిన సమయం లోనే అక్కడే తన లక్ష్య సాధనకై విప్లవాత్మకమైన తెలుగు నవలా సాహిత్యంలో చిరస్మరణీయమైన 'మాలపల్లి' నవలను ఆయన రచించారు. మాలపల్లి నవల దళిత కుటుంబాన్ని ప్రధాన కథాశంగా రచించిన తొలి రాజకీయ నవల. 1922 లో మాలపల్లి నవలను బెల్లంకొండ రాఘవరావు ముద్రించగా, మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై నిషేధం విధించింది. రాజకీయ వాతావర ణాన్ని, గాంధీ మహాత్ముని ఆశయాల్ని, తెలుగువారి జీవన విధానాన్ని ప్రతిబింబించిన నవల మాల పల్లి. ఆ నవలలో సాంఘిక దురాచారాలు, జాతీయ సత్యాగ్రహ ఉద్యమాలు, వర్ణ , వర్గ వ్యత్యాసాలు తదితర ఆ నాటి పరిస్థితులను కల గలిపి, కళ్ళకు కట్టినట్లు ఉన్నవ చిత్రించడం విశేషం. ఆనాడు హరిజనుల కుటుంబ గాథను ఇతివృత్తంగా ఎన్నుకొని నవల వ్రాయడమే సాహసం. 1926 లో మద్రాసు శాసన మండలిలో మాలపల్లి నిషేధంపై చర్చలు జరగడం, 1928 లో కొన్ని మార్పులతో మాలపల్లి ప్రచురణకు తిరిగి అనుమతి లభించడం, మద్రాసు ప్రభుత్వం ఆంధ్ర విశ్వ విద్యాలయం మాలపల్లిని ప్రచురించి, ఆ నవలను పాఠ్య గ్రంథంగా ఎంపిక చేయడం, 1936 లో మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై రెండోసారి నిషేధం తెలిపి ఆ నవలను పాఠ్య గ్రంథంగా తొలగించడం, 1937లో చక్రవర్తుల రాజగోపాలాచారి మద్రాసు ప్రధానిగా ఎన్నికైనప్పుడు తొలి కాంగ్రెసు మంత్రి వర్గంచే మాలపల్లి నవలపై నిషేధపు ఉత్తర్వులను రద్దు చేయించడం క్రమానుగతంగా జరిగి పోయాయి. సామాన్య ప్రజల సంక్షేమం, అభ్యుదయాన్ని కోరే కవిత్వం ప్రజలకు సులభంగా అర్థమయ్యే వాడుక భాషలో ఉండాలన్న లక్ష్యంతో మాలపల్లి నవలలో చరమ గీతం, సమతా ధర్మం అనే రెండు గేయ కవితల్ని సామాన్య ప్రజలకు అర్థమయ్యే నిత్య వాడుక భాషలో జానపద గేయ రీతుల్లో రచించాడు. ఆ నవలకు కాశీనాథుని నాగేశ్వర రావు పీఠిక వ్రాస్తూ, "ఆంధ్ర సాహిత్య హృదయ పరిణామా న్ని గ్రహించడానికి మాలపల్లి ఉత్తమ కావ్యం అని, తెనుగు మాటలు, తెనుగు దేశము, తెనుగు హృదయము, తెనుగు సంకల్పము, మాలపల్లి నవలకు అనిర్వచనీయ ప్రతిభను సమ కూర్చాయి" అని కొనియాడాడు. అందుకే తెలుగు సాహిత్యంలో వచ్చిన తొలి విప్లవ నవలగా గుర్తింపు పొందింది. ఆయన సాహిత్యం ద్వారా హరి జనోద్ధరణకు కృషి చేశాడు. గుంటూరులో శ్రీ శారదా నికేతన్ ను స్థాపించి, స్త్రీ విద్యను ప్రోత్సహించాడు. కందుకూరి వీరేశలింగం పంతులు అధ్యక్షతలో తొలి వితంతు వివాహం జరిపించిన సంస్కర్తగా నిలిచాడు. రష్యాలో 1917లో జరిగిన బోల్షవిక్ విప్లవం వల్ల స్ఫూర్తి పొందిన మొదటి తెలుగు కవి ఉన్నవ. కూలీల పక్షం వహించి కవులు రచనలు చేయడానికి ప్రేరణ నిచ్చింది సదరు రష్యా విప్లవ ప్రభావమే. ఉన్నవ... మాల పల్లి, నాయకురాలు, బుడ బుక్కల జోస్యం, స్వరాజ్య సోది, భావ తరంగాలు తదితర రచనలు చేశాడు. గాంధేయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధు నిగా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా కీర్తి పొందిన ఉన్నవ లక్ష్మీనారాయణ గుంటూరు జిల్లా అప్పటి సత్తెనపల్లి తాలూకా వేములూ రు పాడు గ్రామంలో 1877 డిసెంబరు 4న జన్మించి, 1958 సెప్టెంబరు 25 న మరణించాడు.

## త్రివిధ దళాలకు ఆయుధ బలాన్ని చేకూర్చే దళం ఆర్డినెన్స్ ప్యాక్టరీలు

దేశ రక్షణలో అహరహం తలమునకలైన త్రివిధ దళాలు భారతీయ ఆర్మీ, ఏయిర్ ఫోర్స్, నావికా బలగాలకు ఆయుధ శక్తిని నింపుతున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు గత రెండు శతాబ్దాలకు పైగా అవిశ్రాంత అమూల్య సేవలను అందిస్తున్నాయి. మన దేశ త్రివిధ దళాలకు అవసరమయ్యే ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, రక్షణకు వినియోగించే ఎలక్ట్రానిక్ ఉపకరణాలను స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసే ప్రభుత్వ రక్షణ రంగ సంస్థగా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు అమూల్య సేవలను అందిస్తున్నాయి. భారత దేశ త్రివిధ సాయుధ దళాల వెనుక ఆయుధ శక్తిగా తన విశిష్టతలను ప్రదర్శిస్తున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల చరిత్ర చాలా గొప్పది. వలసపాలకుల కాలంలో 18 మార్చి 1801న తొలి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ కలకత్తా సమీపాన కొస్సిపోర్ ప్రాంతంలో నెలకొల్పడం జరగడంతో ఆ చారిత్రాత్మక సన్నివేశానికి గుర్తుగా ప్రతి ఏట 18 మార్చిన దేశ త్రివిధ దళాలు, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డులు సంయుక్తంగా " ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల దినోత్సవం"ను ఘనంగా జరుపుకోవడం కొనసాగుతున్నది. భారతీయ రక్షణ రంగంలో 4వ దళం – ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు: మన త్రివిధ దళాలకు ధీటుగా 4వ సాయుధ బలగంగా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు విశిష్ట సేవలను అందిస్తున్నాయి. కాలానుగుణంగా శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని జీర్ణించుకుంటూ వివిధ రకాలైన ఆయుధాలు, మందు గుండు సామాగ్రి, రక్షణ రంగ వాహనాల రూపకల్పన, సిబ్బంది ప్రత్యేక దుస్తుల తయారీ, పర్వత ప్రాంత రవాణాకు సంబంధించిన ఉపకరణాలు, అత్యాధునిక ఎలక్ట్రానిక్ ఉపకరణాలను మన దేశ అవసరాలకు అనుగుణంగా తయారు చేసి సమయానికి అందిస్తూ దేశ రక్షణలో ప్రధాన భూమికను నిర్వహిస్తున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల సిబ్బంది సేవలను గుర్తించడం, దేశ రక్షణలో అమరత్వం పొందిన యోధులను స్మరించుకోవడం, అత్యాధునిక ఆయుధాల ప్రదర్శన, ఆధునిక పరిశోధనా ఫలితాల మూట విప్పడం, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల సేవకు సంబంధించిన ఫోటో ప్రదర్శనలు, పరేడ్ల నిర్వహణ లాంటి కార్యక్రమాలను ఈ వేదికగా నిర్వహించడం జరుగుతుంది. దేశవ్యాప్తంగా 41 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు 24 ప్రాంతాల్లో స్థాపించడంతో పాటు 9 శిక్షణ కేంద్రాలు, 3 ప్రాంతీయ మార్కెటింగ్ కేంద్రాలు, 4 ప్రాంతీయ భద్రత కార్యాలయాలు 5 ఆపరేషనల్ విభాగాలుగా విస్తరించి ఉన్నాయి. అత్యధికంగా మహారాష్ట్రలో 10, యూపీలో 09, ఎంపీ/తమిళనాడుల్లో 06 చొప్పున ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు స్థాపించడం జరిగింది. రెండవ ప్రపంచ యుద్ధం నుంచి నేటి వరకు తన ప్రత్యేకతను నిలుపుకుంటూ వస్తున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు రానున్న కాలంలో కూడా త్రివిధ దళాలకు ఆయుధ శక్తిని అందిస్తూ దేశ సమగ్రత, సమైతలను కాపాడటంలో తనదైన పాత్రను పోషిస్తున్నది. భారత మాత సేవలో ప్రాణాలర్పించిన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలకు సంబంధించిన అమరులకు ఘన నివాళులు అర్పించడం, ప్రస్తుతం సేవలు అందిస్తున్న సైనికులకు ధైర్యంగా నిలవడం మన కనీస భాద్యత.

# ఎస్ఎల్బీసీ టన్నెల్ లోని డి 1, డి 2 ప్రదేశాల్లో సహాయక చర్యలు ముమ్మరం,

## జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,



నాగర్ కర్నూల్ మార్చి 17(వుదయం ప్రతినిధి) సోమవారం ఎస్ఎల్బీసీ టన్నెల్ ఆఫీస్ వద్ద జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, సహాయక బృందాల ఉన్నతాధికారు లతో సహాయక చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్ఎల్బీసీ టన్నెల్ ప్రమాద ఘటనలో చిక్కుకున్న వారిని గుర్తించేందుకు సహాయక బృందాలు నిర్విరామంగా సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రమాదంలో చిక్కుకున్నవారు ఉన్న ప్రదేశంగా డి1, డి 2 ప్రదేశాలను గుర్తించి సహాయక చర్యలు కొనసాగిస్తూ ఆ ప్రాంతాల్లో సహాయక చర్యలను మరింత వేగవంతం చేశామన్నారు. సహాయక చర్యల్లో అడ్డంకి గా మారుతున్న టన్నెల్ బోరింగ్ మెషిన్ యొక్క భాగాలను తొలగించే పనులు కొనసాగిస్తూ, ఎస్కావేటర్, రెట్టింపు సహాయక బృందాలతో మట్టిని తొలగించే పనులు వేగవంతం చేసినట్లు వివరించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ, ర్యాట్ హోల్ మైనర్స్ బృందాలు డి1, డి2 ప్రదేశాల్లో సహాయక చర్యలను వేగవంతం చేసినట్లు తెలియజేశారు. ప్రమాద ప్రదేశంలో నీటిని తొలగించేందుకు డి-వాటరింగ్ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని, సహాయక చర్యల్లో పాల్గొంటున్న బృందాలకు అవసరమైన అన్ని రకాల సామగ్రిని అందిస్తున్నట్లు, ప్రమాద ప్రదేశంలో సహాయక చర్యల్లో పాల్గొనే సిబ్బంది భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయడంతోపాటు, సహాయక బృందాలకు అధికారులు తగిన సూచనలు అందిస్తున్నట్లు తెలిపారు. డి1, డి2 ప్రదేశాలను పరిశీలించేందుకు కడవర్ డాగ్ స్క్వాడ్స్ సోమవారం టన్నెల్లోకి వెళ్లినట్లు తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్మీ,సింగరేణి మైన్స్ రెస్క్యూ టీమ్, NDRF (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్), SDRF (స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్),ర్యాట్ హోల్ మైనర్స్,కడావర్ డాగ్స్, హైడ్రా, దక్షిణ మధ్య రైల్వే, GSI ,బృందాల అధికారులు పాల్గొన్నారు.

# చర్లపల్లిలో పీడీఎస్ బియ్యం పట్టివేత



నడికూడ, మార్చి 17(వుదయం ప్రతినిధి): నడికూడ మండలంలోని చర్లపల్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పరకాల పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. సీఐ క్రాంతికుమార్ వివరాల ప్రకారం పోలీసు సిబ్బంది చర్లపల్లిలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా వాహనంలో తరలిస్తున్న బియ్యాన్ని, ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నారు. వెంటనే వాటిని పరిశీలించగా రూ. 1,04,000 విలువగల దొడ్డు బియ్యం సుమారు 75 బస్తాలలో (40క్వింటాళ్లు) లభించాయి. పీడీఎస్ బియ్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకుని, వాటిని తరలిస్తున్న చర్లపల్లి గ్రామానికి చెందిన తూర్పాటి శ్రీధర్, తూర్పాటి ఐలయ్యలను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా పలు గ్రామాల్లోని ప్రజల వద్ద రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి, వేరే చోట ఎక్కువ ధరకు అమ్ము కుంటామని తెలిపారు. సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సిఐ క్రాంతి కుమార్ తెలిపారు

# చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుతో రైతుల్లో ఆనందం



జయశంకర్ భూపాలపల్లి మార్చి17(వుదయం ప్రతినిధి) చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులు వేగాన్ని ఉంచుకోవడంతో రైతుల కళ్ళలో ఆనందం వెల్లి విరుస్తోందని జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మాజీ ఎంపీటీసీ మంచినీళ్ల దుర్గయ్య అన్నారు సోమవారం పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ ప్రాంత రైతుల మంచి కోరిన మంత్రి శ్రీధర్ బాబు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని దృఢ సంకల్పంతో 2007 సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న కాళేశ్వరాన్ని ప్రారంభించిందని అన్నారు. ఈ ప్రాంత రైతుల ను విస్మరించిన బి ఆర్ ఎస్ ప్రభుత్వం చిన్న కాళేశ్వరం పనులను ముందుకు సాగించలేదని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక మంథని ఎమ్మెల్యే రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఈ ప్రాంత రైతులకు సాగునీరు త్రాగునీరు అందించడానికి 500 కోట్లు మంజూరు చేశారని అన్నారు. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో నీళ్లు, వనరులను ఈ ప్రాంతం నుండి తరలించి ఇక్కడి రైతులకు మొండి చేయి చూపించిందని అన్నారు. ప్రస్తుతం చిన్న కాలేశ్వరం నీటితో ఈ ప్రాంతంలోని మహదేవపూర్, కాటారం, మల్హర్, మాహముత్తారం, మండలాల్లోని చెరువులు నిండి వీడిపోయిన భూములు సైతం పంట పొలాలు అవుతాయని అన్నారు. రాబోయే రోజుల్లో మంథని నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి దిశగా రాష్ట్రమంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు తీసుకెళ్తారని అన్నారు చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులు పూర్తికావస్తున్నాయని త్వరలోనే ఈ ప్రాంత రైతులకు ప్రభుత్వం నీరు అందించే కార్యక్రమం చేపడుతుందని అన్నారు ప్రభుత్వాన్ని బధనామ్ చేసేందుకు కొంతమంది రైతులను మభ్యపెడుతూ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిసిందని రైతులు ఎవరు నమ్మవద్దని అన్నారు,

# దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి మార్చి 17(వుదయం ప్రతినిధి) విద్యార్థుల్లో కంటి సమస్యలను పరిష్కరించేందుకు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.సోమవారం, ఐడీఓసీ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో దృష్టి లోపంతో బాధపడుతున్న విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల కంటి పరిరక్షణకు అన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలోని విద్యార్థులకు, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు గత నెలలో కంటి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. కంటి చూపు సమస్యలున్నట్లు గుర్తించిన విద్యార్థులకు తిరిగి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి భూపాలపల్లిలో కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ పరీక్షల ద్వారా దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించిన 658 మంది విద్యార్థుల్లో 292 మందికి మొదటి విడతగా ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేశామని, మిగిలిన విద్యార్థులకు త్వరలో కంటి అద్దాలు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. కంటి పరీక్షల నిర్వహణ కోసం చిట్యాల, మహాదేవ్పూర్ మండలాలను యూనిట్గా తీసుకుని 4 ప్రత్యేక టీములను ఏర్పాటు చేశామన్నారు. ఈ టీముల్లో ఇద్దరు వైద్యులు, ఇద్దరు ఫార్మసిస్టులు, ఒక ఏఎన్ఎం, ఆప్తమాలజిస్టులు పర్యవేక్షణలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించామని అన్నారు. విద్యార్థుల దృష్టి సమస్యలను తొందరగా గుర్తించడం ద్వారా, వారి విద్యాభ్యాసంపై దుష్ప్రభావం పడకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధుసూదన్, ఆర్బిఎస్కే కో ఆర్డినేటర్ డా శ్రీనివాస్, పిఓ ప్రమోద్, ఆర్బిఎస్కే సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంఈఓ గా బాధ్యతల స్వీకరణ



నల్లబెల్లి, మార్చి 17 (వుదయం ప్రతినిధి): మండల విద్యాశాఖ అధికారిగా మేరుగుల అనురాధ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.. నందిగామ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగ పనిచేస్తున్న అనురాధ ను పూర్తిస్థాయి అదనపు బాధ్యతలతో మండల విద్యాశాఖాధికారి గా నియమిస్తూ రాష్ట్ర పాఠశాల విద్యా డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల విద్యా డైరెక్టర్, ఆర్. జె. డి, వరంగల్ విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు సోమవారం మండల విద్యాశాఖాధికారి కార్యాలయం లో అనురాధ ఎంఈఓ గా భాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ఆమెకు అభినందనలు తెలిపారు.. అనంతరం ఆమె మాట్లాడుతూ..ఉపాధ్యాయులు,తల్లితండ్రులు,ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంలతో నల్లబెల్లి మండలం లో ప్రభుత్వ పాఠశాల ప్రమాణాలు పెంపొందించేందుకు కృషిచేస్తానన్నారు.

# ఆత్మవిశ్వాసంతో పరీక్షలను రాయండి

## సైకాలజిస్ట్ పోగు అశోక్



శాయంపేట17 (వుదయం ప్రతినిధి) ఈనెల 21 నుండి రాష్ట్రవ్యాప్తంగా పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలను రాయబోతున్నారు. ఈ సమయంలో విద్యార్థులలో తెలియని భయం, ఒత్తిడి ఉండే అవకాశం ఉంటుంది. కాబట్టి విద్యార్థులు పరీక్షలు అంటే ఎలాంటి భయం లేకుండా, ఒత్తిడి లేకుండా ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావాలని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పోగు అశోక్ విద్యార్థులకు సూచిస్తున్నారు. నేను బాగా చదవగలను, నేను పరీక్షలను బాగా రాయగలను, నాకు మంచి ఫలితాలు వస్తాయి, అనే ఆశావాహ దృక్పథంతో, మీ మీద మీకు నమ్మకం కలిగి ఉండాలని, మీ మీద మీకు విశ్వాసం ఉండాలని, మహోన్నత విశ్వాసాల నుండి మహత్తర విజయాలు సాధించబడతాయి అని, ఆత్మవిశ్వాసం మీ ఆయుధమైతే విజయం మీ బానిస అవుతుందని, ప్రతి సబ్జెక్టును ప్రణాళిక ప్రకారం ఇష్టపడి చదవాలి, ఆసక్తితో చదవడం వల్ల అద్భుత ఫలితాలు వస్తాయి. ఆసక్తి ఉంటే ఏ శక్తి మిమ్మల్ని ఆపలేదు అని చెబుతున్నారు. విద్యార్థులు ఈ సమయంలో మనసులో ఎలాంటి నెగటివ్ ఆలోచనలు దరిచేరనీయకుండా, తాము గతంలో సాధించిన విజయాలు, సందర్భాలను గుర్తుకు చేసుకుంటూ ఉండాలి. దీనివలన విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెరిగి ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయగలుగుతారు. పట్టుకుంటే పాదరసంలా జారిపోయే సమయం అత్యంత విలువైనదిగా గ్రహించి బంగారంలో ఉన్న ప్రతి చిన్న కణానికి ఎంతటి విలువ ఉందో ఇప్పుడు మీ ముందున్న ప్రతిక్షణం అంతే విలువైనదిగా భావించి, సమయపాలన పాటించి పరీక్షలకు సిద్ధం కావాలి. ఈ సమయంలో విద్యార్థులు మీ యొక్క సమయాన్ని వృధా చేసే సెల్ ఫోన్లు టీవీలు చాటింగ్ లకు, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి. సాగిపోయే కాలం మీ కోసం ఆగిపోదు, కరిగిపోయే ప్రతిక్షణం మీకోసం పెరిగిపోదు, అందుకే కాలం వెంట పరిగెత్తు విజయాలను సాధించు అని మహాత్ముడు అన్న మాటలను స్ఫూర్తిగా తీసుకుంటూ ప్రతి విద్యార్థి పరీక్షలు అద్భుతంగా రాయాలని సూచిస్తున్నారు. ఈ సమయంలో విద్యార్థులు ఆహారం విషయంలో జాగ్రత్త వహించాల్సి ఉంటుంది సాత్విక ఆహారం-శాఖాహారం తొందరగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవడం మంచిది. ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ లకు దూరంగా ఉండాలి. మధ్య మధ్యలో తగినంత నీటిని తీసుకోవడం ఉత్తమం. ఈ సమయంలో విద్యార్థులు ఎవరైనా ఒత్తిడికి లోనైతే, పరీక్షలంటే భయం కలిగినట్లయితే వాటిని తొలగించడానికి లితెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్లి విద్యార్థులకు తోడ్పాటును అందిస్తుందని, విద్యార్థులు 9391117100,9440890073 ఫోన్ నెంబర్లను సంప్రదించి తమ ఒత్తిడిని,భయాన్ని తొలగించుకోవచ్చు అని సైకాలజిస్ట్ పోగు అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రజావాణి దరఖాస్తులపై చర్యలు తీసుకోవాలి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి మార్చి 17(వుదయం ప్రతినిధి) ప్రజావాణి దరఖాస్తులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం ఐడిఓసి కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి వాటిని ఆయా శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు.పరిష్కరించబడిన ఫిర్యాదులపై వచ్చే వారం సమగ్ర నివేదిక అందించాలని స్పష్టం చేశారు. ప్రజావాణికి గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టరేట్ ఏఓను ఆదేశించారు.అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి తు.చ. తప్పకుండా సమయపాలన పాటించాలని ఆదేశించారు.అధికారుల హాజరు తీసుకోవాలని స్పష్టం చేశారు.కాటారం మండలం గంగారం గ్రామానికి చెందిన బొల్లం అంజన్న అనే దివ్యాంగుడు తనకు ఐదు సంవత్సరాలు నుండి పింఛను వస్తున్నదని ప్రస్తుతం పింఛను రావడం లేదని తిరిగి పింఛను మంజూరు చేపించాలని చేసిన దరఖాస్తును తగు చర్యలు నిమిత్తం డిఆర్డిఓకు ఎండార్స్ చేశారు.మల్హార్ మండలం తాడిచర్ల గ్రామానికి చెందిన ఇందారపు కుమార్ తాను కూలి పనులకు వెళ్ళగా మధ్యాహ్నం 12 గంటల సమయంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో రెండు ఇళ్ళు దగ్ధమయ్యాయని, ఆస్తి నష్టం జరిగిందని, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆర్థిక సహాయం అందించాలని చేసిన దరఖాస్తును కలెక్టరేట్ డి సెక్షన్ పర్యవేక్షకునికి ఎండార్స్ చేశారు.భూపాలపల్లి మండలం గొర్లవీడు గ్రామానికి చెందిన భీమవరం శంకరాచారి తాను తెలంగాణ గ్రామీణ బ్యాంకు చెల్పూరు బ్రాంచ్ లో పంట రుణం తీసుకున్నానని, బ్యాంక్. మేనేజర్ తప్పిదం వల్ల అట్టి రుణం మాఫీ కాలేదని, తన కూతురు పంట రుణం తీసుకున్నట్లు నమోదు చేశారని, సరిచేసి తనకు రైతు రుణమాఫీ చేయగలరని చేసిన దరఖాస్తును తగు చర్యలు నిమిత్తం ఎల్డిఎం కు ఎండార్స్ చేశారు.భూపాలపల్లి మండలం పెరుకపల్లి గ్రామానికి చెందిన మాదం కుమార్ స్వామి నీటి సమస్యతో బాధపడుతున్నారని ఇంటి నిర్మాణం చేపట్టిన తనకు నీటి సౌకర్యం లేక వేరే గ్రామం నుంచి నీళ్ల తేవాల్సిన పరిస్థితి వచ్చిందని కావున తనకు మిషన్ భగీరథ మంచినీటి కనెక్షన్ ఇప్పించాలని చేసిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం ఆర్డబ్ల్యూఎస్ ఈఈ కి ఎండార్స్ చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్న గిరిజనులకు ఒరిగేందిలేదు....

**అలుగు నిర్మాణంలో పూర్తిగా వైఫల్యం చెందారు.....**

**జాతీయ ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్...**







చంద్రుగొండ, మార్చి17: ( వుదయం ప్రతినిధి) ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాష్ట్ర క్యాబినేట్లో ముగ్గురు మంత్రులు ఉన్న ఈ ప్రాంత పేదలకు, గిరిజనులకు ఒరిగిందేమిలేదని, అసలు పరిపాలనేది లేదని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమీషన్ జాటోత్ హుస్సేన్ నాయక్ విమర్శించారు . సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చంద్రుగొండ మండలం, సీతాయిగూడెం గ్రామ శివారులో గల వెంగళప్రాజెక్టు తెగిన అలుగు ప్రదేశాన్ని మాజీ మంత్రి జలగం ప్రసాదావు సూచన మేరకు పరిశీలించారు. గిరిజన, ఆయకట్టు రైతుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు . అలుగు తెగిన విషయాన్ని అధికారులు ఎందుకు అలసత్వం, నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ. ..ఐటిడిఏకు ఏజెన్సీలో సర్వ హక్కులు ఉంటాయని, నెల రోజుల్లో ప్రాజెక్టు అలుగు నిర్మాణంపై పూర్తి స్థాయి నివేదని ఇవ్వాలన్నాడు.ఇరిగేషన్ శాఖ పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. తెలంగాణలో కాంట్రాక్టర్లదే రాజ్యమని, మంత్రులే కాంట్రాక్టర్లు అయితే బడ్జెట్ వారికే సరిపోతుందని, సన్న, చిన్న కాంట్రాక్టర్ల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. ప్రజల సేవకులగా పాలకులు, ఉద్యోగులు పనిచేయాలని, ప్రజలపై జులుం చేస్తే చూస్తు ఊరుకోబోమన్నారు.రాష్ట్రంలో పరిపాలన గాడితప్పిందని, అధికారులు బలిపశువులవుతున్నారు. ట్రైబల్స్ కు బడ్జెట్లో రూ.17 వేల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం సరికాదన్నారు. గిరిజనులకు అన్ని బ్యాంకులు రూ.10లక్షల వరకు ఎటువంటి షరతులు లేకుండా రుణాలు ఇవ్వాలన్నారు. పోడు పట్టాలు పొందిన భూముల్లో బోర్లు వేసేందుకు అధికారులు ఇబ్బందులు లేకుండా తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. గిరిజనుల్ని ఇబ్బంది పెడితే ఎస్సీ, ఎసీ కమీషన్ వారికి అండగా ఉంటుందన్నారు.మంచిగా పనిచేసే అధికారులకు ప్రజల్లో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రజాపాలన అంటూ కాలం గడుపుతున్నారని, ప్రజా సమస్యలు అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. తెలంగాణలో పరిపాలన దారుణంగా ఉందన్నారు. వ్యవస్థలన్ని భ్రష్టుపట్టిపోతున్నాయన్నారు. ప్రభుత్వానికి పరిపాలన చేతకావడంలేదన్నారు. గిరిజన రైతులుండే ఏరియాలో చెరువులు, కుంటలు తెగితే ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు.

సమస్యల పరిష్కారం కోసం వినతులు : ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ కు గిరిజన రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం వినతుల్ని సమర్పించారు.

ముఖ్యంగా పోడు, బోర్లు, సాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జలగం ప్రసాదరావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటిడిఏ పీఓ రాహుల్, ఐబి ఎస్ ఈ శ్రీనివాసరెడ్డి, ఆర్డిఓ మధు, ఈఈ సురేష్, డీఈ క్రిష్ణశంకర్, అన్నిశాఖల మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు...

# పంట మార్పిడి పై జిల్లా అధికారులు శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలి

- జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా ప్రజావాణికి హాజరుకావాలి
- మున్సిపాలిటీలు, గ్రామాలలో తాగునీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి
- ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో
- ప్రజల నుండి పిర్యాదులను స్వీకరించిన జిల్లా కలెక్టర్




నల్గొండ మార్చి 17(వుదయం ప్రతినిధి): పంట మార్పిడి పై జిల్లా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఇందుకుగాను అవసరమైతే వ్యవసాయ సీజన్ కు ముందే ఆయా డివిజన్ల వారిగా రైతు సదస్సులను నిర్వహించాలని చెప్పారు. జిల్లాలో రైతులు ఎక్కువ శాతం వరినే పండిస్తున్నందున వేసవిలో సాగునీరు సరిపోయినంత లేని సమయంలో, అలాగే భూగర్భ జలాలు తగ్గినప్పుడు పంటలకు ఇబ్బంది ఏర్పడుతుందని, అదే ఆరుతడి, ఉద్యాన పంటలు పండించినట్లయితే తక్కువ నీరు అవసరం అవుతుందని, వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని రైతులకు పంట మార్పిడి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి పిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం ఆమె జిల్లా అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా ప్రజావాణికి హాజరుకావాలని, ఆయా శాఖలకు ఫిర్యాదులు వచ్చిన, రాకున్నా హాజరు తప్పనిసరి అన్నారు. అధికారులందరు ప్రజావాణి కి హాజరైనప్పుడే ప్రజలకు అధికారుల పట్ల నమ్మకం కలుగుతుందని, కిందిస్థాయి అధికారులను ప్రజావాణికి పంపించవద్దని ఆమె పునరుద్ఘాటించారు. గత సంవత్సరం లాగే ఈ సంవత్సరం పాఠశాల విద్యార్థులకు జూన్ 12 న పాఠశాలల పునఃప్రారంభం తర్వాత యూనిఫామ్స్ ఇచ్చేందుకుగాను జిల్లా విద్యాశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖలు ముందే చర్యలు తీసుకోవాలని, డిఈఓ బిక్షపతిని, డిఆర్డిఓ శేఖర్ రెడ్డిని ఆదేశించారు. కాగా డిఆర్డిఓ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ 1180 పాఠశాలల్లో 70,253 మంది విద్యార్థులకు యూనిఫార్మ్ కుట్టేందుకు 1180 స్వయం సహాయక బృందాలను గుర్తించడం జరిగిందని, ఒక్కో సంఘానికి 70 చొప్పున డ్రెస్సులను ఇస్తున్నామని, మెటీరియల్ వచ్చిన వెంటనే మే 31 నాటికి వీటిని కుట్టడం పూర్తిచేసి అందజేస్తామని తెలిపారు. వచ్చే ఖరీఫ్ సీజన్లో పంట మార్పిడి కింద వరికి బదులుగా ఇతర పంటలకు వేసుకోవాలని రైతులకు చెప్పాల్సిన బాధ్యత వ్యవసాయ అధికారులతో పాటు, మండల ప్రత్యేక అధికారులపై ఉందని అన్నారు. ఇందుకుగాను ముందుగానే వచ్చే వ్యవసాయ సీజన్లో రైతులు ఎంత మేర వరి పండిస్తున్నారో వివరాలు సేకరించాలని, రైతులు పూర్తిగా వరి పంట వైపు వెళ్లకుండా ఇతర పంటలు పండించాలని తెలియజేయాలని, ఒకవేళ వరి వేయాల్సి వస్తే అన్న ధాన్యం పండించే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. దీంతో పాటు, జిల్లాలోని చాలా ప్రాంతాలలో ఉద్యాన పంటలకు మంచి అవకాశం ఉందని, అందువల్ల ఉద్యాన పంటల వైపు రైతులను మళ్లించాలని దీనివల్ల వేసవిలో సాగునీటి సమస్య రాదని, తద్వారా తాగునీటి సమస్య ఉండదని తెలిపారు. బీహార్ రాష్ట్రంలో "మఖాన" పంటను అధిక మొత్తంలో పండిస్తున్నారని, ఈ పంట వల్ల లాభం ఎక్కువగా వస్తుందని, జిల్లా రైతులు ఈ పంటను సాగు చేసే విధంగా శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు ప్రోత్సహించాలని కోరారు. మఖానలో క్యాల్షియం ఎక్కువగా ఉంటుందని, దీనిని తీసుకోవడం వల్ల ఎముకలు బలంగా ఉంటాయని, ప్రపంచ మార్కెట్లో సైతం మఖానాకు విపరీతమైన ధరలు ఉన్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకొని పైలెట్ పద్ధతిన జిల్లాలో పండించేందుకు రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో మాట్లాడడం జరిగిందని, ముందుగా నల్గొండ, కట్టంగూరు, తిప్పర్తి, కొండమల్లేపల్లి, చందంపేట తదితర మండలాలలో మఖాన ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మఖాన సాగుపై జిల్లా నుండి శాస్త్రవేత్తలను, వ్యవసాయ అధికారులను బీహార్ కు అధ్యయనం నిమిత్తం పంపించడం జరిగిందని వెల్లడించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ మఖాన పంట సాగు పద్ధతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో వ్యవసాయ, హార్టికల్చర్ విశ్వవిద్యాలయంలో సైతం మఖాన పట్ల ఆసక్తిగా ఉన్నారని, దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తే ఇక్కడ ప్రజలకు మఖాన తో పోషకాలు పొందడంతో పాటు, రైతులకు ఎంతో లాభంగా ఉంటుందని, ఈ విషయంపై అధికారులు దృష్టి సారించాలని, ఎంపిక చేసిన మండలాలలో మండల వ్యవసాయ అధికారులు నోడల్ అధికారిగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. మున్సిపాలిటీలు, గ్రామాలలో తాగునీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా మిషన్ భగీరథ తాగునీటిని ఇతర అవసరాలకు వాడవద్దని, ఒకవేళ ఎవరైనా ఆ విధంగా వాడినట్లయితే జరిమానా విధిస్తామని హెచ్చరించాలని కలెక్టర్ తెలిపారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, ప్రత్యేక కలెక్టర్ నటరాజ్, ఇన్చార్జి డి ఆర్ ఓ వై. అశోక్ రెడ్డి,డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

## తెలంగాణ బ్యాంక్ మేనేజర్ పై జిల్లా కలెక్టర్ ఆగ్రహం



జయశంకర్ భూపాలపల్లి మార్చి 17(వుదయం ప్రతినిధి) కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్, రైతు భరోసా వంటి నిధులు చెల్లింపు చేయకుండా ఎందుకు హోల్డ్ పెట్టారు, హోల్డ్ పెట్టే అధికారం మీకు ఎవరు ఇచ్చారు? మీపై చర్యలు ఎందుకు తీసుకోకూడదు? మీపై పిర్యాదు చేస్తాను అంటూ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఘోరి కొత్తపల్లి తెలంగాణ బ్యాంక్ మేనేజర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు.సోమవారం ఐడిఓసి కార్యాలయంలో జరుగుతున్న ప్రజావాణి కార్యక్రమంలో నిధులు చెల్లించకుండా తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఇబ్బంది పెడుతున్నారని ఘోరి కొత్తపల్లి మండలం, బాలయ్యపల్లి గ్రామానికి చెందిన యాదగిరి చేసిన పిర్యాదుకు స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే మేనేజర్ కు ఫోన్ చేసి మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చే నిధులు ఇతర రుణాలకు ఎందుకు జమ చేస్తున్నారని, ప్రజలను ఎందుకు ఇబ్బందులు పెడుతున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా సర్దుబాటు చేసే అధికారం మీకు లేదని, ప్రభుత్వం ఇచ్చే నిధులు ఇతర రుణాలకు జమ చేయొద్దని తక్షణమే నిధులు చెల్లింపులు చేయాలని మేనేజర్ ను ఆదేశించారు. చెల్లింపుపై తనకు సమగ్ర సమాచారం ఇవ్వాలని, జాప్యం జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చల్లగరిగలో కూడా ఇలాంటి సంఘటన జరిగిందని, ముమ్ముందు ఇలాంటి ఫిర్యాదులు వస్తే చైర్మన్ కు నివేదిక పంపుతామని ఆయన స్పష్టం చేశారు.

### నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి

జనగామ, మార్చి17(వుదయం ప్రతినిధి): జనగాం జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని మండల యువజన నాయకుడు కమ్మగాని వెంకటేష్ గౌడ్, పావనిల నూతన జంటను సోమవరం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆశీర్వదించారు. వారి వెంట పుస్కూరి శ్రీనివాసరావు మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పసునూరి నవీన్ కుమార్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ ప్రకారమే ఉద్యోగాలు భర్తీ చేయాలి..

## గోవిందు నరేష్ మాదిగ

**మంద కృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ**

**దేశంలో ముప్పై ఏళ్ల ఏకైక సామాజిక ఉద్యమం ఎమ్మార్పీఎస్ మాత్రమే**



తుంగతుర్తి/ శాలిగౌరారం, మార్చి 17, (వుదయం ప్రతినిధి):తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి జాబ్ క్యాలెండర్ ప్రకారం భర్తీ చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగాలన్ని ఎస్సీ వర్గీకరణ ప్రకారమే నియామకాలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ అన్నారు. సోమవారం రోజు శాలిగౌరారం మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇంచార్జి బోడ సునీల్ మాదిగ ఆద్వర్యంలో గత 5 రోజులుగా జరుగుతున్న నిరాహార దీక్షలకు గోవిందు నరేష్ మాదిగ సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ " ఎస్సీ వర్గీకరణ లేకుండా ఉద్యోగాలు భర్తీ జరిగితే మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు.ఎస్సీ రిజర్వుడు కేటగిరిలోని ఉద్యోగాలన్ని ఏక పక్షంగా మాలలకే చెందే అవకాశం ఉందని,ముప్పై ఏళ్ల పోరాటంలో ఉన్న న్యాయాన్ని సుప్రీం కోర్టు గుర్తించి తీర్పు చెప్పిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం మాదిగలకు తగిన న్యాయం చేసే విధంగా ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.విద్యా, ఉద్యోగ రంగాల్లో న్యాయం చేయడం రేవంత్ రెడ్డి నైతిక బాధ్యత అని అన్నారు.దేశంలో ఎక్కడ లేని విధంగా ముప్పై ఏళ్లుగా శాంతియుతంగా నడుస్తున్న పోరాటం ఒక్క ఎమ్మార్పీఎస్ మాత్రమే అని ,ప్రస్తుతం ఈ పోరాటం విజయానికి చేరువైందని అన్నారు. మంద కృష్ణ మాదిగ లేకుంటే ఎస్సీ వర్గీకరణ ఉద్యమం లేదని, ఎస్సీ వర్గీకరణ ఫలితం మంద కృష్ణ మాదిగకే చెందుతుందని అన్నారు.కేవలం మాదిగల కోసమే కాకుండా అన్ని ఎస్సీ కులాలకు న్యాయం జరిగాలనే వర్గీకరణ పోరాటం జరిగిందని అన్నారు.ఎస్సీ వర్గీకరణ అమలులోకి వచ్చేంత వరకు తమ ఉద్యమ ఆగదని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జీ కారుపాటి అంబేద్కర్, బట్ట శ్రీను, బట్ట సైదులు, మొలుగూరి సోమయ్య, అయిలపాక శ్రీను, మామిడి రమేష్, గద్దపాటి అరవింద్, పెద్యాల వెంకన్న,బట్ట తిరుమలేష్, వేముల సోమయ్య, బట్ట సైదులు, వేముల శ్రీకాంత్, బొడ్డు ఉపేందర్, మాగి వెంకటేష్, గుండ్లపల్లి వరప్రసాద్, బట్ట వెంకన్న, ఎర్ర మల్లేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## 6వ రోజుకు చేరిన ఎంఆర్పీఎస్ దీక్ష

బోథ్, మార్చి17(వుదయం ప్రతినిధి): నార్నూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ నిరసన దీక్ష సోమవారం 6వ రోజుకు చేరుకుంది. నాయకులు మాట్లాడుతూ ఎస్సి వర్గీకరణలో ఏబీసీడీ గ్రూపులుగా చట్టబద్ధత కల్పించాలన్నారు. వర్గీకరణలో ఉన్న లోపాలను సవరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండలాధ్యక్షుడు సుదర్శన్, హనుమంత్, విజయ్, కిరణ్, రాజ్, బాలాజీ, అరవింద్, తదితరులున్నారు.

### ఆదిలాబాద్ జిల్లా ఎస్పీని కలిసిన మాదిగ జేఏసీ

ఆదిలాబాద్, మార్చి17(వుదయం ప్రతినిధి):ఆదిలాబాద్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అఖిల్ మహాజన్ ను సోమవారం మాదిగ జేఏసీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీని శాలువాతో సత్కరించి అంబేద్కర్ చిత్రపటాన్ని బహుకరించారు.

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులలో సత్వరం న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు. పట్టణంలో అవసరం ఉన్న చోట ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలన్నారు. జేఏసీ అధ్యక్షులు మనోజ్, నక్క రామదాస్, ప్రసన్నకుమార్, గంగాధర్, నరసింహులు తదితరులున్నారు.

## కలెక్టర్ కార్యాలయం ముందు వికలాంగుల ధర్నా

గజ్వేల్, మార్చి17(వుదయం ప్రతినిధి): వికలాంగులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు మాణిక్ మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్ 4 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్లలో ఐదు శాతం కేటాయించాలని కోరారు.

## సమస్యలు పరిష్కరించాలని ధర్నా

మక్తల్, మార్చి17(వుదయం ప్రతినిధి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నారాయణపేట తహసీల్దార్ కార్యాలయం ముందు ఆశా కార్యకర్తలు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తల వేతనాలు పెంచాలని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని అన్నారు. ప్రమాద, వ్యక్తిగత భీమా, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని అన్నారు.

## ప్రజావాణికి (72) ఫిర్యాదులు



రంగారెడ్డి జిల్లా మార్చి17(వుదయం ప్రతినిధి): ప్రజావాణి అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడుపరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ అధికారులనుఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించినప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చినఫిర్యాదుదారులు అందజేసిన అర్జీలను జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్,జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారంకోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వెంటనే పరిష్కరించాలనిఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలనజరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్యార్థులకుకంటి అద్దాలను అదనపు కలెక్టర్ అందజేశారు.రెవెన్యూ శాఖ 40, ఇతర శాఖలకు %-% 32, మొత్తం 72 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు,మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు,


తదితరులు పాల్గొన్నారు.

## కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలి



జయశంకర్ భూపాలపల్లి మార్చి 17(వుదయం ప్రతినిధి) గ్రామాలలో కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని పలిమేల ఎస్సై జె, రమేష్ అన్నారు సోమవారం పలిమేల మండలంలోని బురుగుగుడెం గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు ఈ సందర్భంగా ఎసై రమేష్ మాట్లాడుతూ గ్రామంలో కొత్త వ్యక్తులు అనుమానాస్పద వ్యక్తులను గోదావరి దాటించవద్దని,కొత్త వ్యక్తులు సంచారిస్తే పోలీస్ లకు సమాచారం తప్పకుండా అందించాలని సూచించారు మావోయిస్టుల దుశ్చర్యల గురించి వివరిస్తూ వారికి సహాయం చేయడం ఆశ్రయం ఇవ్వడం చట్టరీత్య నేరం అని,అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు గుడుంబాకు బానిస అయ్యి జీవితాలను నాశనం చేసుకోవద్దు అని, గుడుంబా అమ్మిన తయారు చేసిన సరఫరా చేసినా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఈ విషయం లో ఎవరిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తోపాటు ప్రజలు పాల్గొన్నారు.

## ఆష్టలో సిసి రోడ్డు పనులు ప్రారంభం



ముధోల్, మార్చ్17 (వుదయం ప్రతినిధి) :ముధోల్ మండలంలోని ఆష్ట గ్రామంలో ఎన్ఆర్ఈజిఎస్ నిధుల మంజూరైన సిసి రోడ్, డ్రైనేజి పనులను నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు రావుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. 4.4 లక్షల నిధులతో పనులు ప్రారంభించడం జరిగిందని అన్నారు. నిధుల కేటాయింపు కోసం కృషి చేసిన ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. నాణ్యత లోపం లేకుండా పకడ్బందీగా పనులు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సురుగుల సునీత పోశెట్టి, మాజీ సర్పంచ్ రావుల పోశెట్టి, కందల అశోక్, మోహన్, లోలం నాగన్న, భూమన్న, గాంగధర్, హన్మాండ్లు, రాజన్న తదితరులు ఉన్నారు.

## ఘనంగా పదవ తరగతి విద్యార్థుల వీడుకోలు



యాదాద్రి భువనగిరి /మార్చ్ 17 వుదయం పతినిధి:- మోత్కూర్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు విద్యా సంవత్సరం పూర్తయిన సందర్భంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలలో గత ఐదు సంవత్సరాలుగా తమ అనుభవాలను నెమరు వేసుకున్నారు ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధాన్ని జ్ఞాపకం చేస్తూ భావోద్వేగానికి లోనయ్యారు అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోపాల్ రెడ్డి ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కారేగాంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం




ముధోల్, మార్చి 17 (వుదయం ప్రతినిధి) ముధోల్ మండలం కారేగాం గ్రామంలో భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో పశువులకు నట్టల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు, గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, ఉచిత మందుల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏఎంసి చైర్మన్ ఆనంద్ రావు పటేల్, ఏఎంసి డైరెక్టర్ రామనాథ్ నాయక్, ఎన్ఎస్యూఐ ముధోల్ మండల అధ్యక్షులు శశి కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎంసి చైర్మన్ ఆనంద్ రావు పటేల్ మాట్లాడుతూ.. "పాడి రైతులకు సబ్సిడీ ద్వారా పశువులు సరఫరా చేయాలని, జిల్లా ఇన్చార్జ్ మంత్రి సీతక్క ద్వారా ఈ అంశంపై కృషి జరుగుతుందని" అలాగే ఎండాకాలంలో పాడి రైతులకు పశుదాన సరఫరా చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. "పశువులు ఆరోగ్యంగా ఉంటేనే పాడి రైతులు ఆదాయం పొందుతారని అన్నారు. పశు వైద్యాధికారి డాక్టర్ రవీందర్ శిబిరంలో పశువులను వైద్యం చేస్తూ మందులు ఉచితంగా అందజేశారు.

## జిల్లా రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం మూలంగా నిరుపేదలకు అందని రేషన్ బియ్యం.



భూపాలపల్లి మార్చి17(వుదయం ప్రతినిధి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండల తహసిల్దార్ కి ప్రజావాణిలో భాగంగా సిపిఐ ఎం ఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 23 గ్రామాలలో నిరుపేదలకు రేషన్ బియ్యం కోసం కొత్త కార్డులకు దరఖాస్తు చేసుకోవడం జరిగింది. కొంతమంది పేర్లు రేషన్ కార్డులు వచ్చిన జిల్లా అధికారుల నిర్లక్ష్యం మూలంగా వాళ్లని లాగిన్ లో చూపెట్టకపోవడం వలన వారికి రేషన్ బియ్యం అందడం లేదు లాగిన్ లో చూపెడితే ఒక గ్రామానికి 10 క్వింటాల బియ్యం ఒక గ్రామానికి వచ్చేవి కానీ అధికారుల నిర్లక్ష్యం మూలంగా నిరుపేదలు రేషన్ బియ్యానికి నోచుకోవడం లేదు తక్షణమే జిల్లా అధికారులు స్పందించి లాగిన్ లో పేర్లు ఉన్న అందరికీ రేషన్ ఇవ్వాలని కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు తీసుకున్న వారందరికీ తక్షణమే రేషన్ కార్డులు ఇవ్వాలని కోరడం జరిగింది మరియు కుందన పెల్లిగ్రామంలో చలివాగు పరివాహ ప్రాంతాలలో ఇసుక మెట్లు పెట్టిందని కొంతమంది దళారులు రెవెన్యూ ఆఫీసులో పర్మిషన్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు అట్లాంటి వారికి పర్మిషన్ ఇవ్వకూడదని అక్రమంగా ఇటుక బట్టిలకు తరలించడానికి కొంతమంది దళారులు చేస్తున్నటువంటి వ్యక్తిగత స్వార్థం కోసం అక్రమ సంపాదన కోసం చేస్తున్నటువంటి పన్నాగం కావున వీళ్లకు పర్మిషన్ ఈ వద్దుకోరడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎం ఆర్ పి ఎస్ సీనియర్ జిల్లా నాయకు రావ్స్ రామ చందర్ మాదిగ పాల్గొన్నారు.

## ఘనంగా పదవ తరగతి విద్యార్థుల వీడుకోలు



మోత్కూర్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు విద్యా సంవత్సరం పూర్తయిన సందర్భంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలలో గత ఐదు సంవత్సరాలుగా తమ అనుభవాలను నెమరు వేసుకున్నారు ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధాన్ని జ్ఞాపకం చేస్తూ భావోద్వేగానికి లోనయ్యారు అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చేసిన నృత్యాలు అలరించాయి.

కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోపాల్ రెడ్డి ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## గిరిజన యూత్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలి

మిర్యాలగూడ, మార్చి17(వుదయం ప్రతినిధి): నల్గొండ కేంద్రంలో గిరిజన యూత్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ కి లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సక్రు నాయక్ సోమవారం వినతిపత్రం అందజేశారు. నిరుపేద గిరిజన విద్యార్థులు వేల ఫీజులు కట్టలేక కోచింగ్ తీసుకోలేకపోతున్నారని, జిల్లాలో గ్రూప్స్, పోలీస్, ఇతర పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు కలెక్టర్ జోక్యం చేసుకొని ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు.

## కలెక్టర్ కార్యాలయం ముందు అంగన్వాడీల నిరసన దీక్ష

సిద్దిపేట, మార్చి17(వుదయం ప్రతినిధి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సంగారెడ్డి కలెక్టరేట్లో అంగన్వాడి ఉద్యోగులు 48 గంటల నిరసన దీక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగులకు కనీస వేతనం రూ. 26, 000 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గతంలో సమ్మె సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. సహాయ కార్యదర్శి యాదగిరి పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




పరకాల మార్చి 17 (వుదయం ప్రతినిధి): శాయంపేట మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-2007 విద్యాసంవత్సరంలో ఎస్.ఎస్.సి పూర్తిచేసుకున్న విద్యార్థులు ఆదివారం రోజు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, ఆనందోత్సాహాలతో ఒకరినొకరు కలుసుకుని ఆనందపడ్డారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ తోటి సహాధ్యాయులతోపాటు, విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను కూడా ప్రత్యేకంగా ఆహ్వానించి, గౌరవంగా సత్కరించారు. ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, మెమెంటోలు అందజేశారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు వారంతా తమ అనుభవాలను పంచుకుని, భవిష్యత్తులో మరిన్ని సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ కిరణ్ శ్రవణ్ ప్రసాద్ పి. ప్రసాద్ శరత్ సతీష్ రాజు పృధ్విరాజ్ అమర్ హేమ సృజన మమత పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలకు సబ్బండ వర్గాల మద్దతు

- వర్గీకరణను అమలు చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తాం
- మూడో రోజుకు చేరిన ఎమ్మార్పీఎస్ రిలే నిరవధిక దీక్షలు



ఎండపల్లి, మార్చి 17(వుదయం విలేఖరి):ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి ఉద్యోగ, విద్య అవకాశాల్లో అమలు పరచాలనే డిమాండ్ తో ఎండపల్లి మండలం రాజారాం పల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉమ్మడి వెల్గటూర్ మండల అధ్యక్షుడు చెన్న కుమారస్వామి నేతృత్వం లోచేపట్టిన రిలే దీక్షలకు సబ్బండ వర్గాల మద్దతు లభిస్తుంది. సోమవారం దీక్ష శిబిరానికి ప్రభుత్వ మాదిగ ఉద్యోగులు, బిజెపి బీఆర్ఎస్ పార్టీల నాయకులు, వివిధ సంఘాల నాయకులు స్వచ్ఛందంగా మద్దతు పలికారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ సామాజిక న్యాయంలో భాగంగా మూడు దశాబ్దాల పోరాట చరిత్ర కలిగిన ఎమ్మార్పీఎస్ ఉద్యమం తో ఎస్సీ వర్గీకరణ కు దేశ సుప్రీంకోర్టు మద్దతు తెలపడంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తామని ఇప్పటివరకు చట్టబద్ధత కల్పించకుండా ఉద్యోగ విద్యా రిజర్వేషన్లను దొడ్డి దారిన చేపడుతుందని తక్షణమే వారి నిలిపివేసి ఎస్సి వర్గీకరణ కు చట్టబద్ధత కల్పించి అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొమ్ము రాంబాబు, బీఆర్ఎస్ నాయకులు గాజుల మల్లేశం, ఆర్యవైశ్య పేద కుటుంబాల సంక్షేమ సంఘం అధ్యక్షులు సముద్రాల రమేష్ గుప్తా, మాదిగ ప్రభుత్వ ఉపాధ్యాయులు చొప్పదండి శంకర్ రమేష్ శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకనపల్లి సతీష్, మంత్ర లక్ష్మణ్ మంత్ర నర్సయ్య రఘు, సుంకేతిరుపతి సోషల్ మీడియా కన్వీనర్ వినయ్, నవీన్, శంకరయ్య రాజేష్, ఎమ్మార్పీఎస్ జగదేవ్ పేట గ్రామ శాఖ అధ్యక్షులు బచ్చల శేఖర్ చెన్న శ్రీనివాస్ బచ్చల సుమన్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినిలకు మనో ధైర్యం కలిగించే విధంగా అవగాహన



జయశంకర్ భూపాలపల్లి మార్చి 17(వుదయం ప్రతినిధి) కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినిలకు మనోధైర్యం కలిగించే విధంగా అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కాలేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుస్మిత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు పదవ తరగతి విద్యార్థినిలకు హెల్త్ ఎడ్యుకేషన్ నిర్వహించినట్లు పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న వేళ వారిలో పరీక్షల భయం తొలగించి, మనోదర్యం కలిగించి పరీక్షలు సజావుగా వ్రాయుటకు అవగాహనా కల్పించినట్లు తెలిపారు విద్యార్థినులు కనీసం ఎనిమిది గంటలు నిద్రపోయి,15 నిముషాలు లేదా 30 నిముషాలు వ్యాయామం, మెడికేషన్ చేయాలి. రోజుకు 3నుండి 4 లీటర్ ల నీరు త్రాగాలి అని,కూల్ డ్రింక్స్, నిలువ చేసిన ఆహార పదార్థాలు, బేకరీఫుడ్స్, చిప్స్ తినకుండా ఉండి,పండ్లు, చిరు ధాన్యలు, కూరగాయలు సులభంగా జీర్ణమయ్యే తక్కువ నూనెలతో తయారుచేసిన ఆహార పదార్థాలను తీసుకోవాలని పేర్కొన్నారు పరీక్షల సమయంలో టి వి, మొబైల్స్ కు దూరంగా వుండాలని అన్నారు

విద్యార్థినులు ఎప్పుడు పాజిటివ్ ఆలోచన లతో ఉండి, పరీక్షల సమయంలో ఏ లాంటి మానసికంగా, వ్యతిగత సమస్యలు, భయం ఉంటే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయుల కు తెలియజేసి, సమస్యలు పరిష్కరించుకోవాలని దైర్యంతో ముందుకు సాగాలని మానసిక సమస్య లకు సైకోలోజిస్ట్ ఫ్రీ కాల్ 14416 సంప్రదిస్తే ఉచితంగా సమస్య కు పరిష్కారం ఉంటుందని తెలిపారు కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ అడప రాజరమణయ్య, ఉపాధ్యాయులు రమాదేవి, ఏ ఎన్ ఎం లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## ఆశాలకు కనీస వేతనం 18 వేల రూపాయలు అందజేయాలి



నారాయణపేట టౌన్ మార్చ్ 17 ( వుదయం ప్రతినిధి) ఆశాలకు కనీస వేతనం 18 వేల రూపాయలు నిర్ణయించి అమలు చేయాలని నారాయణపేట ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. అంతకుముందు పార్కు నుండి భారీ ర్యాలీ నిర్వహించి ఎమ్మార్వో కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బాల్ రామ్, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాలమణి మాట్లాడుతూ వారి పారితోషకం పేరుతో ఆశలను వెట్టిచాకిరికి గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లోనే ఆశా కార్యకర్తలకు కనీస వేతనం 18 నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఏఎన్ఎం ట్రైనింగ్ పూర్తి చేసిన ఆశలకు ఏఎన్ఎం పోస్టుల్లో ఇవ్వాలన్నారు. ప్రతి ఆదివారం పండగ సెలవులను అమలు చేయాలన్నారు.ఎంతో పని ఒత్తిడితో పని చేస్తున్న ఆశలకు కనీస వేతనం అమలు చేయకపోవడం దారుణమని విమర్శించారు. పారితోషకంతో సంబంధంలేని అనేక పనులు ఆశలకు అప్పజెపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంతకుముందు అర్బన్ హెల్త్ సెంటర్ నుంచి ఎమ్మార్వో కార్యాలయం వరకు ర్యాలీ ర్యాలీగా వచ్చారు. వివిధ డిమాండ్లతో కూడుకున్న వినతి పత్రం ఉప తాసిల్దార్ రామకృష్ణ కి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ నాయకులు రాధిక నర్మద, నాగమణి, లక్ష్మి, అనురాధ తదితరుల తో పాటు 80 మంది ఆశలు

## అంగన్వాడీలకు తక్షణమే వేతనాలు పెంచాలి

**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్**



మార్చి 17 దమ్మపేట, (వుదయం ప్రతినిధి):ఐసిడియస్ ను నిర్వీర్యం చేసి పిఎం శ్రీ పథకాన్ని ,మొబైల్ అంగన్వాడి సెంటర్స్ ను రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం తన మెనిఫెస్టో హామీ ప్రకారం 18000 వేతనం పెంచాలని సిఐటి యు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ అంగన్వాడి టీచర్స్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో ఒకరోజు దీక్ష మందలపల్లి సిడిపిఓ ఆఫీస్ నందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని అమలు చేసే ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలి మీని అంగన్వాడి టీచర్స్ ను హెల్పర్స్ ను సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటి గుజరాత్ హైకోర్టు తీర్పు ప్రకారం పర్మినెంట్ చేయాలని, మినీ నుండి మెయిన్ అయినా అంగన్వాడీ టీచర్లను 10 నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకురాలు సూరమ్మ రాజ్యలక్ష్మి జ్యోతి జయ వెంకటేశ్వరమ్మ,శాంతి, కృష్ణ వేణి, పద్మ, శ్రీదేవి, సిపిఎం మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు దొడ్డ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలను అధికారులు త్వరగా పరిష్కరించాలి

**- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**



హనుమకొండ, మార్చి 17(వుదయం జిల్లా ప్రతినిధి) : వివిధ సమస్యలపై ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు స్వీకరించారు. జిల్లాలోని పలు మండలాలకు చెందిన ప్రజలు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణి కార్యక్రమంలో 76 అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన వివిధ సమస్యలను పెండింగ్ లో లేకుండా త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై వి గణేష్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, ముఖ్య ప్రణాళిక అధికారి సత్యనారాయణ రెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, ఇతర జిల్లా అధికారులతో పాటు పలువురు తహసిల్దార్లు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన బిజెపి రాష్ట్ర నాయకులు.



పరకాల మార్చి 17 (వుదయం ప్రతినిధి): పరకాల నియోజకవర్గం దామర మండలం కోగిల్వాయి బిజెపి నాయకులు, మాజీ బూత్ అధ్యక్షులు జంగిలీ రాజేందర్ శిరీష గార్ల వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి కానుక అందజేసిశుభాకాంక్షలు తెలియజేసిన బిజెపి రాష్ట్ర నాయకులు, పరకాల నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు గారులి మండల అధ్యక్షులు వేల్పుల రాజ్ కుమార్, మాజీ మండల అధ్యక్షులు జంగిలి నాగరాజు, సంగెం మండల అధ్యక్షులు దామెరుప్పుల్ల చంద్ర మౌళి, బూత్ అధ్యక్షులు చుక్క మహేందర్ హరికృష్ణ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా పై అభ్యంతరాల స్వీకరణ.!



హనుమకొండ, మార్చి 17(వుదయం జిల్లా ప్రతినిధి) : వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఓటర్ల జాబితా ఫారం 6, 7, 8ల సవరణ పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్ నిర్వహించారు. సోమవారం హనుమకొండ లోని ఆర్డీవో కార్యాలయంలో ఓటర్ల జాబితా సవరణపై గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఓటర్ల జాబితాలో నూతన, ఓటర్ల మార్పుచేర్పులు, ఒక నియోజకవర్గంలో నుంచి మరొక నియోజకవర్గ మార్పులు చేర్పులు, చిరునామా మార్పిడి దరఖాస్తు చేసుకునే విధంగా బిఎల్వోల వద్ద నమోదు చేసుకునేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఆర్డీవో కోరారు. బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాను ఇవ్వాలని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులు అభ్యంతరాలు తెలియజేయడంతో పాటు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం నాయబ్ తహసిల్దార్ సిరంగి విఠలేశ్వర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎండి నేహాల్, రావు అమరేందర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, శ్యామ్ సుందర్ , సయ్యద్ ఫైజుల్లా, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 30 ఫిర్యాదులు



నారాయణపేట టౌన్ మార్చ్ 17 ( వుదయం ప్రతినిధి) ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 30 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్లు కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడి సంచిత్ గంగ్వార్,అదనపు కలెక్టర్ రెవిన్యూ బెంషాలం,ఆర్. డి. ఓ. రాంచందర్,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 16 గంటల సుధీర్ఘ గాన లహరి: చింత వెంకటేష్‌కు మూడు అంతర్జాతీయ రికార్డులు



యాదాద్రి భువనగిరి/మార్చ్ 17 వుదయం పతినిధి:- మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని సుందరయ్య కాలనీకి చెందిన యువ గాయకుడు చింత వెంకటేష్ అద్భుత ప్రతిభను కనబరుస్తూ 16 గంటలపాటు నిరవధికంగా పాడి మూడు అంతర్జాతీయ రికార్డులను తన పేరిట లిఖించుకున్నారు. ఈనెల 16 ఆదివారం సరిగ స్టూడియో చైతన్య, హిమాయత్ నగర్ హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో చింత వెంకటేష్ 16 గంటలు నిర్విరామంగా పాటలు పాడి, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్, రాయల్ సక్సెస్ బుక్ ఆఫ్ రికార్డులు సాధించారు. ఈ ఘన విజయాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇండియన్ చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేంద్ర గౌడ్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్ తెలంగాణ కోఆర్డినేటర్ టి.సుభాషిని, రాయల్ సక్సెస్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ ఎం.హారిక పాల్గొని వెంకటేష్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చింత గణేష్ (నటుడు), రవి కుమార్, ఎస్పీ. నిర్మల, త్రినాధ రావు, అరుణ తదితర ప్రతినిధులు కూడా వెంకటేష్‌ను ప్రశంసించారు. 16 గంటలపాటు 10 భాషల్లో పాటలు పాడటం ద్వారా వెంకటేష్ నెలకొల్పిన రికార్డు సంగీత ప్రపంచంలో అరుదైన ఘనతగా నిలిచింది.

# పదో తరగతి పరీక్షలు విద్యార్థులకు తొలి మెట్టు :పోనకల్ తాజా మాజీ సర్పంచ్ జక్కు భూమేష్



జన్నారం,మార్చ్ 17(వుదయం విలేఖరి) జన్నారం మండలంలోని పోనకల్ గ్రామంలో గల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలు గర్ల్స్ హైస్కూల్, ఆశ్రమ హైస్కూల్,బాయ్స్ హైస్కూల్ లలో పదోతరగతి విద్యార్థులకు పోనకల్ తాజా మాజీ సర్పంచ్ జక్కు భూమేష్ స్వంత ఖర్చులతో విద్యార్థులకు ప్యాడ్స్, పెన్స్, పెన్సిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు చాలా విలువైనవి అని,ఉన్నత చదువుల కోసం పదోతరగతి ఉత్తీర్ణత అవ్వడం మొదటి మెట్టు అని,విద్యార్థులు భయాన్ని వీడి ప్రశాంతంగా, ధైర్యంగా పరీక్షలు వ్రాయాలన్నారు. రాష్టంలొనే పదోతరగతి ఉత్తీర్ణతలో మొదటి స్థానం పోనకల్ గ్రామంలో రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏంఈఓ విజయ్ కుమార్,ప్రభుత్వ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు,భూతం శ్రీనివాస్, అరవింద్,అప్పని సాయి తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మ దేవాలయ నిర్మాణానికి మాజీ సర్పంచ్ దంపతుల విరాళం



జన్నారం,మార్చ్ 17(వుదయం విలేఖరి) జన్నారం మండలంలోని కొత్తూరుపల్లె గ్రామ పోచమ్మ ఆలయ నిర్మాణం కోసం దేవునిగూడెం మాజీ సర్పంచ్ గుర్రం శిరీష- గోపాల్ రెడ్డి దంపతులు 75 వేల రూపాయల విరాళాన్ని అందజేశారు.
సోమవారం ఉదయం వారు ఆ దేవాలయ నిర్మాణ కమిటీ సభ్యులకు డెబ్బైఐదు వేల రూపాయలను విరాళంగా అందజేశారు. దేవాలయ నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సామాజిక ఆర్థిక రాజకీయ సమానత్వం కై పోరాడుదాం!

## – మహిళలపై హింసను వ్యతిరేకిద్దాం
## – రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి



హనుమకొండ, మార్చి 17(వుదయం జిల్లా ప్రతినిధి) : కేంద్ర ప్రభుత్వం మహిళల శక్తి గురించి మాట్లాడుతుంది కానీ మహిళా శక్తిని నిర్వీర్యం చేసే సనాతన ధర్మాలను పాటించాలని నిరంకుశంగా వ్యవహరిస్తుందని దీనికి వ్యతిరేకంగా మహిళా లోకం ఉద్యమించాలని నేదునూరి జ్యోతి భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిలుపునిచ్చింది సోమవారం రోజున జనగామ జిల్లా కేంద్రంలో కందల యదా లక్ష్మి అధ్యక్షతన జరిగిన మహిళా సమాఖ్య జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళా శక్తి గురించి ఆహార నియంత్రణ గురించి మాట్లాడుతూనే వ్యవస్థీకృత హింసకు పాల్పడడం జరుగుతుంది విద్య ఆరోగ్యం అంగట్లో సరుకుగా మారాయి పేదరికం ఆకలి చావులు అరికట్టడానికి 80 కోట్ల కుటుంబాలకు ఐదు కిలోల ధాన్యాన్ని కేంద్రం ఉచితంగా ఇవ్వవలసి వస్తుంది అంటే పేదరికం యొక్క తీవ్రత ఎంత ఉందో అర్థం అవుతుంది. పేదరికం అనివార్యంగా మహిళలపై ఎక్కువ ప్రభావాన్ని చూపుతుంది ఎందుకంటే వారు తమ ఆరోగ్యము ఆకలి కంటే కుటుంబానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి గ్రామీణ పట్టణ ప్రాంతాలలో మహిళల వేతనాలు వ్యత్యాసలతో ఉన్నాయి పారిశుద్ధ కార్మికుల నుండి ఉపాధ్యాయులు ప్రొఫెసర్లు శాస్త్రవేత్తలు డాక్టర్ల వరకు కాంట్రాక్ట్ పద్ధతుల్లో నియమించడం ద్వారా వారి శ్రమ శక్తిని దోచుకుంటూ శాశ్వత ఉద్యోగాల్లో మహిళల యొక్క భాగస్వామ్యాన్ని తగ్గిస్తున్న సమాన పనికి సమాన వేతనం అందరిని ద్రాక్షగా మిగిలిపోయింది గ్రామీణ ప్రాంతాల్లో 100 రోజుల పనిలో కూడా సమాన వేతనం ఇవ్వడం లేదు ప్రపంచ ఆకలి సూచికలో 127 దేశాలలో భారత్ ఐదవ స్థానములో ఉండటం సిగ్గుచేటైన విషయం రాజకీయ పార్టీలలో సామాజిక కోణం నుండి మహిళల యొక్క భాగస్వామ్యాన్ని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది చట్ట సభలలో నామినేటెడ్ పోస్టులలో 50 శాతం మహిళా రిజర్వేషన్లు కల్పించడం ద్వారా దేశ అభివృద్ధిలో మహిళా భాగస్వామ్యాన్ని సాధించడం సాధ్యమవుతుంది రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పడా న్ని స్వాగ తి స్తున్నామన్నారు కానీ అది రాజకీయ నిరుద్యోగా న్ని నివారించేది కాకూడదని సామాజిక ఆర్థిక సాంఘిక వెనుకబాటుతనాన్ని పోగొట్టడానికి వినియోగించాలన్నారు అద్దె బస్సులు పెట్రోల్ బంకులు కాంట్రాక్టులు మహిళలకు ఇస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం అది ఏ మహిళలకు ఇస్తున్నారో ఎంపిక ఏ ప్రాతిపదికను చేస్తున్నారో చెప్పాలని అన్నారు ప్రజా పాలన పేరుతో నడుస్తున్న ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఆడబిడ్డ పెళ్లికి తులం బంగారము మహిళా సాధికారిత కు నెలకు 2500 ఇప్పటికీ అమలు కాలేదని వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు పొదుపు సంఘాల మహిళలు అభయ హస్తం పథకం కింద లక్షల రూపాయలు కట్టారని వాటిని వెంటనే అందజేయాలనీ డిమాండ్ చేశారు ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సోమన్న మాట్లాడుతూ పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇచ్చి పక్క ఇండ్లు కట్టించాలని అర్హులైన వారికి రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు, ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ సఖి, కావటి వనజ, గా. బూలి, నీలా, గా. ఈరమ్మ, మంజుల, విమల, %దీ%. విజయ,%ఖ%. కవిత, %ఎ%. సరిత, కర్నాటి లక్ష్మి, భూక్యా సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్లేట్ల ను పంపిణీ చేసిన పి సి ఆర్ ఫౌండేషన్



జన్నారం,మార్చ్ 17(వుదయం విలేఖరి) జన్నారం పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, గాంధీనగర్ లో పి సి ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్లేట్లను అందజేశారు. సోమవారం రోజున ఉదయం ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడుగు ప్రవీణ్ పాఠశాలలోని 32 మంది విద్యార్థులకు ఫౌండేషన్ ద్వారా ప్లేట్లను తన సొంత ఖర్చులతో ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు దుర్గం తిరుపతి, ప్రశాంత్,దేవేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పెద్దకోడేపాక కాంగ్రెస్ నాయకుడి కుటుంబానికి పెద్దపల్లి ఎమ్మెల్యే పరామర్శ..



పరకాల మార్చి 17 (వుదయం ప్రతినిధి): శాయంపేట మండలం పెద్దకోడేపాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు తడక ఈశ్వర్ తన కుటుంబ సభ్యులను పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పరామర్శించారు. ఈనెల ఏడవ తేదీన ఈశ్వర్ తల్లి అయిన తడుక మల్లక్క అనారోగ్య కారణాల వల్ల మరణించారు. సమాచారం తెలుసుకున్న పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు సోమవారం ఈశ్వర్ నివాసానికి వచ్చి తన సోదరులు తడక శంకరయ్య, తడక ఇంద్రసేన, తడక ఈశ్వర్, వారి బావ పెద్దపల్లి ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ బుర్ర సంపత్ కుమార్ గౌడ్ ను పరామర్శించారు.

# రోడ్డు పనులను ప్రారంభించిన ఎంపీపీ



నారాయణపేట టౌన్ మార్చ్ 17 ( వుదయం ప్రతినిధి) నారాయణపేట మండలం కొల్లంపల్లి గ్రామంలో పొలాలకు వెళ్లే మట్టి రోడ్డును 19 లక్షలతో ఎంపీపీ శివారెడ్డి సోమవారం పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే డా చిట్టెం పర్ణిక రెడ్డి మంజూరు చేయించగా మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం అధికారులు, మాజీ జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ గౌస్, మాజీ ఎంపీటీసీ జనార్ధన్ గౌడ్, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు చిట్టెం మాధవరెడ్డి, నాయకులు గ్రామ ప్రజలు రైతులు పాల్గొన్నారు.

# కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలి: చావా మురళీకృష్ణ



మధిర మార్చి 17 (వుదయం ప్రతినిధి) కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక,రైతు,ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మండల కార్యదర్శి చావా మురళీకృష్ణ అన్నారు. సోమవారం మడుపల్లి సిపిఐ కార్యాలయంలో రైతు సంఘం ముఖ్య నాయకులు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న చావా మురళీకృష్ణ మాట్లాడుతూ,రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్ర ప్రభుత్వం చేసిన రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని అయన డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిటీ సూచన మేరకు అన్ని రకాల పంటలకు, ఆయా ఖర్చుకు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించాలన్నారు. మూడు ఎకరాలలోపు ఉన్న రైతులకు కొందరికి మాత్రమే రైతు భరోసా డబ్బులు పడ్డాయి అని మరికొందరు రైతులకు రైతు భరోసా పడలేదని దీనిపట్ల వ్యవసాయ అధికారులకు ప్రభుత్వం సూచనలిచ్చి వారికి కూడా రైతు భరోసా వచ్చేలా చూడాలన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు పంటల బీమాను కల్పించాలన్నారు. ఈనెల 20న ఖమ్మం జిల్లా వైరాలో జరిగే రైతు సంఘం జిల్లా మహాసభలకు రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు పెరుమాళ్ళపల్లి ప్రకాష్ రావు,రైతు సంఘం మండల అధ్యక్షులు పంగా శేషగిరిరావు,ఊట్ల కామేశ్వరరావు,అన్నవరపు సత్యనారాయణ, ఎస్ కే సబ్జాన్,కాసిన గోపాలరావు, శిలువేరు సత్యం తదితరులు పాల్గొన్నారు.

# కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన.

## పాడి రైతులను ఆదుకోవాలని డిమాండ్.



యాదాద్రి భువనగిరి/రాజాపేట,మార్చి 17 వుదయం ప్రతినిధి: భారతీయ జనతా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం మదర్ డైరీ పాడి రైతులకు పెండింగ్ లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని పాలు లీటరుకు నాలుగు రూపాయలు ప్రభుత్వ ప్రోత్సాహకం అందించాలని నిరసన వ్యక్తం చేసారు. మండలంలోని ప్రజలు ఎక్కువ శాతం వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు పంట పొలాలు నీరు లేక ఎండిపోతున్నాయి సకాలంలో పాల బిల్లులు రాకపోవడం వల్ల రైతులు నిత్యవసర వస్తువులు కూడా అప్పులు చేయవలసిన దుస్థితి ఏర్పడింది వెంటనే ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని రాజపేట మండల శాఖ డిమాండ్ చేశారు. బిజెపి రాజపేట మండల శాఖ అధ్యక్షులు మేకల రమేష్, మాజీ పాల చైర్మన్ గాండ్ల నర్సింగరావు, కంచర్ల శ్రీనివాసరెడ్డి, కోయ మధు, బూర్గు శేఖర్ రెడ్డి జెన్న సిద్ధులు గవ్వల సిద్ధేశ్వర్, అంకతి భాస్కర్, సోమసాని చంద్రమోహన్ తదితరులున్నారు. రాజపేట మిల్క్ చిల్లింగ్ సెంటర్ ముందు, తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలియజేసిన సందర్భంగా నినాదాలు చేశారు. పాడి రైతులను ఆదుకోకపోతే ఆందోళన ఉధృతం చేయనున్నట్లు హెచ్చరించారు.

# రజక సంఘ భవనంలో బోర్ ఏర్పాటు



ముధోల్, మార్చ్17 (వుదయం ప్రతినిధి)ముధోల్ మండల కేంద్రంలోని రజక సంఘ భవనంలో ముధోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే నూతన బోర్ ను వేయించారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బోర్ వేయడం జరిగిందని స్థానిక నాయకులు తెలిపారు. బోర్ ఏర్పాటు చేయడం ద్వారా సంఘ భవనానికి నీటి సౌకర్యం కల్పించబడింది, ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. రజకుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ ఎమ్మెల్యే కృషి చేస్తారని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, మాజీ ఎంపీటీసీ భూమేష్, తాటివార్ రమేష్, పీఏసీఎస్ డైరెక్టర్ సుదర్శన్, సతీష్ రెడ్డి, సంతోష్ కదం, మోహన్ యాదవ్, సాయినాథ్, లవన్, రజక సంఘం నాయకులు ఉన్నారు.

# మండల విద్యాధికారికి వినతి పత్రం అందజేత

ఆర్మూర్, మార్చి17(వుదయం ప్రతినిధి): టెన్త్ పరీక్షలు పకడ్బందీగా మాల్ ప్రాక్టీస్ కు తావివ్వకుండా చర్యలు చేపట్టి నిర్వహించాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ జిల్లా అధ్యక్షులు బైరాపూర్ రవీందర్ గౌడ్, బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దత్తు ఆధ్వర్యంలో బాన్సువాడ మండల విద్యార్థి కారి నాగేశ్వర్ రావుకు సోమవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 21 తేది నుంచి జరగబోయే టెన్త్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు.

# శాసన మండలి లో ఉపాధ్యాయ వాణి వినిపిస్తా!

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా: ఎమ్మెల్సీ పింగలి శ్రీపాల్ రెడ్డి





మధిర మార్చి 17 (వుదయం ప్రతినిధి) ఖమ్మం- నల్గొండ- వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గా గెలుపొందిన అనంతరం మొదటిసారిగా మధిర నియోజకవర్గానికి విచ్చేసిన పి ఆర్ టి యు ఎం ఎల్ సి పింగిలి శ్రీపాల్ రెడ్డి సోమవారం ఎర్రుపాలెం మండలం జమలాపురంలోని వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని అనంతరం మధిరకు విచ్చేసిన సందర్భంగా మధిర టీవీఎం పాఠశాల ఆవరణలో వారిని పి ఆర్ టి యు మధిర మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు . ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం నల్గొండ వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నన్ను ఆదరించి గెలిపించిన ఉపాధ్యాయులు, అధ్యాపకులకు గెలుపు కోసం కృషి చేసిన ప్రతి పిఆర్టియు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ఈ ఎన్నికలో రాజకీయ, కార్పోరేట్ శక్తులను పక్కనపెట్టి ఉపాధ్యాయునిగా ఉన్న నన్ను మండలికి పంపాలి అని ఉపాధ్యాయులు అధ్యాపకులు నిర్ణయం తీసుకోవడం అభినందించదగిన విషయం అన్నారు. ఏ నమ్మకంతో అయితే నన్ను గెలిపించారో ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఉపాధ్యాయులు అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ విద్యారంగా అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు . త్వరలోనే సిపిఎస్ రద్దు ఉపాధ్యాయ పెండింగ్ బిల్లులు పెండింగ్ డీఏలు పిఆర్సి గురుకుల ఉపాధ్యాయ సమస్యలు కేజీబీవీ సమస్యల పరిష్కారం అవుతాయని ఆకాంక్షించారు. పి ఆర్ టి యు మధిర మండలశాఖ ఆధ్వర్యంలో శ్రీపాల్ రెడ్డి ని శాలువా,పూలమలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలోరాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులగం దామోదర్ రెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యలమద్ది వెంకటేశ్వర్లు,ఆర్.రంగారావు జిల్లా మాజీ అధ్యక్షులు మోత్కూరు మధు,మండల విద్యాశాఖాధికారి వై.ప్రభాకర్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్ బ్రహ్మారెడ్డి, పుట్లూరు వెంకట్ రెడ్డి, డి వెంకటేశ్వరరావు, ఎస్.కె మదర్, టి కృష్ణారెడ్డి, చిలుకూరు సత్యనారాయణ రెడ్డి, పోలే సుధాకర్, సిహెచ్ వి రవి, కొమ్ము శ్రీనివాసరావు, బి.వి.ఆర్, కోట జయరాజు, కొన గాని ప్రసాదరావు, పిల్లి నరసింహారావు, ఎల్. అప్పారావు, ఎండి జమీర్, పిడిపి జ్యోతి, టి అనసూయ పాల్గొన్నారు

# చలివేంద్రన్ని ప్రారంభించిన డాక్టర్ దాసి నాగరాజు...



కుత్బుల్లాపూర్, మార్చి 17,(వుదయం ప్రతినిధి ), మానవ సేవనే మాధవ సేవని ఇతరులకు ఇవ్వటంలో ఎంతో ఆత్మ సంతృప్తి ఉందని భగవంతుని ఆశీర్వాదం ఉందని, కారుణ్య వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసి నాగరాజు తెలిపారు. నిజాంపేట్ హనుమాన్ టెంపుల్ దగ్గర బస్టాప్ వద్ద స్థానిక బిజెపి అధ్యక్షులు బిక్షపతి యాదవ్ తో కలిసి చలివేంద్రన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసి నాగరాజు మాట్లాడుతూ మానవసే మాధవ సేవ అని భగవంతునికి మనం ఏదైనా చేయాలని తలస్తే భగవంతుని రూపంలో ఉన్న మనుషులకు చేస్తే సరిపోతుందని భగవంతుడు మనకి ఏమైనా చేయాలని తలిస్తే ఆయన రూపంలో ఉన్న మనుషుల ద్వారా మనకు చేస్తాడని ఇది అందరూ గుర్తుపెట్టుకుని మనుషుల పట్ల దయ, జాలి,

కరుణ, కలిగి వ్యవహరిస్తే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడటానికి దోహదపడుతుందని తెలిపారు. కరోనా సమయంలో ఏర్పాటైన కారుణ్య వెల్ఫేర్ సొసైటీ తన కార్యక్రమాలను నిర్విరామంగా చేయటం ఎంతో సంతోషంగా ఉందని ప్రజలందరి సహకారంతో దేవుని అనుగ్రహంతో రాబోయే కాలంలో మరింతగా ప్రజాసేవ చేయడానికి కృత నిశ్చయంతో కారుణ్య వెల్ఫేర్ సొసైటీ సిద్ధంగా ఉందని తెలిపారు. కరోనా సమయం నుంచి అనేక సేవా కార్యక్రమాలు అనగా పేద విద్యార్థులకు ఫీజులను కట్టడం, పేదలకు వైద్య సహాయం నిమిత్తం ఆర్థిక సహాయం చేయడం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం, క్యాన్సర్ రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేయడం, పేదలు ఎవరైనా చనిపోతే వారి అంత్యక్రియలకు ఆర్థిక సహాయం చేయడం వంటి పలు రకాల కార్యక్రమాలు చేస్తున్నామని ఈ కార్యక్రమాలకు సహకరిస్తున్న ప్రజలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ రాబోయే కాలంలో మరింత అంకితభావంతో ప్రజాసేవ చేస్తామని తెలిపారు. ఈ చలివేంద్రం ద్వారా స్వచ్ఛమైన నీళ్లతో పాటు చల్లని మజ్జిగను ఉచితంగా అందజేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కారుణ్య వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు ఝాన్సీరాణి, పార్లమెంటు మీడియా సెల్ కన్వీనర్ సుమన్ రావు, బిజెపి జిల్లా కార్యదర్శి రచ్చ చక్రధర్, జిల్లా బిల్డర్ సెల్ కన్వీనర్ పద్మ ప్రసాద్, కారుణ్య వెల్ఫేర్ సొసైటీ కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి మంచిర్యాల జిల్లా నూతన కమిటీ ఎన్నిక



జన్నారం, మార్చ్ 17(వుదయం విలేఖరి) మంచిర్యాల జిల్లా తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లెడ భూమయ్య తెలిపారు.ఐదు గురు సీనియర్ కోర్ కమిటీ సభ్యులు ఎరుకల రాజు గౌడ్, అమర కొండ తిరుపతి, పెరుగు మల్లికార్జున్, పాలాజీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతనంగా జిల్లా కార్యవర్గం అధ్యక్షులుగా ఎరుకల రమేష్ గౌడ్, ఉపాధ్యక్షులు భూక్యా లక్ష్మన్ నాయక్, ఆరె సత్యం, ప్రధాన కార్యదర్శి కోట రవీందర్, ఇంచార్జ్ పెట్టెం రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ. ఫయాజ్, మెరుగు రమేష్ గౌడ్, కార్యదర్శి గుమ్ముల సాయి కిరణ్, జంగా తిరుపతి, అధికార ప్రతినిధి ఖాదర్ ఖాన్, సంయుక్త కార్యదర్శి కుంటాల లచ్చన్న, ప్రచార కార్యదర్శి టేకుమాట్ల ప్రశాంత్, ముఖ్య సలహాదారు తోడేటి రవి లను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని వారి హక్కులను రక్షించేందుకు, ప్రభుత్వ స్థాయిలో సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో గల్ఫ్ కార్మికులు పాల్గొన్నారు.

# క్రికెట్ లో అంకిరెడ్డిపల్లి టీం గెలుపు



కొండపాక మార్చి17(వుదయం ప్రతినిధి): ఆదివారం జరిగిన అంక్షాపూర్ క్రికెట్ సీజన్ 1 ఫైనల్ మ్యాచ్ లో అంక్షాపూర్ జట్టుతో తలపడిన అంకిరెడ్డిపల్లి టీం విజయకేతనం ఎగరవేసింది. హెూరా హెూరీగా జరిగిన ఈ మ్యాచ్ లో అంక్షాపూర్ జట్టు పైన 45 పరుగుల తేడాతో అంకిరెడ్డి పల్లి జట్టు విజయం సాధించింది. మొదటగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకునీ నిర్ణీత 10 ఓవర్లు ముగిసే సరికి104 పరుగులు చేసి భారీ స్కోరు కు చేరుకొగా, అంక్షపూర్ జట్టు 10 ఓవర్లు ముగిసే సరికి 59 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి ఓటమి చెందింది..ఈ మ్యాచ్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మధు 51 పరుగులు ,నవీన్ 39 పరుగులు చేయగా, నాటౌట్,బౌలింగ్ లో ఉత్తమ ప్రతిభ కనపర్చిన ర్యామ్స్ 2 ఓవర్లు, 2 వికెట్లు, 7 పరుగులు, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచాడు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డులను నిర్వాహకులు అందజేశారు.

# రాణి రుద్రమదేవి, సేనాధిపతిలుగా నటనకు ప్రోత్సాహక బహుమతి





పెద్దవంగర, మార్చి 17 (వుదయం ప్రతినిధి):మడికొండ రెడ్డి కన్వెన్షన్ హాల్లో జరిగిన లయన్స్ ఇంటర్నేషనల్ 9వ డిస్టిక్ అన్యువల్ కన్వెన్షన్ -2025 జరిగిన బ్యానర్ ప్రజెంటేషన్ ప్రతిభ పోటీలలో లయన్స్ క్లబ్ పోటీలలో ప్రత్యేక ప్రోత్సాహక బహుమతి, లయన్స్ పెద్దల ప్రశంసలు అందుకున్న పెద్దవంగర లయన్స్ క్లబ్ రాణి రుద్రమదేవిగా లయన్స్ క్లబ్ జనరల్ సెక్రెటరీ ఎదునూరి రేణుక , సైన్యాధ్యక్షునిగా గట్ల లక్ష్మీనారాయణ ,రాపోలు శ్రీనివాస్ పూర్వ కార్యదర్శి ఎర్ర వెంకన్న మరియు అధ్యక్షులు ఎదునూరు శ్రీనివాస్ లు ఖిలా వరంగల్ పరిసర ప్రాంతాలలో రుద్రమదేవి యొక్క విన్యాసాలు చరిత్ర చిత్రీకరించి వీడియో డాక్యుమెంటేషన్ను ప్రజెంటేషన్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా లయన్ సేవలతో పాటు ప్రాచీన కళలను వెలికి తీయడానికి సందేశాత్మక మెసేజ్ ఇవ్వడానికి కలల నైపుణ్యతను ప్రదర్శించడం గొప్పతనం అని పెద్ద వంగర లైన్స్ క్లబ్ సేవతోపాటు అనేక కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నందుకు అభినందనలు వెల్లువిరిచినాయి ఈ కార్యక్రమాల నిర్వహణలో చాకచక్యంగా నటించిన వారందరికీ అభినందనలు లైన్స్ ఇంటర్నేషనల్ వారు తెలిపారు , ఇలాంటి కార్యక్రమాలు చేయడం వల్ల జీవితంలో సేవతో పాటు మరపురాని ఘట్టాలుగా నిలుస్తాయని కొనియాడారు.

# నాసిక్ చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మేడ్చల్, మార్చి17(వుదయం ప్రతినిధి): జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దమ్మాయిగూడ నాసిక్ చెరువులో సోమవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. శవం నీటిలో తేలడంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలు ఎవరు? ఎందుకు చనిపోవాల్సి వచ్చింది? ఎవరైనా చంపేశారా? చెరువులో ఎందుకు పడి ఉంది? అనే విషయం తెలియాల్సి ఉంది.

# విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

## బ్రిలియంట్ హై స్కూల్ కరస్పాండెంట్ వకంతుల అప్పారావు



మహబూబాబాద్ జిల్లా డోర్నకల్/( వుదయం ప్రతినిధి) డోర్నకల్ పట్టణంలో బ్రిలియంట్ హై స్కూల్ కరస్పాండెంట్ వకంతుల అప్పారావు, అధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల విడ్కోల్ సమావేశం ఘనంగా నిర్వహించారు.. విద్యార్థులు ఉపాధ్యాయులు మధ్యలో అనుభూతులను గుర్తుచేసుకున్నారు.. తరగతి గదుల్లో విద్యార్థుల ప్రతిభను గుర్తించి బహుమతులు అందజేశారు.. విద్యార్థులు గుర్తుగా పాఠశాలకు కుర్చీలు అందచేశారు.. అనంతరం విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి..ఈ సందర్భంగా బ్రిలియంట్ హై స్కూల్ కరస్పాండెంట్ వకంతుల అప్పారావు మాట్లాడుతూ.. నేను ఎంతో ఉన్నతమైన చదువు చదువుకున్న, నా ప్రతిభకు ఎన్నో ఉద్యోగ అవకాశాలు వచ్చిన.. అని పక్కన పెట్టి పదిమందికి ఉపాధి కల్పించాలి, విద్యార్థులు ఉన్నతమైన విద్యను అందించాలని.. నా మిత్రుల సహకారంతో బ్రిలియంట్ హై స్కూల్ స్థాపించనని తెలిపారు.. నా ఆశయానికి గుర్తుగా విద్యార్థులు మంచి మార్కులు సాధించి బ్రిలియంట్ హై స్కూల్ కు విద్యార్థుల తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

# మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం

-ఎల్ఆర్ఎస్ పేరుతో ప్రజల రక్తాన్ని జలగలా పీలుస్తున్న ప్రభుత్వం

-దోపిడీకి పాల్పడుతున్న కాంగ్రెస్ నేతలు

-ఆరు గ్యారెంటీ లను తక్షణమే అమలుపరచాలి డిసిఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి





ధర్మపురి మార్చి 17(వుదయం విలేకరి):మోసపూరిత హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందని, ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను బేషరతుగా అమలు పరచాలని, ఎల్ఆర్ఎస్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల రక్తాన్ని జలగల్లా పీలుస్తుందని డిసిఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. సోమవారం కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పేరుతో దోపిడీకి పాల్పడు తుందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్మపురి మున్సిపల్ కార్యాలయం ముందు బీఆర్ఎస్ నాయకులు ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు.విషయం తెలుసుకున్న పోలీసులు వారికి సర్దిచెప్పి విరమింపజేశారు.ఈ సందర్భంగా డిసిఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డీ, అయ్యోరి రాజేష్, ఇందారపు రామన్న లు మాట్లాడుతూ గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మాజీ పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఎల్ఆర్ఎస్ ను అమలు పరచారని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఒక్కరి నుండి అడ్డగోలు దోపిడీ చేస్తూ ఒక ధర్మపురి మున్సిపాలిటీ పరిధిలోనే 100 కోట్ల భారం పడేటట్లు మార్గదర్శకాలు రూపొందించిందని ఆరోపించారు. తక్షణమే ఈ దోపిడీని ఆపాలని లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 15 నెలలు గడిచినా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురి దేవస్థానం ముందు బాండ్ పేపర్ పై రాసిచ్చిన ఆరు గ్యారంటీల అమలు నోచుకోలేదని, 420 హామీలు ఇచ్చి అసమర్థ పాలనతో ఇప్పుడు అమలు చేయలేక తలలు పట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఒకవైపు హామీలు అమలు చేయలేక మరోవైపు గల్లి నుండి ఢిల్లీ స్థాయి లీడర్ వరకు కాంగ్రెస్ నాయకులు దోపిడీకి పాల్పడుతున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని రైతు రుణమాఫీ 50 శాతం మాత్రమే జరిగిందని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, రైతు భరోసా పూర్తిస్థాయిలో అమలు కాలేదని ధర్మపురి నియోజకవర్గంలో ఇంకా 3వేల మంది రైతులకు నగదు జమ కాలేదని తక్షణమే నిధులు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎల్ల గౌడ్,ఆకుల రాజేష్, ఒడ్నాల మల్లేశం,ఎస్డి. యూనూస్, అనంతుల. లక్ష్మణ్,కంది.తిరుపతి,నక్క.రాజేందర్,స్థంబంకాడి.మహేష్,పురాణపు.సాంబు,అయ్యోరి.వేణు,బండారి. అశోక్,బండారి. రంజిత్,సంగ. శీను, ఎదేవుల. నరేష్, చీర్నేని.నరసయ్య,జగన్,గుర్రాల.సుధాకర్,అన్నందాసు. శ్రీను, మామిడి. శీను,చీపురుశెట్టి. రాజన్న,కళ్లెపు .రాజిరెడ్డి పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాల్వలో నీటి ప్రవాహం కోసం పరిశీలన





పెద్దపల్లి జిల్లా:మార్చి, 17 (వుదయం)ప్రతినిధి: రెగడి మాదీకుంట నుంచి కాల్వశ్రీరాంపూర్ వరకు నీటి ప్రవాహాన్ని తీసుకురావాలని స్థానిక ఎమ్మెల్యే ఇచ్చిన ఆదేశాల మేరకు 53,ఆర్ కాలువ వెంట పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య మాట్లాడుతూ, ఈ కాలువ ద్వారా రైతులకు నీరు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

రైతుల కష్టాలను అర్థం చేసుకుని, కాలువ మరమ్మతులు, నీటి సరఫరా సమస్యల పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాల్వ గుండా నీరు నిరంతరాయంగా ప్రవహించేలా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మదాసి సతీష్, సునీల్ రావు తదితరులు పాల్గొని కాలువ పరిస్థితిని పరిశీలించారు.

# ప్రజలను ఇబ్బంది పెట్టే ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుంటాం..... ట్రాఫిక్ ఎస్సై మల్లేష్



కోదాడ టౌన్ మార్చి 17(వుదయం) రోడ్డు ప్రమాదాల నివారణ పైన అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు. సోమవారం కోదాడ పట్టణంలోనీ ఖమ్మం క్రాస్ రోడ్ లో ఆటో డ్రైవర్లకు, వాహన చోదకులకు ట్రాఫిక్ నియమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తూ ఆటోలను నిర్లక్ష్యంగా నడిపిన డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామనీ హెచ్చరించారు. ఆటోలు, మినీ టాటా ఏసీ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. ఆటోలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు మీ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారంఅందించాలన్నారు..ప్రజలకు ఇబ్బంది కలిగించే అకతాయిలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్స్ ఆర్సీ ఉంచుకోవాలని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ఆటోలను కట్టడి చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# ఎస్సీ ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్

## నేషనల్ ఎస్సీ కమిషన్‌కు అంబేద్కర్ యువజన సంఘం నేతల వినతి




పెద్దపల్లి జిల్లా: మార్చి, 17 (వుదయం)ప్రతినిధి: నిట్టూరు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మూడు మంది ఉపాధ్యాయులు ఎస్సీ కులానికి చెందిన మహిళా ఉపాధ్యాయురాలని కులదూషణలు చేస్తూ అవమానించారని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నేతలు ఆరోపించారు. దింతో, వారిపై తక్షణ చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ మేరకు నేషనల్ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్‌ను రామగుండం ఎన్టీపీసీ గెస్ట్ హౌస్‌లో కలుసుకుని వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులను రెచ్చగొట్టి పాఠశాలకు తాళం వేయించడానికి ప్రేరేపించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే, ఎలాంటి తప్పు చేయకపోయినా లింగమల్ల శంకర్‌పై సస్పెన్షన్ విధించడం అన్యాయమని, వెంటనే ఆ నిర్ణయాన్ని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు కురుమపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, రిటైర్డ్ ఫారెస్ట్ రేంజర్ బూడిద రాజయ్య, జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైస రాజేష్, జిల్లా కమిటీ కో కన్వీనర్ ఆకునూరి బాల అంకుష్, ఎక్కిరాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.ఇది మరింత స్పష్టతతో, ప్రామాణికంగా ఉంటుంది. మీకేమైనా మార్పులు కావాలనుకుంటే తెలియజేయండి.

# ప్రభుత్వ విప్ ను కలిసిన నూతన ఏజిపి ఇమ్మడి శ్రీనివాస్



ధర్మపురి,మార్చి 17(వుదయం విలేకరి):ధర్మపురి జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ లో ఇటీవల నూతనంగా అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ గా నియామకమైన ఇమ్మడి శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సోమవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను ధర్మపురి లోని క్యాంప్ కార్యాలయంలో సహచర న్యాయవాధులు మిత్రుల తో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలయజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ నూతన ఏజిపి శ్రీనివాస్ ను అభినందించారు. నిరుపేదల కు న్యాయ సహాయం అందేలా కృషి చేయాలనీ సూచించారు.

# బిజినెస్



## వచ్చే నెల నుంచి పెరగనున్న ఈ వాహనాల ధరలు




దేశంలో ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి, వాహన కొనుగోలు దారులకు షాక్ ఇచ్చే వార్తను తెలిపింది. ఈ క్రమంలో ఏప్రిల్ 2025 నుంచి తమ వాహనాల ధరలను పెంచుతున్నట్లు సోమవారం అధికారికంగా ప్రకటించింది. భారతదేశంలో అతిపెద్ద ప్యాసింజర్ కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి సోమవారం కీలక ప్రకటన చేసింది. ఈ క్రమంలో తన వాహనాల ధరలను ఏప్రిల్ 2025 నుంచి పెంచుతున్నట్లు తెలిపింది. పెరుగుతున్న ఖర్చుల నేపథ్యంలో ధరల పెంపు తీసుకున్నామని, ఇది మోడళ్ల తీరును బట్టి మారుతుందని ఆటోమొబైల్ సంస్థ వెల్లడించింది. మారుతి సుజుకి ఇండియా మార్చి 17న రెగ్యులేటరీ ఫైలింగ్‌లో ఈ విషయాన్ని ప్రకటించింది. ధరల పెంపు ప్రకటన తర్వాత మారుతి సుజుకి షేర్ల ధర దాదాపు 2% పుంజుకుంది. మారుతి సుజుకి ఫిబ్రవరి 2025లో మొత్తం 199,400 యూనిట్ల వాహనాలను విక్రయించింది. గత సంవత్సరం ఇదే నెలలో అమ్ముడైన 197,471 యూనిట్ల నుంచి 0.97% స్వల్ప వృద్ధిని నమోదు చేసింది. ఫిబ్రవరి 2025లో మొత్తం అమ్మకాలలో దేశీయ అమ్మకాలు 163,501 యూనిట్లు, ఇతర %ాజువీ%లవి 10,878 యూనిట్ల అమ్మకాలు, 25,021 యూనిట్ల ఎగుమతులు ఉన్నాయి. ఈ క్రమంలో ఎగుమతులు సంవత్సరానికి 13.5% తగ్గుదల ను నమోదు చేశాయి. మారుతి సుజుకి షేర్ ధర ఒక నెలలో 9% కంటే ఎక్కువ పడిపోయింది. మారుతి సుజుకి షేర్లు ఆరు నెలల్లో 5.2% పడిపోగా, ఒక సంవత్సరం కాలంలో 1% స్వల్పంగా పెరిగాయి. కానీ తాజాగా ఈ స్టాక్ ధర పుంజుకుంది. గత రెండు సంవత్సరాలలో మారుతి సుజుకి స్టాక్ ధర 40% ర్యాలీ చేసింది. ఇదే క్రమంలో ఈ కంపెనీ స్టాక్ ఐదు సంవత్సరాలలో 107% మల్టీబ్యాగర్ రాబడిని అందించడం విశేషం.

## రైలు ప్రయాణంలో మిడిల్ బెర్త్‌తో ఇబ్బందులు..



భారతదేశంలో చౌకన ప్రయాణ రవాణా సాధనంగా రైలు ప్రయాణం ఉంటుంది. ముఖ్యంగా దూర ప్రాంతాలకు ప్రయాణించాలంటే కచ్చితం రైలు ప్రయాణాన్నే ఎంచుకుంటారు. అయితే రైలు ప్రయాణం చేయాలంటే ముందుగానే టిక్కెట్లు బుక్ చేసుకోవాలి. లేదంటే జనరల్ బోగీల్లో వెళ్లాల్సి ఉంటుంది. ఇలా రైలు టిక్కెట్లు బుక్ చేసుకున్నప్పుడు మనకు మిడిల్ బెర్త్ వస్తే ఆ బాధ మామూలుగా ఉండదు. కూర్చోడానికి చాలా ఇబ్బంది పడాల్సి ఉంటుంది. భారతదేశంలో రైలులో ప్రయాణించడం ఒక సాధారణ, అనుకూలమైన రవాణా విధానం. భారతీయ రైల్వేలు ప్రయాణీకులకు అనేక రకాల వసతిని అందిస్తాయి. వాటిలో మూడు-టైర్ బెర్త్‌లతో (ఎగువ, మధ్య, దిగువ) స్లీపర్ కోచ్‌లు ఉన్నాయి. అయితే రైలు ప్రయాణంలో ప్రయాణీకులు తప్పనిసరిగా పాటించాల్సిన కొన్ని నిర్దిష్ట నియమాలు ఉన్నాయి. ముఖ్యంగా మధ్య బెర్త్ విషయానికి వస్తే ప్రత్యేక నిబంధనలు ఉన్నాయి. మధ్య బెర్త్‌లోని ప్రయాణీకులు నిద్రించడానికి తమ బెర్త్‌ను కింద ఉంచుకోవడానికి భారతీయ రైల్వే శాఖ ఒక సమయ వ్యవధిని స్పష్టం చేసింది. మధ్య బెర్త్ వచ్చిన ప్రయాణికులు రాత్రి 10:00 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6:00 గంటల వరకు పడుకోవచ్చు. నిద్రవేళలు ముగిసిన తర్వాత ప్రయాణీకులు మధ్య బెర్త్‌ను నిటారుగా ఉండే స్థానానికి మడవాలి. ఇది దిగువ బెర్త్‌లో కూర్చోవడానికి స్థలాన్ని అందిస్తుంది, దిగువ, మధ్య బెర్త్‌లపై ఉన్న ప్రయాణీకులు సౌకర్యవంతంగా కూర్చోవడానికి వీలు కల్పిస్తుంది. ముఖ్యంగా పగటిపూట మధ్య బెర్త్‌ను వదిలివేయకూడదని రైల్వే నిబంధనలు ఉన్నాయి. నిద్రపోని సమయాల్లో మధ్య, దిగువ బెర్త్ ప్రయాణీకులకు దిగువ బెర్త్ ఒక సాధారణ సీటింగ్ ప్రాంతంగా పంచుకోవాల్సి ఇది కోచ్‌లోని పరిమిత సీటింగ్ స్థలాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకునేలా చేస్తుంది. ఉదయం 6 గంటల తర్వాత మిడిల్ బెర్త్‌లో కూర్చున్న ప్రయాణీకుడు దానిని మడవడానికి నిరాకరిస్తే అది ఇతర ప్రయాణీకులకు అసౌకర్యాన్ని కలిగిస్తుంది. అలాంటి సందర్భాలలో, మిడిల్ బెర్త్ ప్రయాణీకుడిని దానిని మడవమని అభ్యర్థించే హక్కు ప్రయాణీకులకు ఉంటుంది. నిబంధనలను పాటించకపోతే రైలు సిబ్బందికి లేదా టికెట్ ఎగ్జామినర్ నివేదించవచ్చు.

## ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు అలెర్ట్..




ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు ఐటీ శాఖ కీలక అలెర్ట్ ఇచ్చింది. టీడీఎస్ నియమాలను సవరిస్తున్నట్లు ప్రకటించింది. ట్యాక్స్ డిడక్టెడ్ ఎట్ సోర్స్ (టీడీఎస్) అనేది ఆదాయపు పన్ను చట్టం, 1961 ప్రకారం ఒక వ్యవస్థ, ఇక్కడ జీతం, వడ్డీ, అద్దె లేదా కమీషన్ వంటి చెల్లింపు సమయంలో ఒక వ్యక్తి ఆదాయం నుంచి పన్ను తీసివేస్తారు. తగ్గించిన మొత్తాన్ని చెల్లింపుదారుడు ప్రభుత్వానికి జమ చేస్తాడు. ఈ నియమాలను మారుస్తు ఐటీ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. టీడీఎస్ పన్ను ఎగవేతను నిరోధించడంలో సహాయపడుతుంది. ప్రభుత్వానికి స్థిరమైన ఆదాయానికి హామీ ఇస్తుంది. మూలం వద్ద పన్ను తగ్గింపు (టీడీఎస్) నియమాలను సవరిస్తున్నట్లు బడ్జెట్ 2025 ప్రకటించారు. ఈ మేరకు ఏప్రిల్ 1, 2025 నుంచి నూతన నియమాలు అమలు కానున్నాయి. ఈ మార్పులు పన్ను చెల్లింపుదారులకు, ప్రధానంగా పెట్టుబడిదారులు, సీనియర్ సిటిజన్లు, కమిషన్ సంపాదించేవారికి ఆర్థిక ఉపశమనం అందిస్తారు. ఆ నియమాలు ఏంటో? ఓ సారి తెలుసుకుందాం. డివిడెండ్ ఆదాయం, మ్యూచువల్ ఫండ్ ఆదాయాలపై అధిక మినహాయింపు పరిమితి ద్వారా పెట్టుబడిదారులు ప్రయోజనం పొందవచ్చు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్పించిన 2025-26 కేంద్ర బడ్జెట్‌లో, ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వచ్చేలా స్టాక్‌ల నుంచి డివిడెండ్‌లు, ఎంఎఫ్ యూనిట్ల నుండి వచ్చే ఆదాయంపై టీడీఎస్ మినహాయింపు పరిమితిని రూ.5,000 నుండి రూ.10,000కి రెట్టింపు చేసింది. బడ్జెట్‌లో డివిడెండ్ ఆదాయంపై టీడీఎస్ పరిమితిని సవరించారు. ఈ మినహాయింపును రూ. 5,000 నుండి రూ. 10,000 కు పెంచింది, తద్వారా పెట్టుబడిదారులు తమ ఆదాయాలలో ఎక్కువ మొత్తాన్ని నిలుపుకునేందుకు అవకాశం ఇచ్చింది. సీనియర్ సిటిజన్లకు ఎక్కువ ఆర్థిక ఉపశమనం అందించడానికి ప్రభుత్వం టీడీఎస్ మినహాయింపు పరిమితిని రెట్టింపు చేసింది. ఏప్రిల్ 1, 2025 నుంచి బ్యాంకులు ఒక ఆర్థిక సంవత్సరంలో మొత్తం వడ్డీ ఆదాయాలు రూ. 1 లక్ష దాటితేనే ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు నుంచి వడ్డీ ఆదాయంపై టీడీఎస్‌ను తగ్గిస్తాయి.ఒక సీనియర్ సిటిజన్ వార్షిక వడ్డీ ఆదాయం ఈ పరిమితిలోపు ఉంటే టీడీఎస్ తగ్గించరు. 60 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న వ్యక్తులకు వడ్డీ ఆదాయంపై టీడీఎస్ పరిమితిని రూ. 40,000 నుండి రూ. 50,000 కు పెంచారు. ఈ చర్య ముఖ్యంగా ఎఫ్‌డీ వడ్డీని కీలక ఆదాయ వనరుగా ఆధారపడే డిపాజిటర్లకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఇప్పుడు, బ్యాంకులు ఒక ఆర్థిక సంవత్సరంలో సంపాదించిన మొత్తం వడ్డీ రూ. 50,000 దాటితేనే టీడీఎస్‌ను తీసివేస్తాయి.

## టాటా నుంచి మరో అద్భుతమైన ఎలక్ట్రిక్ కారు..

ఇప్పుడు టాటా మోటార్స్ కంపెనీ నుంచి మరో ఎలక్ట్రిక్ కారు మార్కెట్ లోకి విడుదల కావడానికి సిద్ధంగా ఉంది. కాగా టాటా కంపెనీ రాబోయే హారియర్ ఈవీ ప్రొడక్షన్ రెడీ వెర్షన్ ను ప్రవేశపెట్టింది. ఈ కారు త్వరలో ఇండియాలో అందుబాటులోకి రావచ్చుట. ఇంతకుముందు ఈ కారు జనవరి 2025లో జరిగిన ఇండియా మొబిలిటీ ఎక్స్‌పోలో ప్రదర్శించింది టాటా కంపెనీ. అయితే అప్పుడు ఇది కేవలం ఎగ్జిబిషన్ మోడల్ మాత్రమే. కానీ ఇప్పుడు టాటా ఈ కారును టెస్ట్ ట్రాక్ లో నడపడం ద్వారా దాని సామర్థ్యాలను ప్రదర్శించిందట. కాగా ఈ హారియర్ ఈవీ కారు అద్భుతమైన డిజైన్ తో రానుంది. దాని లుక్ పెట్రోల్ వెర్షన్ ని పోలి ఉంటుందట. అయితే దీనిలో కొన్ని ప్రత్యేక మార్పులు చేసిందట. అదేమిటంటే ఇది పెట్రోల్ వెర్షన్ నుండి భిన్నంగా ఉంటుందని తెలుస్తోంది. కాగా కారు డిజైన్ ను మరింత మెరుగుపరచడం కోసం దీనిలో కొత్త స్టైల్ అల్లాయ్ వీల్స్ ను ఏర్పాటు చేశారట. కారు వెనుక భాగం మునుపటిలాగే కనిపిస్తుందట. కానీ దీనికి కనెక్ట్ చేయబడిన రాజుణ టెయిల్ లైట్లు ఉంటాయట. అలాగే ఇది కొద్దిగా భిన్నంగా ఉంటుందని, అలాగే వెనుక బంపర్ కూడా పునః రూపకల్పన చేయబడిందని చెబుతున్నారు. ఇప్పుడు ముందు బంపర్ లాగా నిలువు స్లాట్ లకు సరిపోతుందట. లోపలి భాగంలో టాటా హారియర్ ఈవీ లేఅవుట్ పెట్రోల్ వెర్షన్ ని పోలి ఉంటుందట. క్యాబిన్ ముఖ్యాంశాలు వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, ఆపిల్ కార్‌ప్లేకు మద్దతు ఇచ్చే 12.3 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ తో ఉందట. ఇందులో 10.25 అంగుళాల ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, పనోరమిక్ సన్‌రూఫ్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, 10 స్పీకర్ జీదీూ సౌండ్ సిస్టమ్ ఉన్నాయట.




### మూడేళ్లల్లో ఎఫ్‌డీలపై ముచ్చటైన రాబడి..

ఫిక్స్‌డ్ డిపాజిట్ అనేది మీకు స్థిరమైన రాబడిని ఇచ్చే సురక్షితమైన పెట్టుబడి. ఎఫ్‌డీల్లో ఏడు రోజుల నుంచి 10 సంవత్సరాల వరకు స్వల్ప లేదా దీర్ఘకాలిక కాలానికి పెట్టుబడి పెట్టవచ్చు. మీరు ఎంత పెట్టుబడి పెడతారు? ఎంతకాలం పెట్టుబడి పెడతారు? అనే దానిపై మీరు సంపాదించే వడ్డీ ఆధారపడి ఉంటుంది. ఎఫ్‌డీలపై వడ్డీ రాబడిని ప్రతి నెలా, ప్రతి 3 నెలలకు, ప్రతి 6 నెలలకు, ప్రతి సంవత్సరం, లేదా పెట్టుబడి ముగిసినప్పుడు ఒకేసారి ఎంచుకునే సదుపాయం ఉంది. సాధారణ, సీనియర్ సిటిజన్లు రూ. 8 లక్షలను మూడు ప్రధాన బ్యాంకుల్లో పెట్టుబడి పెడితే రాబడి ఎంత వస్తుంది? ఎస్‌బీఐ సాధారణ పౌరులకు వడ్డీ రేటు 6.75 శాతం ఇస్తుంటే సీనియర్ సిటిజన్లకు వడ్డీ రేటు 7.25 శాతం వడ్డీ ఇస్తుంది. పంజాబ్ నేషనల్ బ్యాంకు బ్యాంక్ ప్రస్తుతం తన 3 సంవత్సరాల ఎఫ్‌డీపైపై సాధారణ పౌరులకు 7 శాతం వడ్డీ రేటును అందిస్తోంది.సీనియర్ సిటిజన్లకు 7.50 శాతం వడ్డీ రేటును అందిస్తోంది. బ్యాంకు ఆఫ్ బరోడా సాధారణ పౌరులకు వడ్డీ రేటు 7.15 శాతం వడ్డీ ఇస్తుంటే సీనియర్ సిటిజన్లకు 7.65 శాతం వడ్డీ ఇస్తుంది. ఎస్‌బీఐ రూ. 8లక్షల పెట్టుబడిపై సాధారణ పౌరులకు 3 సంవత్సరాల ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో అంచనా వేసిన మెచ్యూరిటీ మొత్తం రూ. 9,77,914గా ఉంది. అంటే రాబడి రూ. 1,77,914. సీనియర్ సిటిజన్లకు 3 సంవత్సరాల ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో అంచనా వేసిన మెచ్యూరిటీ మొత్తం రూ. 9,92,438గా ఉంటుంది.

## ఎస్‌బీఐ స్కీమ్‌లో పెట్టుబడికి ముంచుకొస్తున్న గడువు..

పొదుపు విషయంలో భారతీయులు ఎప్పుడూ ముందు ఉంటారు. భవిష్యత్‌ను ఆలోచించి పెట్టుబడి పెట్టే వారి సంఖ్య ఇటీవల కాలంలో కొంత తగ్గుతుంది. ఈ నేపథ్యంలో ఇలాంటి వారిని ఆకర్షించేందుకు అన్ని బ్యాంకులు కొన్ని ప్రత్యేక స్కీమ్స్ ప్రకటిస్తున్నాయి. ఇటీవల ఎస్‌బీఐ ప్రకటించిన ఎస్‌బీఐ అమృత్ కలశ్ స్కీమ్ పెట్టుబడికి ఆఖరు తేదీ ముంచుకువస్తుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్లు సురక్షితమైన, నమ్మదగిన పెట్టుబడి ఎంపికగా విస్తృతంగా పరిగణిస్తున్నారు. ముఖ్యంగా తక్కువ రిస్క్, అధిక-రిటర్న్ పథకాలను కోరుకునే సీనియర్ సిటిజన్లు పెట్టుబడిపై ఆసక్తి చూపుతున్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందించే అమృత్ కలాష్ ఎఫ్‌డీ స్కీమ్ నిర్ణీత కాలానికి ఆకర్షణీయమైన వడ్డీ రేట్లను అందిస్తుంది. ఎస్‌బీఐ అమృత్ కలశ్ పథకం అనేది మార్చి 31, 2025 వరకు అందుబాటులో ఉండే 400 రోజుల ప్రత్యేక డిపాజిట్ పథకంగా ఉంది.ఎస్‌బీఐ అమృత్ కలశ్ పథకం సాధారణ పెట్టుబడిదారులకు సంవత్సరానికి 7.10 శాతం, సీనియర్ సిటిజన్లకు సంవత్సరానికి 7.60 శాతం వడ్డీ రేటును అందిస్తుంది. ఈ పథకం పదవీ విరమణ చేసిన వారికి, స్థిరమైన ఆదాయ మార్గాన్ని కోరుకునే వ్యక్తులకు ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ స్కీమ్‌లో రూ. లక్ష పెట్టుబడిపై, సాధారణ పెట్టుబడిదారులు 400 రోజుల వ్యవధిలో రూ. 7,100 వడ్డీని అందిస్తుంది. మరోవైపు సీనియర్ సిటిజన్లు రూ. 7,600 వరకు వస్తుంది. రూ. 10 లక్షల పెద్ద పెట్టుబడి సాధారణ పెట్టుబడిదారులకు రూ. 5,916, సీనియర్ సిటిజన్లకు రూ. 6,333 నెలవారీ వడ్డీ ఆదాయాన్ని ఇస్తుంది. ఎస్‌బీఐ అమృత్ కలశ్ పథకం గడువును అనేకసార్లు పొడిగించింది. ప్రస్తుత గడువు, మార్చి 31 2025గా ఉంది. ఇకపై ఈ స్కీమ్‌పై ఎలాంటి పొడిగింపు ఉండదని నిపుణులు చెబుతున్నారు. ఈ పథకం సౌకర్యవంతమైన వడ్డీ చెల్లింపు ఎంపికలను అందిస్తుంది. నెలవారీ, త్రైమాసిక లేదా

# జాతీయం – అంతర్జాతీయం

## 88 కోట్లు విలువ చేసే డ్రగ్స్ స్వాధీనం

రూ. 88 కోట్లు విలువ చేసే మెథామ్‌ఫెటామైన్ టాబ్లెట్ల భారీ సరకును స్వాధీనం చేసుకున్నట్లు, ఇంఫాల్, గౌహతి మండలాల్లో అంతర్జాతీయ డ్రగ్ ముఠా సభ్యులు నలుగురిని అరెస్టు చేసినట్లు కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా ఆదివారం వెల్లడించారు. భారీ స్థాయిలో మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకోవడం దర్యాప్తు దిశగా సంపూర్ణ దృక్పథానికి ప్రబల నిదర్శనం అని కూడా అమిత్ షా అన్నారు. డ్రగ్స్‌పై నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతూనే ఉంటుందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. 'డ్రగ్స్ మాఫియాపై దయాదాక్షిణ్యాలు ఏమీ ఉండవు. డ్రగ్స్ రహిత భారత్ నిర్మాణం దిశగా మోడీ ప్రభుత్వ ప్రస్థానాన్ని వేగవంతం చేస్తూ రూ. 88 కోట్లు విలువ చేసే మెథామ్‌ఫెటామైన్ ట్యాబ్లెట్ల భారీ సరకును స్వాధీనం చేసుకున్నారు. ఇంఫాల్, గౌహతి జోన్‌లలో అంతర్జాతీయ డ్రగ్ ముఠా సభ్యులు నలుగురిని అరెస్టు చేశారు' అని అమిత్ షా 'ఎక్స్' పోస్ట్‌లో తెలియజేశారు. ఈ విజయానికి నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి)కి హోమ్ శాఖ మంత్రి 'హృదయపూర్వక' అభినందనలు తెలియజేశారు. ఒక సమాచారం ఆధారంగా ఎన్‌సిబి ఇంఫాల్ జోన్ అధికారులు ఈ నెల



13న ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారని, ఎన్‌సిబి బృందం లైలాంగ్ ప్రాంతంలో ఒక ట్రక్‌ను అడ్డుకుని, ట్రక్ వెనుక భాగంలో ఒక టూల్‌బాక్స్‌లో నుంచి 102.39 కిలోల మెథామ్‌ఫెటామైన్ ట్యాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నారని ఒక అధికార ప్రకటన వెల్లడించింది. ట్రక్‌లో ఉన్న ఇద్దరు వ్యక్తులు అరెస్టు చేసినట్లు ఆ ప్రకటన తెలియజేసింది. ఆ బృందం ఏమాత్రం ఆలస్యంచేయకుండా తదుపరి ఆపరేషన్ నిర్వహించి, లైలాంగ్ ప్రాంతంలో ఆ నిషిద్ధ డ్రగ్స్ అందుకున్నట్లుగా అనుమానిస్తున్న వ్యక్తిని పట్టుకున్నదని ఆ ప్రకటన తెలిపింది. డ్రగ్స్ అక్రమరవాణాకు ఉపయోగించిన ఒక నాలుగు చక్రాల వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు, ఆ తరువాత సదరు వ్యక్తిని అరెస్టు చేసినట్లు ప్రకటన తెలియజేసింది. ఆ నిషిద్ధ డ్రగ్స్‌కు అనుమానిత మూలస్థానం మణిపూర్‌లోని మోరెహ్ పట్టణం అని, ఈ కేసులో పాత్ర ఉన్న ఇతరుల పట్టివేతకు మరింత దర్యాప్తు సాగుతోందని ప్రకటన తెలియజేసింది.

## అమెరికాలో ప్రకృతి విపత్తుల బీభత్సం

మధ్య, దక్షిణ అమెరికా వ్యాప్తంగా టోర్నడోలు, పెను గాలులు సృష్టించిన బీభత్సంలో ఇళ్లు ధ్వంసమయ్యాయి, పాఠశాలలు తుడిచిపెట్టుకుపోయాయి, సెమీట్రాక్టర్ ట్రెయిలర్లు పల్టీకొట్టాయి. పెను తుపానుకు కనీసం 32 మంది బలి అయ్యారు. తుపాను వల్ల బాగా దెబ్బ తిన్న వేయిన్ కౌంటీలో తన బంధువు ఇంటి వద్ద శిథిలాల్లో శుక్రవారం రాత్రి చెల్లాచెదురుగా పడి ఉన్న ఐదు శవాలను తాను, ఇతర సహాయక సిబ్బంది కనుగొన్నామని మిస్సోరి వాసి డకోటా హెండర్సన్ తెలిపార. రాష్ట్రంలో శిథిల భవనాల్లో కనీసం డజను మంది మరణించారని అధికారులు తెలిపారు. కాగా, మూడు కౌంటీల్లో ఆరుగురు వ్యక్తులు మృతి చెందినట్లు, తుపానులు తూర్పు దిశగా అలబామా వైపు కదలగా మరి ముగ్గురు శనివారం రాత్రి పొద్దుపోయిన తరువాత గల్లంతయ్యారని మిస్సిసిపి గవర్నర్ టేట్ రీవ్స్ వెల్లడించారు. అలబామాలో ఇళ్లు, రోడ్లు ధ్వంసమయ్యాయని అధికారులు తెలిపారు. ఆర్కన్సాస్‌లో ముగ్గురు మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఆర్కన్సాస్ గవర్నర్ సారాహ్ హుక్కబీ సాండర్స్, జార్జియా గవర్నన్ బ్రియాన్ కెంప్ తమ తమ ప్రాంతాల్లో ఎమర్జన్సీ ప్రకటించారు. జార్జియాలో ఇసుక తుపాను ఉద్ధృతికి శుక్రవారం కనీసం 12 మంది మరణించారు. కాన్సాస్ హైవేపై కనీసం 50 వాహనాలు



ఒకదానినొకటి ఢీకొని కుప్పలుగా పేరుకుపోగా ఎనిమిది మంది వ్యక్తులు మృతి చెందారు. టెక్సస్‌లోని అమరిల్లోలో ఇసుక తుపాను ధాటికి కార్లు ప్రమాదానికి గురి కాగా ముగ్గురు వ్యక్తులు మరణించినట్లు అధికారులు తెలిపారు. ఇది ఇలా ఉండగా, ఓక్లహోమా రాష్ట్రంలో 130 పైచిలుకు కార్చిచ్చులు రేగగా కొన్ని కమ్యూనిటీల్లో జనాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అక్కడ సుమారు 300 ఇళ్లు దెబ్బ తినడమో, ధ్వంసం కావడమో జరిగింది. సుమారు 689 చదరపు కిలోమీటర్ల ప్రాంతం దగ్ధమైందని, ఓక్లహోమా నగరం ఈశాన్య ప్రాంతంలో తన సొంత ఇంటిని నష్టపోయానని గవర్నర్ కెవిన్ స్టిట్ మీడియా గోష్ఠిలో వెల్లడించారు.

## చంద్రయాన్-5 మిషన్‌కు కేంద్రం ఆమోదం




చంద్రుడిని అధ్యయనం చేయడానికి ప్రతిష్టాత్మకమైన చంద్రయాన్-5 మిషన్‌కు కేంద్రం ఇటీవల ఆమోదం తెలిపిందని ఇస్రో చైర్మన్ వి. నారాయణన్ ఆదివారం తెలిపారు. బెంగళూరు ప్రధాన కార్యాలయం కలిగిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఛైర్మన్‌గా నారాయణన్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనను సత్కరించారు.

ఈ సందర్భంగా నారాయణన్ మాట్లాడుతూ%%. 25 కిలోల బరువున్న రోవర్ 'ప్రజ్ఞాన్'ను మోసుకెళ్లిన చంద్రయాన్-3 మిషన్ మాదిరిగా కాకుండా, చంద్రయాన్-5 మిషన్ చంద్రుని ఉపరితలాన్ని అధ్యయనం చేయడానికి 250 కిలోల రోవర్‌ను మోసుకెళ్తుందని అన్నారు. 2008లో విజయవంతంగా ప్రయోగించబడిన చంద్రయాన్-1, చంద్రుని యొక్క రసాయన, ఖనిజ మరియు ఫోటో-జియోలాజిక్ మ్యాప్‌లను తయారు చేసింది. 2019లో చంద్రయాన్-2 మిషన్ చంద్రుని ఉపరితలంపైకి దూసుకెళ్లడంతో ముగిసింది. చంద్రయాన్-2 ఆర్బిటర్‌లోని హై-రిజల్యూషన్ కెమెరా వందలాది చిత్రాలను పంపిందని నారాయణన్ అన్నారు. చంద్రయాన్-3 మిషన్ చంద్రయాన్-2 కు కొనసాగింపుగా, చంద్రుని ఉపరితలంపై సురక్షితంగా ల్యాండింగ్, సంచరించడంలో ఎండ్-టు-ఎండ్ సామర్థ్యాన్ని ప్రదర్శించడానికి ఉద్దేశించబడింది. ఇది ఆగస్టు 23, 2023న చంద్రుని దక్షిణ ధ్రువ ప్రాంతంలో విక్రమ్ ల్యాండర్‌ను విజయవంతంగా సాఫ్ట్-ల్యాండ్ చేయగలిగింది. మూడు రోజుల క్రితం, చంద్రయాన్-5 మిషన్‌కు తమకు ఆమోదం లభించిందని, తాము జపాన్‌తో కలిసి దీనిపై పనిచేయనున్నట్లు నారాయణన్ తెలిపారు. చంద్రయాన్-4 మిషన్ 2027లో ప్రారంభించబడుతుందని భావిస్తున్నారు. చంద్రుని నుండి చంద్రుని నేల నమూనాలను సేకరించి, తదుపరి అధ్యయనం కోసం భూమికి తిరిగి తీసుకురావడం దీని లక్ష్యమని పేర్కొన్నారు. ఇస్రో భవిష్యత్ ప్రాజెక్టుల గురించి, గగన్‌యాన్‌తో సహా వివిధ మిషన్‌లతో పాటు, భారతదేశానికి భారతీయ అంతరిక్ష్ స్టేషన్ అని పిలువబడే స్వంత అంతరిక్ష కేంద్రాన్ని స్థాపించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని నారాయణన్ అన్నారు.

## యెమెన్‌లో అమెరికా దాడులు

యెమెన్‌లో అమెరికా జరిపిన దాడుల్లో 24 మంది మరణించారు. ఆ దాడులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, 'హౌతీల సమయం అయిపోయింది' అని స్పష్టం చేశారు. ఆయన ఈ సందర్భంగా ఇరాన్‌ను కూడా హెచ్చరించారు. హౌతీలకు మద్దతు తక్షణం ఆపాలని ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక జారీ చేశారు. 'హౌతీ ఉగ్రవాదులు అందరికీ హెచ్చరిక. వారి సమయం ముగిసింది. ఇప్పటి నుంచి మీ దాడులకు ఫుల్‌స్టాప్ పెట్టవలసిందే. కాదంటే గతంలో ఎన్నడూ చూడనంతగా నరకం చూస్తారు' అని ట్రంప్ సోషల్ మీడియాచ పోస్ట్‌లో హెచ్చరిక జారీ చేశారు. హౌతీలు బలంగా ఉన్న యెమెన్ రాజధాని సానాలో అమెరికా జరిపిన దాడుల్లో 13 మంది పౌరులు, మరి 11 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో నలుగురు చిన్నారులు, ఒక మహిళ ఉన్నారు.



ఇది ఇలా ఉండగా, యెమెన్‌పై అమెరికా జరిపిన దాడుల్లో మహిళలు, పిల్లలతో సహా మృతుల సంఖ్య 31కి పెరిగినట్లు హౌతీ రెబెల్స్ అధీనంలోని ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. శనివారం రాత్రి దాడుల్లో మరి 101 మంది గాయపడినట్లు మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి అనీస్ అల్ అస్బాహి తెలిపారు.

అమెరికా బాంబు దాడులతో సానా చుట్టుపక్కల ప్రాంతాలో భూమి కంపించింది. దీనితో అందరూ భూకంపం వచ్చిందని భ్రమపడ్డారు. ట్రంప్ యుద్ధ నేరాలకు పాల్పడుతున్నారని హౌతీ పొలిటికల్ బ్యూరో ఆరోపించింది.

ఆ దాడులకుసమాధానం చెప్పేందుకు యెమెన్ సాయుధ దళాలు సిద్ధంగా ఉన్నాయని బ్యూరో హెచ్చరించింది. గత దశాబ్దంలో యెమెన్‌లోని ఎక్కువ భూభాగాన్ని హైతీలు తమ అధీనంలోకి తీసుకున్నారు. 2023 అక్టోబర్‌లో ఇజ్రాయెల్, హమాస్ యుద్ధం ప్రారంభమైన తరువాత దాని తీరంలోని ఓడలపై హౌతీలు దాడులు ప్రారంభించారు. ఇది ప్రపంచ వాణిజ్యానికి ఆటంకంగా మారింది. గాజాలో యుద్ధంపై పాలస్తీనియన్లకు సంఘీభావంగా ఈ దాడులు జరుపుతున్నట్లు హౌతీలు చెబుతున్నారు. కాగా, 2023 నుంచి హౌతీలు 174 పర్యాయాలు అమెరికా యుద్ధ నౌకలపై, 145 సార్లు వాణిజ్య నౌకలపై దాడి చేసినట్లు సమాచారం.

## నైట్ క్లబ్‌లో అగ్నిప్రమాదం

నార్త్ మెసిడోనియాలోని తూర్పు ప్రాంత పట్టణం కొకానిలో ఆదివారం తెల్లవారు జామున ఒక నైట్‌క్లబ్‌లో సంభవించిన భారీ అగ్ని ప్రమాదంలో 51 మంది వ్యక్తులు దుర్మరణం చెందినట్లు, 100 మందికి పైగా గాయపడినట్లు దేశీయాంగ శాఖ మంత్రి పాంచె తొష్కోవ్‌స్కీ మీడియా గోష్ఠిలో వెల్లడించారు. పల్స్ నైట్‌క్లబ్‌లో ఒక స్థానిక పాప్ బృందం కచేరి సమయంలో తెల్లవారు జామున సుమారు 2.35 గంటలకు మంటలు ప్రజ్వరిల్లాయని తొష్కోవ్‌స్కీ తెలిపారు. మండే స్వభావం కలిగిన వస్తువులు వాడడం వల్లే సీలింగ్‌కు నిప్పు అంటుకుందని ఆయన చెప్పారు. క్లబ్‌లో గందరగోళ దృశ్యాలు వీడియోలో కనిపించాయి. దట్టంగా కమ్ముకున్న పొగ మధ్య యువజనులు పరుగులు తీయడం, సాధ్యమైనంత త్వరగా తప్పించుకు బయటపడాలని సంగీతకారులు జనాన్ని కోరుతుండడం వీడియోలో కనిపించింది. క్షతగాత్రులను రాజధాని స్కోప్జె సహా దేశవ్యాప్తంగా గల ఆసుపత్రులకు తరలించినట్లు, అనేక మందికి తీవ్రంగా కాలిన గాయాలు అయినట్లు అధికారులు తెలియజేశారు. అనేక వాలంటీర్ సంస్థలు సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నాయి. 118 మందిని ఆసుపత్రుల్లో చేర్పించినట్లు ఆరోగ్య శాఖ మంత్రి అర్బెన్ తరవరి తెలిపారు. ఇరుగుపొరుగు దేశాల నుంచి సహాయ కార్యక్రమాలకు ప్రతిపాదనలు అందాయని ఆయన తెలిపారు. 'మేము శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాం. ఈ విషాద



ఘటనలో యువజనుల సాయంతో సాధ్యమైనంత ఎక్కువ మందిని రక్షించేందుకు గరిష్ఠ స్థాయిలో యత్నిస్తున్నాం' అని మంత్రి విలేకరులతో చెప్పారు. 20 లక్షల కన్నా తక్కువ జనాభా కలిగిన మెసిడోనియాలో ఇటీవలి కాలంలో సంభవించిన అత్యంత విషాద ఘటన ఇది. 'మెసిడోనియాకు ఇది సంక్లిష్ట, అత్యంత విషాదకర దినం. అనేక మంది యువజనులు ప్రాణాలు కోల్పోవడం దుర్భరం' అని ప్రధాని హ్రిస్తిజన్ మిక్కోస్కి 'ఎక్స్'లో పేర్కొన్నారు.

## ఎఫ్‌టిఎ చర్చలు పునఃప్రారంభం

ఆర్థిక సంబంధాల పెంపుదల నిమిత్తం ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) కోసం సంప్రదింపులను దాదాపు పది సంవత్సరాల తరువాత తిరిగి ప్రారంభించినట్లు భారత్, న్యూజిలాండ్ ఆదివారం ప్రకటించాయి. సరకులు, సేవలు, పెట్టుబడి రంగాల్లో వాణిజ్యం పెంపుదలకు సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందం (సిఇసిఎ) కోసం భారత్, న్యూజిలాండ్ 2010 ఏప్రిల్‌లో సంప్రదింపులను ప్రారంభించాయి. అయితే, పది రౌండ్ల మేరకు సంప్రదింపులు సాగించిన తరువాత చర్చలను 2015 ఫిబ్రవరిలో రెండు దేశాలు ఆపివేశాయి. 'సమగ్ర, పరస్పర ప్రయోజనకర భారత, న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) కోసం సంప్రదింపులను ప్రారంభించినట్లు ప్రకటించేందుకు రెండు దేశాలు సంతోషిస్తున్నాయి' అని కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, న్యూజిలాండ్ వాణిజ్య, పెట్టుబడి శాఖ మంత్రి టాడ్ మెక్‌కే సమావేశం అనంతరం ఈ ప్రకటన వచ్చింది. న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టఫర్



లుక్సాన్ నాలుగు రోజుల పర్యటనపై ఆదివారం ఢిల్లీ చేరుకున్నారు. 'సప్లయి చైన్ సమగ్రత పెరుగుదల, మార్కెట్ సౌకర్యం మెరుగుదల సాధించడం భారత్, న్యూజిలాండ్ ఎఫ్‌టిఎ సంప్రదింపుల లక్ష్యం' అని వాణిజ్య మంత్రిత్వశాఖ తెలియజేసింది. 'ద్వైపాక్షిక వాణిజ్యం క్రమంగా వృద్ధి చెందుతూ ఏప్రిల్‌జనవరి 2025లో ఒక బిలియన్ డాలర్లను దాటడంతో ఎఫ్‌టిఎ సంప్రదింపుల లక్ష్యం మా దేశాల పరస్పర వృద్ధి, సంపద పెంచుతూ వాణిజ్య సంస్థలు, వినియోగదారులకు కొత్త మార్గాలను తెరవడం' అని గోయల్ 'ఎక్స్' పోస్ట్‌లో తెలియజేశారు. మేధో సంస్థ గ్లోబల్ ట్రేడ్ రీసర్చ్ ఇనీషియేటివ్ (జిటిఆర్ఐ) అభిప్రాయం ప్రకారం, తిరిగి ప్రారంభించిన చర్చల్లో ప్రధాన సవాల్ టారిఫ్ వ్యవస్థల్లో అంతరం అవుతుంది. న్యూజిలాండ్ సగటు దిగుమతి టారిఫ్ కేవలం 2.3 శాతం. ఆ దేశం టారిఫ్ వర్గాలలో సగంపైగా ఇప్పటికే సుంకాల రహితం. అంటే భారతీయ సరకులకు ఇప్పటికే ఆ దేశం మార్కెట్ బాగా అందుబాటులో ఉన్నది.

## అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం

అమెరికా : అమెరికాలోని ఫ్లోరిడాలో సోమవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తెలంగాణ వాసులు మృతి చెందారు. భారత కాలమానం ప్రకారం.. ఈరోజు తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా కొందుర్గ్ మండలం టేకులపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, ఆయన భార్య మాజీ సర్పంచ్ పవిత్రాదేవికి ఇద్దరు కుమార్తెలున్నారు. రెండో కుమార్తె ప్రగతి రెడ్డికి సిద్దిపేటకు సమీపంలోని బక్రి చప్రియాల్‌కు చెందిన రోహిత్ రెడ్డితో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులున్నారు. రోహిత్ రెడ్డి తల్లి సునీత కూడా వారితోపాటే అమెరికాలో ఉన్నారు. ప్రగతిరెడ్డి, రోహిత్ రెడ్డి, వారి ఇద్దరు పిల్లలు, సునీత కారులో వెళుతుండగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ప్రగతిరెడ్డి, పెద్ద కుమారుడు అర్విన్, సునీత అక్కడికక్కడే మృతిచెందారు. రోహిత్ రెడ్డి, చిన్నకుమారుడు గాయాలతో బయటపడ్డారు. ఘటన జరిగిన సమయంలో రోహిత్ కారు నడిపారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. మృతులను తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా కొందుర్గ్ మండలం టేకులపల్లికి చెందిన ప్రగతిరెడ్డి (35), ఆమె కుమారుడు అర్విన్ (6), అత్త సునీత (56)గా గుర్తించారు. సమాచారం తెలిసిన వెంటనే ప్రగతిరెడ్డి తల్లిదండ్రులు మోహన్ రెడ్డి, పవిత్రాదేవి అమెరికాకు బయలుదేరారు. మృతులకు ఫ్లోరిడాలోనే దహన సంస్కారాలు చేస్తామని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ విషాద వార్తతో టేకులపల్లిలో విషాదఛాయలు అలముకున్నాయి. కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు.

## బలూచిస్తాన్‌లో ఉగ్ర దాడి..

పాకిస్తాన్‌లోని కల్లోలిత బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో బలూచ్ తీవ్రవాదులు ఆదివారం సాగించిన ఉగ్ర దాడిలో కనీసం ఐదుగురు భద్రతా సిబ్బంది మరణించగా, డజను మందికి పైగా గాయపడ్డారు. ఆ ప్రావిన్స్‌లోని నోష్కి జిల్లాలో ఎదురుకాల్పుల సంఘటనలో ఆత్మాహుతి బాంబర్ సహా నలుగురు ఉగ్రవాదులు హతమైనట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఒక ఆత్మాహుతి బాంబర్ పేలుడుపదార్థాలతో నిండిన వాహనంతో నుష్కి దల్బందిన్ జాతీయ రహదారిపై పారామిలిటరీ ఫ్రాంటియర్ కోర్ (ఎఫ్‌సి) వాహనశ్రేణిలోకి దూసుకుపోయినట్లు స్థానిక పోలీస్ స్టేషన్ చీఫ్ జాఫరుల్లా సుమలాని తెలిపారు. దాడి స్థలంలో సేకరించిన ఆధారాలను బట్టి ఆత్మాహుతి బాంబర్ పేలుడువస్తువులతో నిండిన వాహనంతో ఎఫ్‌సి కాన్వాయ్‌లోకి దూసుకుపోయినట్లు తేలిందని సుమలాని చెప్పారు. ఆ దాడి జరిగిన వెంటనే భద్రతా బలగాలు ఎదురుకాల్పులకు దిగి ఆత్మాహుతి బాంబర్ సహా నలుగురు ఉగ్రవాదులను హతమార్చినట్లు 'ఎక్స్‌ప్రెస్ ట్రైబ్యూన్' దినపత్రిక తెలియజేసింది. నిషిద్ధ బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్ఎ) తీవ్రవాదులు ఆ దాడికి పాల్పడినట్లు కూడా భద్రత దళ వర్గాలను ఉటంకిస్తూ పత్రిక తెలియజేసింది. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, దేశీయాంగ శాఖ మంత్రి మోహ్సిన్ నఖ్వి, బలూచిస్తాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగ్తి ఆ దాడిని ఖండించారు. ఆ ఘటనలో ప్రాణ నష్టం పట్ల వారు విచారం వెలిబుచ్చారు.

## ఆర్జీ కర్ కేసుపై సుప్రీంకోర్టులో విచారణ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ అండ్ ఆసుపత్రిలో మహిళా జూనియర్ డాక్టర్‌పై జరిగిన దారుణం దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసును సుప్రీంకోర్టు నేడు (సోమవారం) విచారించనుంది. బాధితురాలి తల్లిదండ్రులు దాఖలు చేసిన పిటిషన్ ను ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తి సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం మార్చి 17న ఈ కేసును సుమోటోగా విచారిస్తుంది. గత సంవత్సరం కోల్‌కతాలోని ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీ అండ్ ఆసుపత్రిలో ఒక ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య జరిగిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆర్‌జి కర్ ఆసుపత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌ను సిబిఐ అరెస్తు చేసింది. మెడికల్ కాలేజీలో ఆర్థిక అవకతవకలకు పాల్పడిన కేసులో సందీప్ ఘోష్‌ను ఇటీవల విచారించిన సిబిఐ తాజాగా ఆయన్ను అరెస్టు చేసింది. ఆర్‌జి కర్ మెడికల్ కళాశాలలో జరిగిన ఆర్థిక అవకతవకల ఆరోపణలపై నేరపూరిత కుట్ర, మోసం, అవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద సందీప్ ఘోష్‌పై కేసులు నమోదయ్యాయి. ఈ ఘటనతో దేశవ్యాప్తంగా ఉన్న ఆసుపత్రులు, వైద్య కళాశాలలు దారుణమైన అత్యాచారం, హత్య కేసుకు వ్యతిరేకంగా జరిగిన నిరసనలలో పాల్గొన్నాయి. సుప్రీంకోర్టులో అప్పీల్ తర్వాత తిరిగి విధుల్లోకి చేరిన వైద్యులు, వైద్య నిపుణులను శిక్షించవద్దని గత విచారణలో ప్రధాన న్యాయమూర్తి ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. కేసులో ఏకైక నిందితుడు సంజయ్ రాయ్ కు కోల్‌కతా ప్రత్యేక కోర్టు జనవరి 20న శిక్ష విధించింది. ఆర్జీ కర్ అత్యాచారం-హత్య కేసులో దోషిగా తేలిన సంజయ్ రాయ్ కు పశ్చిమ బెంగాల్ లోని సీల్దా కోర్టు జీవిత ఖైదు విధించింది. 50,000 జరిమానా కూడా కోర్టు విధించింది.

# చక్కని ఆరోగ్యం

## కొబ్బరి పువ్వుతో ఆరోగ్య ప్రయోజనాలు..?



కొబ్బరి పువ్వు అనేది సహజసిద్ధమైన పోషకాహారం. దీని గురించి చాలా మందికి తెలియదు.. ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఈ పువ్వు, రోగనిరోధక శక్తిని పెంచుతుంది. థైరాయిడ్, మలబద్ధకం, చర్మ సమస్యలు, వృద్ధాప్య సమస్యలతో బాధపడేవారికి ఇది సహాయపడుతుంది. దీనిలోని పోషకాలు శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. కొబ్బరి పువ్వు.. ఈ పువ్వు శరీర బరువును తగ్గించడంలో సహాయపడుతుంది. కొబ్బరి నీటితో పోల్చితే కొబ్బరి పువ్వులో ఎక్కువ పోషకాలు ఉన్నాయి. ఆలయంలో కొబ్బరికాయ పగలగొట్టినప్పుడు దానిలో పువ్వు ఉంటే భక్తులు సంతోషపడతారు. కొబ్బరికాయ పగలగొట్టినప్పుడు పువ్వు ఉంటే కోరిక నెరవేరుతుందని సంతోషిస్తారు.కొంతమంది కొబ్బరి పువ్వును రుచి చూస్తూ ఉంటారు. కొబ్బరి పువ్వు రోడ్డుపై అమ్ముతుంటే కొందరు దానిని చూస్తూ ఇది దేనికి అని అడుగుతారు. కొబ్బరి, కొబ్బరి నీరు విస్తృతంగా వాడతారు. కానీ కొబ్బరి పువ్వు గురించి చాలా మందికి తెలియదు. ఈ పువ్వు థైరాయిడ్ సమస్యలు, కాలం తిరుగుడు ఇన్ఫెక్షన్లకు రక్షణగా పనిచేస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

థైరాయిడ్ సమస్యలతో బాధపడేవారు కొబ్బరి పువ్వు తినడం వల్ల లాభపడతారట.కొబ్బరి పువ్వు క్యాన్సర్ కణాలను ప్రేరేపించే ఫ్రీ రాడికల్స్‌ను తొలగిస్తుంది. ఇది ఇన్సులిన్ స్రావాన్ని కూడా ప్రేరేపిస్తుంది. తద్వారా రక్తంలో చక్కెరను నియంత్రిస్తుంది. జీర్ణశక్తి తక్కువగా ఉన్నవారికి ఇది అద్భుతమైన ఔషధంగా పనిచేస్తుంది. దీనిలోని ఖనిజాలు, విటమిన్లు ప్రేగులను రక్షించి మలబద్ధకాన్ని తగ్గిస్తాయి. కొబ్బరి పువ్వు మంచి రోగనిరోధక శక్తిని కలిగిస్తుంది. అది కొబ్బరి నీటి కంటే ఎక్కువ పోషకాలు కలిగి ఉంటుంది. కొబ్బరి పువ్వు తినడం వల్ల రోగనిరోధక శక్తి రెట్టింపు అవుతుంది.కొబ్బరి పువ్వులో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి వృద్ధాప్యాన్ని నిరోధిస్తాయి. చర్మానికి ముడతలు రాకుండా యవ్వనంగా ఉంచుతుంది. మూత్రపిండాలకు కూడా రక్షణగా నిలుస్తుంది. దీనివల్ల మూత్రపిండాల ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. శారీరకంగా అలసినవారు ఈ పువ్వు తింటే శక్తి పెరుగుతుంది.కొబ్బరి పువ్వు గుండె ధమనులలో పేరుకుపోయిన కొవ్వును తగ్గిస్తుంది. ఇది గుండె సంబంధిత సమస్యలను నివారిస్తుంది. చర్మాన్ని ప్రకాశవంతంగా ఉంచడంలో కొబ్బరి పువ్వు ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఋతుస్రావం సమస్యలతో బాధపడే స్త్రీలకు కొబ్బరి పువ్వు తినడం వల్ల రక్తస్రావాన్ని సరిచేయడంలో సహాయపడుతుంది. శరీర వేడిని తగ్గించే సామర్థ్యం కూడా ఇందులో ఉంది.

## కళ్లకు మేలు చేసే బెస్ట్ డ్రై ఫ్రూట్స్



కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సరైన ఆహారం తీసుకోవడం ఎంతో ముఖ్యం. రోజువారీ జీవితంలో ఎక్కువ సమయం ఫోన్లు, కంప్యూటర్ల ముందు గడిపే కారణంగా కంటి సమస్యలు పెరుగుతున్నాయి. అయితే కొన్ని ప్రత్యేకమైన డ్రై ఫ్రూట్స్, కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరిచే పోషకాలతో నిండి ఉంటాయి. ఇవి కంటి చూపును మెరుగుపరచడంలో సహాయపడతాయి. కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, కంటి చూపును మెరుగుపరచడం చాలా ముఖ్యమైనవి. ప్రస్తుత రోజుల్లో కంప్యూటర్లు, ఫోన్లు వంటివి ఎక్కువగా ఉపయోగించడం వల్ల కంటి సమస్యలు అధికమవుతున్నాయి. కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మనం తీసుకునే ఆహారానికి కూడా ఎంతో ప్రాధాన్యం ఉంది. కొన్ని ఎండిన పండ్లు, డ్రై ఫ్రూట్స్ ఈ విషయంలో ప్రత్యేకంగా సహాయపడతాయి. ఇవి కంటి చూపును మెరుగుపరచడానికి ఉపయోగపడే ముఖ్యమైన పోషకాలతో నిండి ఉంటాయి. జీడిపప్పు కంటి ఆరోగ్యానికి మేలు చేసే అద్భుతమైన ఆహారాలలో ఒకటి. ఇందులో జింక్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. జింక్ కంటి రెటీనా కణాలను రక్షించి వాటి క్షీణతను నివారించడంలో సహాయపడుతుంది. కంటి తెలికపాటి కాంతి గాయాలను నివారించడంలో కూడా జీడిపప్పు కీలక పాత్ర పోషిస్తుంది. రాత్రి సమయంలో కంటి చూపును మెరుగుపరచడంలో కూడా జీడిపప్పు దోహదం చేస్తుంది. ఖర్జూరాలు కంటి ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరమైనవి. ఇందులో విటమిన్ ఎ, కెరోటినాయిడ్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి కంటి చూపును పదునుపరచడంలో, రాత్రి అంధత్వాన్ని నివారించడంలో సహాయపడతాయి. ప్రతిరోజు 2-3 ఖర్జూరాలు తినడం వల్ల కంటి ఆరోగ్యం మెరుగుపడే అవకాశం ఉంది. వాల్‌నట్స్‌లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి కంటి ఆరోగ్యానికి చాలా అవసరమైనవి. శరీరంలో మంటను తగ్గించడం ద్వారా వాల్‌నట్స్ కళ్ళను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. ఇవి కంటి రక్తప్రసరణను మెరుగుపరచడంలో కూడా సహాయపడతాయి. దీని వల్ల కళ్ళు శక్తివంతంగా ఉండటమే కాకుండా వయస్సుతో వచ్చే కంటి చూపు సమస్యలను కూడా తగ్గించవచ్చు. బాదం పప్పులో విటమిన్ ఇ అధికంగా ఉంటుంది. ఈ విటమిన్ కంటి కణాలను రక్షించడంలో సహాయపడుతుంది. బాదం తీసుకోవడం వల్ల వయస్సు కారణంగా వచ్చే ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. వయస్సు పెరుగుతున్నప్పుడు కంటి చూపు క్షీణించడం సహజం. అయితే బాదం వంటి పోషక ఆహారాలు ఈ సమస్యను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ద్రాక్షలో ఉన్న అధిక పాలీఫెనాల్స్, రెస్వెరాట్రాల్ కంటి కణాలను రక్షించడంలో సహాయపడతాయి. ఈ పోషకాలు కంటి ఆరోగ్యానికి ఎంతో అవసరం. ముఖ్యంగా ఫ్రీ రాడికల్ నష్టం నుండి కళ్ళను రక్షించడంలో ప్రతి రోజు కొన్ని ద్రాక్షలు తినడం కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. పిస్తాపప్పులో లుటీన్, జియాక్సంతిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి కంటి ఆరోగ్యానికి అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉన్నవి. పిస్తాపప్పు తినడం వల్ల కళ్ళకు ప్రాణాంతకమైన కాంతి తరంగాల ప్రభావం తగ్గించవచ్చు. రోజూ పిస్తాపప్పు తినడం కంటి ఆరోగ్యాన్ని రక్షించడంలో సహాయపడుతుంది. ప్రతిరోజు మన ఆహారంలో ఈ డ్రై ఫ్రూట్స్ చేర్చడం ద్వారా మన కంటి ఆరోగ్యం మెరుగుపడే అవకాశం ఉంది. రెగ్యులర్‌గా ఈ పండ్లు తినడం వల్ల కంటి ఆరోగ్యం బలపడుతుంది. కంటి చూపు కూడా మెరుగవుతుంది.

## కర్భూజను వీరు తినకూడదు..!



వేసవికాలం వచ్చినప్పుడల్లా శరీరానికి చల్లదనాన్ని అందించే పండ్లు తినడం అనివార్యం. అందులో ముఖ్యంగా కర్భూజ చాలా మందికి ఇష్టమైన పండు. ఇది తిన్న వెంటనే దాహాన్ని తీరుస్తుంది. ముఖ్యంగా ఇందులో నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల వేసవి వేడిని తట్టుకునే శక్తిని అందిస్తుంది. పైగా ఇందులో విటమిన్ ఇ, జింక్, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, ఫైబర్ వంటి అనేక పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన పౌష్టికతను అందించడంతో పాటు,

జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగుపరిచేలా సహాయపడతాయి. ఆరోగ్య సమస్యలు ఉన్న కొంతమంది వ్యక్తులు కర్భూజను తినకుండా దూరంగా ఉండటం మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో దీనిని అధికంగా తీసుకోవడం వల్ల రోగనిరోధక వ్యవస్థ మీద ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా డయాబెటిస్, కిడ్నీ సమస్యలు, చర్మ సంబంధిత అలర్జీలు, గ్యాస్ట్రిక్ సమస్యలతో బాధపడేవారు ఈ పండును మితంగా తీసుకోవడం లేదా వైద్యుల సలహా తీసుకుని మాత్రమే తినడం ఉత్తమం. డయాబెటిస్ ఉన్నవారు కర్భూజను ఎక్కువగా తినకూడదు. నిపుణుల మాట ప్రకారం ఈ పండులో గ్లైసెమిక్ ఇండెక్స్ 60-80 మధ్య ఉంటుంది. దీన్ని అధికంగా తీసుకున్నట్లయితే రక్తంలో షుగర్ లెవల్స్ పెరిగిపోవచ్చు. కాబట్టి డయాబెటిస్ ఉన్నవారు దీన్ని తినే ముందు వైద్యుని సలహా తీసుకోవడం ఉత్తమం. చర్మ సమస్యలు లేదా అలర్జీలతో బాధపడేవారు కర్భూజను తినకపోవడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. కొందరికి ఇది తిన్న వెంటనే దద్దుర్లు, దురద, వాపు, మచ్చలు వంటి సమస్యలు రావొచ్చు. అలాంటి వారు వైద్యుల సూచన మేరకు మాత్రమే దీనిని తీసుకోవడం ఉత్తమం. పేగుల సమస్యలు, గ్యాస్, ఉబ్బరం, ఇరిటబుల్ బవల్ సిండ్రోమ్ ఉన్నవారు కర్భూజను తినకపోవడమే మంచిది. ఇందులో అధికంగా ఫైబర్ ఉండటం వల్ల జీర్ణక్రియపై ప్రభావం చూపించే అవకాశం ఉంది. దీనిని ఎక్కువగా తీసుకుంటే పేగుల్లో గ్యాస్ పెరిగి అసౌకర్యానికి గురికావొచ్చు. కిడ్నీ సమస్యలతో బాధపడేవారు

కూడా కర్భూజను తినకూడదు. దీని పొటాషియం శాతం అధికంగా ఉండటం మూత్రపిండాల పనితీరును ప్రభావితం చేసే అవకాశం ఉంది. కిడ్నీలు సరిగ్గా పనిచేయకపోతే పొటాషియం శరీరంలో పేరుకుపోయి ఆరోగ్య సమస్యలు తీసుకురావచ్చు. కర్భూజలో 90 శాతం వరకు నీరు ఉంటుంది. దీనిని అధికంగా తీసుకున్నట్లయితే శరీరంలోని సోడియం స్థాయిలు తగ్గి హైపోనాట్రేమియా అనే సమస్య ఏర్పడే అవకాశం ఉంది. దీని వల్ల ఒంట్లో వాపు, నీరసం, మూత్రపిండాల సమస్యలు రావచ్చు.

## నిమ్మరసం తాగే ముందు జాగ్రత్త..!



మీ దంతాలను రక్షించుకోవడానికి, నిమ్మకాయ నీరు తాగేటప్పుడు స్ట్రా ఉపయోగించండి. ఇది ఆమ్ల ద్రవం దంతాలతో ప్రత్యక్ష సంబంధంలోకి రాకుండా నిరోధిస్తుంది. నిమ్మకాయలలో సిట్రిక్ యాసిడ్ ఉంటుంది. ఇది కడుపులో ఆమ్ల పరిమాణాన్ని పెంచుతుంది. కడుపు చికాకు, ఆమ్లత్వ సమస్యలు కూడా సంభవించే అవకాశం ఉంది. ఇది గుండెల్లో మంటకు కారణమవుతుంది. నిమ్మకాయ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. కడుపుకు సంబంధించిన అనేక సమస్యలను తొలగిస్తుంది. వేసవిలో జనాలు ఎక్కువగా నిమ్మకాయలను వాడుతుంటారు. వారు రోజుకు ఎక్కువసార్లు నిమ్మరసం తాగుతారు. నిమ్మకాయలలో అధిక మొత్తంలో విటమిన్ సి ఉంటుంది. శరీరంలో విటమిన్ సి ఎక్కువగా ఉండటం వల్ల అనేక శారీరక సమస్యలు వస్తాయి. నిమ్మకాయలు ఎక్కువగా తీసుకోవడం వల్ల దంతాల నుండి మొత్తం ఆరోగ్యం వరకు అనేక సమస్యలు వస్తాయి. పెద్దలకు రోజుకు ఒకటి లేదా రెండు గ్లాసుల నిమ్మరసం సరిపోతుంది. కానీ అధిక వినియోగం అనేక శారీరక సమస్యలను కలిగిస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నిమ్మకాయను అధికంగా తీసుకోవడం వల్ల దంతాలు దెబ్బతింటాయి. దీనివల్ల దంతాలు సున్నితంగా మారవచ్చు. కావిటీస్ సమస్య పెరగవచ్చు. మీ దంతాలను రక్షించుకోవడానికి, నిమ్మకాయ నీరు తాగేటప్పుడు స్ట్రా ఉపయోగించండి. ఇది ఆమ్ల ద్రవం దంతాలతో ప్రత్యక్ష సంబంధంలోకి రాకుండా నిరోధిస్తుంది. నిమ్మకాయలలో సిట్రిక్ యాసిడ్ ఉంటుంది. ఇది కడుపులో ఆమ్ల పరిమాణాన్ని పెంచుతుంది. కడుపు చికాకు, ఆమ్లత్వ సమస్యలు కూడా సంభవించే అవకాశం ఉంది. ఇది గుండెల్లో మంటకు కారణమవుతుంది. విటమిన్ సి ఎక్కువగా తీసుకోవడం కడుపుకు మంచిది కాదు. దీనివల్ల విరేచనాలు, కడుపు నొప్పి వంటి సమస్యలు వస్తాయి. నిమ్మకాయను అధికంగా తీసుకోవడం గొంతు ఆరోగ్యానికి మంచిది కాదు.

## ఒక్కసారి తింటే కొవ్వు వెన్నలా కరిగిపోవాల్సిందే..!



నోని గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. నోని జ్యూస్ తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. దీనివల్ల గుండెపోటు ప్రమాదం తగ్గుతుంది. గుండె రోగులకు చాలా మంచిది. బరువు తగ్గడానికి కూడా నోని ప్రయోజనకరంగా ఉంటుంది. నోని బొడ్డు, నడుము కొవ్వును కరిగించడంలో సహాయపడుతుంది. ఇది శరీరంలోని అదనపు కొవ్వును కరిగిస్తుంది. భారతదేశం మూలికలు, ఔషధ మొక్కలకు నిలయం. ఆయుర్వేదంలో అనేక ప్రాణాంతక వ్యాధులను నయం చేయడానికి మూలికా ఔషధాన్ని ఉపయోగిస్తారు. అలాంటిదే నోని అనే అద్భుతమైన ఔషధ నిధి నోని ఫ్రూట్. నోని అనేది భారతదేశంలో సాధారణంగా కనిపించే ఒక రకమైన పండు. దీనిని ఇంగ్లీష్‌లో ఇండియన్ మల్బరీ లేదా నోని అంటారు. నోని మొక్క శాస్త్రీయ నామం మోరిండా సిట్రిఫోలియా. నోని మొక్కలు చిన్న చెట్లు లేదా పెద్ద పొదల రూపంలో ఉంటాయి. దీని పండ్లు గుండ్రంగా, కొద్దిగా మృదువుగా ఉంటాయి.నోని ఫ్రూట్ పండినప్పుడు దాని రంగు లేత పసుపు నుండి బంగారు రంగులోకి మారుతుంది. నోని పండు, ఆకులు, వేర్లు, బెరడు మొదలైన వాటిని మందులు, ఆహార పదార్థాలలో ఉపయోగిస్తారు. నోనిలో సహజ చక్కెర-నియంత్రణ లక్షణాలు ఉన్నాయి. ఇవి రక్తంలో చక్కెరను స్థిరంగా ఉంచడంలో సహాయపడతాయి. నోని చక్కెర-నియంత్రణ లక్షణాలు ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచుతాయి. నోని పండు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. నోని పండ్ల రసం క్రమం తప్పకుండా తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. నోని పండ్ల రసం చర్మాన్ని ఆరోగ్యంగా మరియు ప్రకాశవంతంగా మార్చడానికి సహాయపడుతుంది. నోని జ్యూస్ తాగడం వల్ల ముడతలు తగ్గుతాయి. ఇది జుట్టుకు కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. నోనిలో సహజ శోథ నిరోధక లక్షణాలు ఉన్నాయి. ఇవి కీళ్లలో మంటను తగ్గించడంలో సహాయపడతాయి. ఇది ఆర్థరైటిస్ వంటి పరిస్థితులలో ప్రయోజనకరంగా ఉంటుంది.నోని గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. నోని జ్యూస్ తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. దీనివల్ల గుండెపోటు ప్రమాదం తగ్గుతుంది. గుండె రోగులకు చాలా మంచిది. బరువు తగ్గడానికి కూడా నోని ప్రయోజనకరంగా ఉంటుంది. నోని బొడ్డు, నడుము కొవ్వును కరిగించడంలో సహాయపడుతుంది. ఇది శరీరంలోని అదనపు కొవ్వును కరిగిస్తుంది.

## డయాబెటిస్‌కు బ్రహ్మాస్త్రం..



ప్రస్తుత కాలంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు చర్యలు తీసుకోవడం చాలామంచిది.. దీనికోసం జీవనశైలి, ఆహారంలో మార్పులు అవసరమని వైద్య నిపుణులు చెబుతున్నారు.. అలాంటి మంచి ఆహారంలో మెంతులు, మెంతి కూర ఒకటి.. దీనిలో ఎన్నో ఔషధ గుణాలు, పోషకాలు దాగున్నాయి. ప్రస్తుత కాలంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు చర్యలు తీసుకోవడం చాలామంచిది.. దీనికోసం జీవనశైలి, ఆహారంలో మార్పులు అవసరమని వైద్య నిపుణులు చెబుతున్నారు.. అలాంటి మంచి ఆహారంలో మెంతులు, మెంతి కూర ఒకటి.. వాస్తవానికి మెంతి గింజల ప్రయోజనాల గురించి మీరు చాలాసార్లు వినే ఉంటారు.. కానీ మెంతి ఆకులు తీసుకోవడం కూడా చాలా ప్రయోజనాలు చేకూరుతాయని.. శరీరానికి చాలామంచిదని పేర్కొంటున్నారు ఆయుర్వేద నిపుణులు. మెంతికూర ఎటువంటి హాని కలిగించని ఆరోగ్యకరమైన ఆహార పదార్థం.. రోజూ మెంతి ఆకులు తినడం వల్ల శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి.. ఇవి డయాబెటిస్ ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయి.. మెంతికూర జీర్ణక్రియకు సహాయపడుతుంది.. గ్యాస్, అజీర్ణం, కడుపునొప్పు వంటి సమస్యలను తగ్గిస్తుంది.. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది.. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.


మెంతికూరలో ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి.. మెంతులలో మధుమేహ నిరోధక లక్షణాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. సంవత్సరాలుగా, మెంతి గింజల ఔషధ లక్షణాలపై చాలా పరిశోధనలు జరిగాయి. మెంతులు యాంటీ డయాబెటిక్, యాంటీ క్యాన్సర్, యాంటీమైక్రోబయల్, యాంటీ ఫెర్టిలిటీ, యాంటీపరాసిటిక్, హైపోకొలెస్టెరోలెమిక్ లక్షణాలను కలిగి ఉన్నాయని తేలింది. మెంతులు ప్రోటీన్, ఫైబర్ గొప్ప మూలం.

. దాని బయోయాక్టివ్ సమ్మేళనాల కారణంగా ఔషధంగా ఉపయోగించవచ్చు. మెంతులు అనేక ఆరోగ్య సమస్యలకు ఔషధంగా పనిచేస్తాయని పరిశోధనలో తేలింది. మధుమేహ చికిత్సకు మెంతులు - మెంతికూర: మధుమేహంలో మెంతుల ప్రయోజనాలపై కూడా పరిశోధనలు జరిగాయి. మెంతులు తినడం వల్ల టైప్ 1, టైప్ 2 డయాబెటిస్‌తో సంబంధం ఉన్న జీవక్రియ లక్షణాలను తగ్గించడంలో ప్రభావవంతంగా ఉంటుందని కనుగొనబడింది. దీన్ని తీసుకోవడం వల్ల రోగుల రక్తంలో చక్కెర స్థాయిలు కూడా తగ్గుతాయి. రోగి గ్లూకోజ్ స్థాయిలు గణనీయంగా మెరుగుపడతాయి.

# సినిమా



## ఎద అందాలతో పిచ్చెక్కిస్తున్న ప్రగ్యాజైస్వాల్




## ‘పుష్ప 3’ వచ్చేది అప్పుడే..

### క్లారిటీ ఇచ్చిన మైత్రీ మూవీ మేకర్స్

అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో నటించిన బ్లాక్ బస్టర్ చిత్రం ‘పుష్ప 2 ది రూల్’ సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో రష్మిక కథానాయికగా నటించింది. గతేడాది డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించిన విషయం తెలిసిందే. దాదాపు రూ.1800 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి ప్రభాస్ బాహుబలి 2 పేరు మీద ఉన్న అత్యధిక వసుళ్ల రికార్డును అధిగమించింది. అయితే ఈ సినిమా చివరిలో పార్ట్ 3 ఉండబోతుందంటూ చిత్రబృందం హింట్ ఇచ్చి వదిలేసింది. పుష్ప 3 ది ర్యాంపేజ్ అంటూ 3వ భాగం రాబోతుండగా.. అసలు ఈ ప్రాజెక్ట్ ఉంటుందా అనే డౌట్ అటు అల్లు అర్జున్ ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్‌కు కూడా కలిగింది. అయితే 3వ భాగం ఉందని తాజాగా తెలిపాడు ఈ చిత్ర నిర్మాత మైత్రీ మూవీ మేకర్స్ అధినేత రవిశంకర్. ఆయన నిర్మాణంలో వస్తున్న తాజా చిత్రం రాబిన్‌హుడ్. ఈ సినిమాకు వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తుండగా.. నితిన్ కథానాయకుడిగా నటిస్తున్నాడు. ఈ చిత్రం మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్రయూనిట్ విజయవాడలోని దుర్గమ్మను దర్శించుకుంది. అనంతరం చిత్రనిర్మాత ప్రెస్‌మీట్‌తో మాట్లాడుతూ.. రిపోర్టర్స్ పుష్ప 3 ప్రస్తావన తీసుకురాగా.. పుష్ప 3పై రవిశంకర్ స్పందిస్తూ.. పుష్ప 3 ర్యాంపేజ్ ఉందని.. వచ్చే ఏడాది షూటింగ్ ప్రారంభించి.. 2028లో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు రవిశంకర్ వెల్లడించాడు.

## భారీ ధరకు అమ్ముడుపోయిన నాని ‘హిట్ 3’ ఓటీటీ రైట్స్

అగ్ర కథానాయకుడు నాని సినిమా సినిమాకి తన మార్కెట్‌ను పెంచుకుంటూ పోతున్నాడు. హాయ్ నాన్న, సరిపోదా శనివారం సినిమాలతో హిట్లు అందుకున్న నాని రీసెంట్‌గా కోర్ట్ సినిమాతో మరో హిట్‌ని ఖాతాలో వేసుకున్నాడు. అయితే ఆయన ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం హిట్ 3. బ్లాక్ బస్టర్ ఫ్రాంచైజీ హిట్ నుంచి వస్తున్న 3వ చిత్రమిది. ఈ చిత్రంలో నాని కథానాయకుడిగా నటించడంతో పాటు నిర్మాణ బాధ్యతలు చేపట్టాడు. శైలేశ్ కొలను దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. మే 01న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ సినిమా ఓటీటీ రైట్స్‌కి సంబంధించి ప్రస్తుతం ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమా ఓటీటీ హక్కులను నెట్‌ఫ్లిక్స్ ఏకంగా రూ.54 కోట్లకు దక్కించుకున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వార్తలు వైరల్‌గా మారాయి. సినిమా సినిమాకు నాని డిమాండ్ పెరుగుతుండడంతో ఆయన అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రీసెంట్‌గా కోర్ట్ హిట్టవ్వడం, ఇప్పుడు ఓటీటీ డీల్ చూస్తుంటే నాని పట్టిందల్లా బంగారమవుతుందని టాక్ వినిపిస్తుంది. ఇక హిట్ 3 విషయానికి వస్తే.. క్రైమ్ థ్రిల్లర్ బ్యాక్‌డ్రాప్‌తో రానున్న ఈ సినిమాలో నాని అర్జున్ సర్కార్ అనే పవర్‌ఫుల్ ఐపీఎస్ అధికారిగా కనిపించనున్నారు.






## ద్యార్థులతో కలిసి డ్యాన్స్ ఇరగదీసిన నితిన్, శ్రీలీల

ఎక్స్‌ట్రార్డినరీ మ్యాన్ మూవీ తర్వాత రాబిన్ హుడ్ సినిమాలో మరోసారి జత కట్టారు టాలీవుడ్ హీరో, హీరోయిన్లు నితిన్– శ్రీలీల. భీష్మ సినిమాతో ఫేమస్ అయిన వెంకీ కుడుముల ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఈ సినిమాలో ఓ కీలక పాత్రలో నటిస్తుండడం విశేషం. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ ఎర్నేని, రవి శంకర్ భారీ బడ్జెట్ తో అత్యంత ప్రతిష్ఠాత్మంకంగా ఈ సినిమాను నిర్మించారు. ఇప్పటికే అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ సినిమా మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రమోషన్లలో భాగంగా ఇప్పటికే రిలీజైన పోస్టర్స్, సాంగ్స్, టీజర్స్ ఆడియెన్స్ ను బాగా ఆకట్టుకున్నాయి. కాగా సినిమా విడుదల తేదీ దగ్గర పడటంతో రాబిన్ హుడ్ మూవీ టీమ్ ప్రమోషన్లలో స్పీడ్ పెంచింది. ఇందులో భాగంగా తాజాగా రాజమండ్రిలోని ఐఎస్‌టీఎస్ కాలేజీకి వెళ్లారు హీరో, హీరోయిన్లు నితిన్, శ్రీలీల. ఈ సందర్భంగా తమ సినిమా గురించి అక్కడి విద్యార్థులతో సరదాగా ముచ్చటించారు. అనంతరం స్టూడెంట్స్‌తో నితిన్, శ్రీలీల కలిసి ‘వేరెవర్ యు గో’ అనే సాంగ్‌కు అదిరిపోయే స్టెప్పులు వేశారు. నితిన్, శ్రీలీల డ్యాన్స్ కు సంబంధించిన వీడియోను మైత్రీ మూవీ మేకర్స్ సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. దీంతో ఈ వీడియో కాస్త నెట్టింట వైరల్‌గా మారింది. దీనిని చూసిన సినీ అభిమానులు, నెటిజన్లు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. ‘జోడీ అదుర్స్.. వావ్ సూపర్.. చాలా బాగా డ్యాన్స్ చేశారు’ అంటూ కాంప్లిమెంట్స్ ఇస్తున్నారు. రాబిన్ హుడ్ సినిమాలో వెన్నెల కిశోర్, రాజేంద్ర ప్రసాద్, దేవదత్తా నాగ, షైన్ టామ్ చాకో, ఆడుకలం నరేన్, మైమ్ గోపి తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇక కేతిక శర్మ ఓ స్పెషల్ సాంగ్ లో సందడి చేయనుంది.

# శాంతి వైపే భారత్ అడుగులు



ప్రధాని మోదీ, ఏఐ పరిశోధకుడు లెక్స్ ఫ్రిడ్‌మెన్ మధ్య ఆసక్తికరమైన పాడ్‌కాస్ట్ ఒకటి సాగింది. కొద్దిసేపటి క్రితమే విడుదలైన ఈ పాడ్‌కాస్ట్‌లో మోదీ తన జీవితంలోని పలు ఆసక్తికర విషయాలను, చిన్ననాటి అంశాలను పంచుకున్నారు. అలాగే భారత్ శాంతి అన్వేషణ, పాకిస్తాన్‌తో సంబంధాలతో సహా అనేక అంశాల గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ.. భారతదేశం శాంతి గురించి మాట్లాడినప్పుడల్లా ప్రపంచం దాని మాట వింటుందని. ఎందుకంటే ఇది గౌతమ బుద్ధుడు, మహాత్మా గాంధీ పుట్టిన భూమి. ప్రకృతితో లేదా ప్రపంచ దేశాలతో భారతదేశం ఎప్పుడూ ఎలాంటి వైరాన్ని కోరుకోదని ప్రధాని మోదీ అన్నారు.

'మనం శాంతి గురించి మాట్లాడినప్పుడల్లా ప్రపంచం భారత్ మాట వింటుంది. ఎందుకంటే ఇది గౌతమ్ బుద్ధా, మహాత్మా గాంధీ పుట్టిన భూమి. మనది సామరస్యాన్ని సమర్థించే దేశం. ప్రకృతితో లేదా దేశాల మధ్య కలహాలు కోరుకోం. మనం శాంతిని నెలకొల్పేవారిగా వ్యవహరించగలిగిన చోట, ఆ బాధ్యతను సంతోషంగా స్వీకరించాం' అని ప్రధానమంత్రి అన్నారు. తన బలం మోదీ కాదు, దేశంలోని 1.4 బిలియన్ ప్రజలు. తాను ప్రపంచ నాయకులతో కరచాలనం చేసినప్పుడల్లా, కరచాలనం చేసేది మోదీ కాదు, భారతదేశ ప్రజలే. తను ఎక్కడికి వెళ్ళినా, వేల సంవత్సరాల అనాదిగా సంస్కృతి, వారసత్వాన్ని తనతో తీసుకువెళతానని ప్రధాని మోదీ అన్నారు. వేల సంవత్సరాల వేద సంప్రదాయం, స్వామి వివేకానంద బోధనలను తనతో ప్రతీ చోటకు తీసుకెళ్తానని ప్రధాని మోదీ అన్నారు.

**బాల్యంలో పేదరికం.. కానీ ఎప్పుడూ అది బరువుగా అనిపించలేదు: ప్రధాని మోదీ**

అమెరికన్ పాడ్‌కాస్టర్ లెక్స్ ఫ్రిడ్‌మాన్ ప్రధాని మోదీతో 3 గంటల పాటు ఐకానిక్ ఇంటర్వ్యూ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇందులో మోదీ పలు ఆసక్తికర అంశాలు పంచుకున్నారు. ముఖ్యంగా తన జీవితంలోని బాల్య అనుభవాలు, పేదరికం, ప్రజా జీవితంలో తన ప్రయాణం, రాజకీయ జీవితం గురించి మోదీ మాట్లాడారు. తాను ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా ఉన్న రోజుల గురించి, హిందూ మతం గొప్పతనం గురించి కూడా వివరించారు.

**'బాల్యంలో పేదరికం అనుభవించా కానీ..' ప్రధాని మోదీ**

ఈ పోడ్‌కాస్ట్‌లో ప్రధాని మోదీ తన బాల్య జీవితంలోని పలు సంఘటనలను గుర్తు చేసుకుంటూ.. చిన్నతనంలో పేదరికంలో పెరిగినప్పటికీ, తాను దాని బరువును ఎప్పుడూ అనుభవించలేదని అన్నారు. కష్టాల మధ్య కూడా, తాను ఎప్పుడూ లేమిని అనుభవించలేదని ఆయన గుర్తు చేసుకున్నారు. నాటి విషయాలను ఆయన గుర్తుచేసుకుంటూ.. చిన్న తనంలో తన మామ తనకు తెల్లటి కాన్వాస్ బూట్లు ఎలా బహుమతిగా ఇచ్చాడో, వాటిని స్కూల్లో అరిగిపోయిన చాక్‌పీస్‌తో ఎలా పాలిష్ చేశాడో వంటి విషయాలను పంచుకున్నారు. జీవితంలోని ప్రతి దశను కృతజ్ఞతతో స్వీకరించానని అన్నారు. అలాగే పేదరికాన్ని ఎప్పుడూ పోరాటంగా, బరువుగా చూడలేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

**మోదీతో ఇంటర్వ్యూ కోసం 45 గంటలు ఉపవాసం ఉన్నాను: లెక్స్ ఫ్రిడ్‌మాన్**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఇంటర్వ్యూ చేయబోతున్నందుకు గౌరవసూచకంగా తాను ఏకంగా 45 గంటలపాటు ఉపవాసం ఉన్నట్లు లెక్స్ ఫ్రిడ్‌మాన్ వెల్లడించాడు. ఆయన కేవలం నీళ్లు మాత్రమే తాగినట్లు తెలిపాడు. తన ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ ఉపవాసంపై తన దృక్పథాన్ని కూడా పంచుకున్నారు. ఇంద్రియాలను పదును పెట్టడంలో, మానసిక స్పష్టతను పెంచడంలో, క్రమశిక్షణను పెంపొందించడంలో ఉపవాసం పాత్రను నొక్కి చెప్పారు. ఉపవాసం అనేది కేవలం భోజనం మానేయడం మాత్రమేకాదని, ఇదొక శాస్త్రీయ ప్రక్రియ అని మోదీ అన్నారు. ఉపవాసం సాంప్రదాయ, ఆయుర్వేద పద్ధతులతో లోతుగా అనుసంధానించబడిందని ఆయన వివరించారు. శరీర నిర్విషీకరణకు సహాయపడటానికి ఉపవాసం ముందు తాను బాగా హైడ్రేట్ అవుతానని ప్రధాని మోదీ తెలిపారు. ఉపవాసం తనను మరింత శక్తివంతం చేస్తుందని, బద్ధకం వీడి మరింత కష్టపడి పనిచేయడానికి ఉపయోగపడుతుందని మోదీ

కాగా జనవరి 19న ఫ్రిడ్‌మాన్ ప్రధాని మోదీతో కలిసి పాడ్‌కాస్ట్ నిర్వహించగా.. మార్చి 16న దానిని విడుదల చేశారు. మోదీని అత్యంత ఆకర్షణీయమైన వ్యక్తి అని ఫ్రిడ్‌మాన్ అభివర్ణించాడు. లెక్స్ ఫ్రిడ్‌మాన్ పాడ్‌కాస్ట్.. డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాలు, ఏఐ ద్వారా దేశ పురోగతి వంటి విషయాలను కూడా కవర్ చేసింది. కాగా లెక్స్ ఫ్రిడ్‌మాన్ మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (%వీ×ు%)లో పరిశోధనా శాస్త్రవేత్త. ఆయన యూట్యూబ్ ఛానెల్‌కి 4.8 మిలియన్ల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. 82 కోట్లకుపైగా వీక్షణలు ఉన్నాయి. 'ది లెక్స్ ఫ్రిడ్‌మాన్ పాడ్‌కాస్ట్' పేరిట అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, టెస్లా సీఈఓ ఎలోన్ మస్క్, అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్, ఫేస్‌బుక్ సహ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్, ఉక్రేనియన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ వంటి ప్రముఖ వ్యక్తులను ఇప్పటి వరకు ఫ్రిడ్‌మాన్ ఇంటర్వ్యూ చేశారు

**లెక్స్ ఫ్రిడ్‌మన్‌తో ప్రధాని మోదీ పాడ్‌కాస్ట్.. తన జీవితంలో ఆర్ఎస్ఎస్ పాత్రపై..**

కంప్యూటర్ సైంటిస్ట్ లెక్స్ ఫ్రిడ్‌మన్‌తో ప్రధాని మోదీ ప్రత్యేకంగా సంభాషించారు. ఇద్దరి మధ్య మూడు గంటల పాటు పాడ్‌కాస్ట్ సాగింది. ఫ్రిడ్‌మన్‌తో జరిగిన ఈ పాడ్‌కాస్ట్‌లో తన చిన్ననాటి జ్ఞాపకాలు, హిమాలయాల్లో గడిపిన కాలం, ప్రజా జీవితంలో తన ప్రస్థానం గురించి వివరించారు ప్రధాని మోదీ. అలాగే ఈ పాడ్‌కాస్ట్‌లోని ప్రధాని మోదీ తన జీవితంపై స్వామి వివేకానంద ప్రభావం ఎంతవరకు ఉందో చెప్పుకొచ్చారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'నా బాల్యంలో తరచుగా గ్రామంలోని గ్రంథాలయానికి వెళ్లేవాడిని, అక్కడ స్వామి వివేకానంద గురించి పుస్తకాలు ఎన్నో చదివాను. ఆయన బోధనలు, స్పీచ్‌లు నా జీవితంపై తీవ్ర ప్రభావాన్ని చూపించాయి' అని ప్రధాని మోదీ అన్నారు. స్వామి వివేకానంద దృష్టిలో నిజమైన సంతృప్తి అంటే వ్యక్తిగత విజయాల నుంచి రాదు.. ఇతరులకు నిస్వార్థ సేవ చేయడం ద్వారానే లభిస్తుందని తెలుసుకున్నట్టు ఆయన చెప్పారు. అంతేకాకుండా స్వామి వివేకానంద జీవితంలో జరిగిన ఓ కథ గురించి వివరించారు ప్రధానమంత్రి మోదీ. తన తల్లి అనారోగ్యంతో ఉందని రామకృష్ణ పరమహంసకు చెబుతారు స్వామి వివేకానంద. అంతేకాకుండా తనకు సాయం చేయమని కోరుతారు. దీనికి రామకృష్ణ పరమహంస బదులిస్తూ.. దేవి కాళి వద్దకు వెళ్లి సహాయం అడగమని సలహా ఇచ్చారు. ప్రపంచానికి అన్నీ ఇచ్చిన దైవాన్ని.. తాను ఎలా సాయం అడగాలని అనుకుంటారు వివేకానంద. తద్వారా మానవాళికి సేవ చేయడం దైవభక్తికి అత్యున్నత రూపం అని గ్రహించారు వివేకానంద.

**తన జీవితంలో ఆర్ఎస్ఎస్ పాత్ర..**

ఆర్ఎస్ఎస్.. తన జీవితంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. వారితో తనకున్న భాగస్వామ్యం అద్భుతమైనదిగా అభివర్ణించారు. ఆ సంస్థతో తనకున్న లోతైన సంబంధాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిబింబించారు. ఆర్ఎస్ఎస్ నుంచి తన జీవిత పరమార్థం, నిస్వార్థ సేవా విలువలను పొందడం తన అదృష్టమని ప్రధాని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్ఎస్ఎస్ ఇంతలా అభివృద్ధి చెందటాన్ని ఆయన ప్రశంసించారు. దేశవ్యాప్తంగా ఆర్ఎస్ఎస్ పెద్ద ఎత్తున విద్య, ఆరోగ్య సంరక్షణ సేవలను ఎలా అందిస్తోందో ప్రధానమంత్రి హైలైట్ చేశారు. వామపక్ష కార్మిక సంఘాలు, ఆర్ఎస్ఎస్ అనుబంధ కార్మిక సంఘాల మధ్య వ్యత్యాసాన్ని ఆయన ఎత్తి చూపారు.

# హైపర్‌లూప్ 'పాడ్'.. అరగంటలో 350 కిలోమీటర్ల ప్రయాణం

**చెన్నై:** భూమి మీద విమాన వేగంతో ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చే హైపర్‌లూప్ ప్రాజెక్టుపై కీలక ప్రకటన చేశారు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్. ఆసియాలో అతి పొడవైన హైపర్‌లూప్ ట్యూబ్ (410 మీ) త్వరలో అందుబాటులోకి రానుందన్నారు. ఇదే సమయంలో 'పాడ్'(రైలు బోగీ) నమూనాకు సంబంధించిన ఓ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తాజాగా ఐఐటీ మద్రాస్‌లోని హైపర్‌లూప్ ట్రాప్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్ సహాయంతో అభివృద్ధి చేస్తున్న హైపర్‌లూప్ ట్యూబ్ పరిశీలించారు. అనంతరం, ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'భారత్‌లో త్వరలోనే ప్రపంచంలోనే అతి పొడవైన హైపర్‌లూప్ ట్యూబ్ అవుతుంది. దీని పొడవు 410 మీటర్లు ఉంటుంది. రానున్న కాలంలో మరో 40 మీటర్లు పొడగిస్తాం. ఆసియాలోనే అతి పొడవైన హైపర్‌లూప్ ఇది. హైపర్‌లూప్ రవాణా కోసం స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించి అభివృద్ధి చేశాం.



ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉన్న హైపర్‌లూప్ రవాణా సాంకేతికత ఇప్పటివరకు నిర్వహించిన పరీక్షల్లో మంచి ఫలితాలను ఇచ్చింది. త్వరలోనే అందుబాటులోకి వస్తుందనుకుంటున్నాం' అని అన్నారు. మరోవైపు.. మంత్రి అశ్విని వైష్ణవ్ ట్విట్టర్ వేదికగా.. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వీడియోను విడుదల చేశారు. హైపర్‌లూప్ టెస్ట్ ట్రాక్‌ను రైల్వే మంత్రిత్వశాఖ తోడ్పాటుతో మద్రాస్ ఐఐటీ అభివృద్ధి చేసింది. ఈ తరహా రవాణా వ్యవస్థ సాకారమైతే 350 కిలోమీటర్ల దూరంలోని గమ్యస్థానాన్ని అరగంటలోపే చేరుకోవచ్చు. హైపర్‌లూప్‌ను ఐదో రవాణా విధానంగా అభివర్ణిస్తారు. హైపర్‌లూప్ టెక్నాలజీలో హైపర్‌లూప్ అనేది ఓ ప్రత్యేక నిర్మాణం. బాహ్యంగా అంటే రైలు మార్గంపై గానీ.. రైలుకు వెలుపల గానీ ఎటువంటి గాలి అసలుండదు. ఈ హైపర్ లూప్ వాక్యూం రూపంలో ఉన్న గొట్టాలలో ప్రయాణిస్తుంది. దీని కారణంగా దాని మీద ఏరోడైనమిక్ ప్రభావం ఉండదు. అంటే ఏ విధమైన బాహ్యాపరమైన ఒత్తిడి రైలుపై గానీ.. దాని వేగంపై గానీ ప్రభావం చూపే అవకాశం లేదు. ఈ కారణంగానే హైపర్ లూప్ టెక్నాలజీలో రైలు అత్యంత వేగంగా ప్రయాణిస్తుందనేది ఓ సిద్ధాంతం. వీటిలో రైలు బోగీలను పోలిన పాడ్‌లు ప్రయాణిస్తాయి. సాధారణంగా భూమిపై ప్రయాణించే వాహనాలకు గాలి అనేది పెద్దగా ఆటంకం. దానివల్ల అవి ఒక పరిమితికి మించిన వేగంతో రోడ్డుపై వెళ్లడం సాధ్యంకాదు. కానీ గాలి పీడనం బాగా తక్కువగా ఉండే హైపర్ ల్యూబ్ ట్యూబ్‌లోకి బోగీని ప్రవేశపెడితే, దాని వేగంగా వెళ్లొచ్చు. గంటకు వెయ్యి కిలోమీటర్ల వేగాన్ని ఇవి అందుకునే వీలుందని చెబుతున్నారు.

## లీలావతి ఎవరు?

## ఆమె పేరుతో ఉన్న ఆస్పత్రి ఎందుకు చిక్కుల్లో పడింది?

**ముంబై:** మహానగరం ముంబైలోని సుప్రసిద్ధ లీలావతి హాస్పిటల్ గురించి ఎప్పుడో ఒకప్పుడు వినేవుంటారు. ముంబైలోని ప్రముఖులెవరైనా అనారోగ్యానికి గురైనప్పుడు లీలావతి ఆస్పత్రిలో చేరారనే వార్తలను మనం అప్పుడప్పుడూ వినేవుంటాం. ఇటీవల బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ కత్తిపోట్లకు గురైనప్పుడు, ఆయనను చికిత్స కోసం లీలావతి ఆస్పత్రిలోనే చేర్చారు. ఇప్పుడు ఈ ఆస్పత్రి మరోసారి వార్తల్లో నిలిచింది. దీనిని నడుపుతున్న ఛారిటబుల్ ట్రస్ట్ అవినీతికి పాల్పడిందనే వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ ఛారిటబుల్ ట్రస్ట్ ఇటీవల.. ఇదే ట్రస్ట్‌కు చెందిన మాజీలు, సంబంధిత వ్యక్తులు రూ. 1,500 కోట్లకు పైగా నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించింది. ఈ ఉదంతంలో లీలావతి కీర్తిలాల్ మెహతా మెడికల్ ట్రస్ట్ (ఎల్‌కేఎంఎంటీ)తో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)లు వేర్వేరుగా బాంద్రా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాయి. ప్రముఖ వజ్రాల వ్యాపారవేత్త కీర్తిలాల్ మెహతా తన భార్య లీలావతి మెహతా పేరు మీద ఈ ఆసుపత్రిని నిర్మించారు. ఇందుకోసం ఆయన లీలావతి కీర్తిలాల్ మెహతా మెడికల్ ట్రస్ట్‌ను నెలకొల్పారు. లీలావతి ఆస్పత్రికి 1997లో పునాది వేశారు.




ముంబైలో మెరుగైన ఆరోగ్య సేవలను అందించడమే లక్ష్యంగా ఈ ఆస్పత్రి ఏర్పాటయ్యింది. దీనిలో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్రాలు, శిక్షణ పొందిన సిబ్బంది ఉన్నారు. కీర్తిలాల్ మెహతా 2002లో అనారోగ్యానికి గురయ్యారు. దీంతో ఆయన సోదరుడు విజయ్ మెహతా ట్రస్ట్ పగ్గాలు చేపట్టారు. 2006లో విజయ్ మెహతా తన కొడుకు, మేనల్లుళ్లను అక్రమంగా ట్రస్టీలుగా చేసి, కిషోర్ మెహతాను శాశ్వత ట్రస్టీ పదవి నుంచి తొలగించారనే ఆరోపణలు వినిపించాయి. అయితే 2016లో కిషోర్ మెహతా తిరిగి ట్రస్టీ అయ్యారు. ఆయన ఈ బాధ్యతలను ఎనిమిది సంవత్సరాలు పాటు నిర్వహించారు. 2024లో కిషోర్ మెహతా మరణానంతరం అతని కుమారుడు ప్రశాంత్ మెహతా శాశ్వత ట్రస్టీగా మారి, ఆసుపత్రి ఆర్థిక రికార్డులను ఆడిట్ చేయించారు. ఈ నేపథ్యంలో పలు అక్రమాలు వెలుగు చూశాయి. ఇప్పుడు దీనిపై దర్యాప్తు జరుగుతోంది.

## పుట్టిన ఏడాదికే తల్లి వెంటే జైలుకు పసిబిడ్డ.. పాపం ఈ చిన్నారికి ఎంత కష్టమొచ్చిందో



**బెంగళూరు :** ప్రసవించిన 14రోజులకే అనివార్య కారణాలతో రూ.60వేలకు విక్రయమైన ఏడాది వయస్సున్న పసిబిడ్డ ప్రస్తుతం తల్లితో పాటు జైలు చేరిన విషాదం ఘటన కర్ణాటకలో చోటు చేసుకుంది. బళ్లారి గౌతం నగర్ నివాసి యల్లమ్మ గతేడాది ఫిబ్రవరిలో బీఎంసీఆర్‌సీలో పసిబిడ్డకు జన్మనించింది. ఈమె భర్త చనిపోయాడు. తనకు ఆ బిడ్డ వద్దని రూపనగుడి రోడ్డు నివాసి నవీన్ కుమార్‌కు రూ.60వేలకు విక్రయించింది. ఈ విషయాన్ని తెలుసుకున్న బాలలరక్షణ శాఖ సహాయ వాణికి గత ఆగస్ట్ 5న సమాచారం రావడంతో వారు బళ్లారి గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు జరిపి పసిబిడ్డను ఆంధ్రప్రదేశ్‌లోని ఆలూరు నుంచి తీసుకొచ్చారు. బిడ్డను కొనుగోలు చేసిన నవీన్ కుమార్, విక్రయించిన బిడ్డ తల్లి యల్లమ్మను అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆ బిడ్డను బళ్లారి జైల్లో ఉన్న సొంత తల్లి వద్దకే చేర్చారు. ఈ కేసులో విక్రయించిన,కొనుగోలు చేసిన వారికి 10ఏళ్ల శిక్ష ఉంటుంది. కోర్టులో నేరం రుజువైతే తల్లితో పాటు బిడ్డ కూడా శిక్ష అనుభవించాలా? లేక బాలల రక్షణ శాఖలోని అమ్మఒడి ఆశ్రమంలో ఉంటుందా? అనే సందేహం తలెత్తుతోంది. కాగా, తల్లి వద్దు అనుకున్న బిడ్డను సంతానం లేని దంపతులు గత ఏడాది నుంచి పెంచి పోషించి తల్లి ప్రేమకు నోచుకునేలా చేసిన ఆ తల్లిదండ్రులకే దత్తత ఇస్తే బాగుంటుందని సమాజ శ్రేయోభిలాషులు అభిప్రాయపడ్డారు.

## మిజోరం వండర్ కిడ్‌కి అమిత్ షా స్పెషల్ గిఫ్ట్



**మిజోరాం:** ఈశాన్య రాష్ట్రాల్లో పర్యటిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా.. ఓ చిన్నారికి గిటార్‌ను బహుమతిగా ఇచ్చారు. శనివారం మిజోరాంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ సమయంలో ఏడేళ్ల చిన్నారి ఎస్తేర్ లాల్దుహమ్మి హనామ్టే వందేమాతరాన్ని పాడింది. ఆ చిన్నారిని అభినందిస్తూ గిటార్‌ను బహుమతిగా ఇచ్చారు. ఆ చిన్నారిని "వండర్ కిడ్"గా అభివర్ణించిన అమిత్ షా.. భారత్‌పై ప్రేమ మనల్ని ఏకం చేసిందన్నారు. "చిన్నారి ఎస్తేర్ వందేమాతరాన్ని పాడి నా హృదయాన్ని కదిలించింది.. ఏడేళ్ల చిన్నారికి దేశంపై ఉన్న ప్రేమ తన పాటలో కనిపించింది' అంటూ ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా ఆ చిన్నారి పాట వీడియోను కూడా ఆయన పంచుకున్నారు. కాగా, 2020లో 'మా తుజే సలామ్' పాట వీడియోతో అందరి దృష్టిని ఆకర్షించిన ఎస్తేర్.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆమె అనేక అవార్డులను కూడా అందుకుంది.

## లక్కీ భాస్కర్ స్ఫూర్తితో భారీ మోసం.. కానీ చివరకు..



సత్యదేవ్ హీరోగా నటించిన జీబ్రా సినిమాలో హీరో, హీరోయిన్, హీరో ఫ్రెండ్ ముగ్గురు కలిసి కస్టమర్ల బ్యాంకు ఖాతాల్లోంచి తెలివిగా డబ్బు కొట్టేస్తారు. దొరికిపోయే అవకాశం ఉండటంతో ఆ డబ్బుని మళ్లీ కస్టమర్ల ఖాతాల్లోకి పంపించేస్తారు. నేరం బయటపడకుండా తప్పించుకుంటారు. లక్కీ బాస్కర్ సినిమాలో హీరో బ్యాంకులోంచి డబ్బులు కొట్టేసి, అక్రమ వ్యాపారాలు చేస్తుంటాడు. సమయానికి డబ్బుల్ని మళ్లీ బ్యాంకులో జమ చేస్తుంటాడు. సినిమా చివరి వరకు పోలీసులకు దొరకడు. అయితే, నిజ జీవితంలో మాత్రం ఓ బ్యాంకు ఉద్యోగి నేరం చేసి, పోలీసులకు పట్టుబడిపోయింది. ఓ ప్రముఖ బ్యాంకులో డిప్యూటీ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆమె ఓ వృద్ధ జంటను మోసం చేసింది. వారి దగ్గరినుంచి పక్కా ప్లాన్ ప్రకారం లక్షల రూపాయల డబ్బులు కొట్టేసింది. తర్వాత పాపం పండి దొరికిపోయింది. ఉద్యోగం పోవటమే కాదు.. జైలు పాలయ్యే పరిస్థితి వచ్చింది.

**పక్కా ప్లాన్‌తో మోసం..**

మేఘన అనే మహిళ బెంగళూరులోని ఓ ప్రముఖ బ్యాంకులో డిప్యూటీ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. గిరినగర్‌లో ఆ బ్యాంకు ఉంది. అదే ప్రాంతానికి చెందిన వృద్ధ జంటకు ఆ బ్యాంకులో జాయింట్ అకౌంట్‌తో పాటు, ఎఫ్‌డీ కూడా ఉంది. బ్యాంకు ఖాతా లావాదేవీలకు సంబంధించి మేఘన వృద్ధురాలికి సాయం చేస్తూ ఉండేది. ఆ వృద్ధురాలు తన కుటుంబానికి సంబంధించిన ప్రతీ విషయాన్ని మేఘనకు చెబుతూ ఉండేది. చామరాజపేట్‌లోని తమ ఇళ్లు అమ్మబోతున్నట్లు, పెద్ద మొత్తంలో డబ్బు రాబోతున్నట్లు ఆ వృద్ధురాలు చెప్పింది. కొద్దిరోజుల తర్వాత వృద్ధురాలి బ్యాంకు అకౌంట్‌లో కోటి రూపాయలు డిపాజిట్ అయింది. ఆ డబ్బుపై మేఘన కన్నుపడింది. భర్త, స్నేహితులతో కలిసి ఆ డబ్బులో కొంత భాగం కొట్టేయాలని ప్లాన్ చేసింది. ఆ వృద్ధురాలు బ్యాంకుకు వెళ్లినపుడు.. బాండ్స్ ఎక్స్‌పేర్ అయిపోయాయని మేఘన చెప్పింది. కొత్త బాండ్లు కొనడానికి కొన్ని డాక్యుమెంట్లు కావాలని అంది. మరుసటి రోజు వృద్ధురాలి ఇంటికి వెళ్లి వారి అకౌంట్‌లోని డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయానికి అవసరమైన అన్ని డాక్యుమెంట్లను తీసుకుంది. అవసరమైన చోట సంతకాలు పెట్టించుకుంది. ఆ తర్వాత 50 లక్షల రూపాయల్ని వేరే అకౌంట్‌కు పంపుకుంది. ఓ రోజు వృద్ధ దంపతులు అకౌంట్‌లో ఉన్న డబ్బులు చెక్ చేసుకున్నారు. 50 లక్షలు తక్కువగా ఉన్నాయి. ఆ డబ్బులు మొత్తం 13వ తేదీన వేరే అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ అయినట్లు తెలిసింది. దీంతో అనుమానం వచ్చిన వృద్ధురాలు బ్యాంకుకు వెళ్లింది. మేఘనను నిలదీసింది. 'మీరు చెప్పినట్లే డబ్బులు వేరే వాళ్లకు ట్రాన్స్‌ఫర్ చేశా'అంటూ బుకాయించింది. మోసపోయామని గుర్తించిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మేఘనను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. విలాసాలకు అలవాటు పడ్డ ఆమె ఇలా మోసానికి పాల్పడ్డట్టు తేలింది. లక్కీ బాస్కర్ సినిమా స్ఫూర్తితో డబ్బు కొట్టేసినట్లు మేఘన చెప్పింది. తనకు డబ్బు కొట్టేసే ఉద్దేశం లేదని,వ్యాపారంలో డబ్బులు పెట్టి, మళ్లీ తిరిగి ఇచ్చేదామనుకున్నానని చెప్పింది. పోలీసులు ఆ మొత్తం డబ్బును సీజ్ చేశారు.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : **SIRIKONDA AUGUSTIN . RNI No.: APTEL/2013/52694.** E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.